ఎమ్బీయస్ - గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2009 Q3 జులై - సెప్టెంబరు ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక

గీతా దత్
వేంకటేశ్వరుడి భార్యలెవరు?
వైయస్ - 1-20
అరాచకాంధ్ర 1-8

ఎమ్బీయస్: గీతా దత్

ఈ గాయని గురించి చెప్పబోయే ముందు ఆవిడ పాటలు కొన్ని గుర్తు చేస్తాను. కొన్ని క్లబ్ పాటలు, కొన్ని విరహగీతాలు, కొన్ని విషాద గీతాలు, మరి కొన్ని ప్రేమగీతాలు..

హౌరా బ్రిడ్జి లో పాట
మేరానామ్ చిన్‌చిన్ చూ - చిన్ చిన్ చూ బబ చిన్ చిన్ చూ
రాత్ చాందనీ మై ఔర్ తూ - హల్లో మిస్టర్ హౌ డుయుడూ ॥మేరా॥
బాబూజీ మై చీన్‌సే ఆయా - చీనీ జైసా దిల్ లాయా
సింగాపుర్ కా జోగన్ మేరా - శంఘూఈ కీ అంగ్‌డాయా ॥బాబూజీ॥
దిల్‌పర్ రఖ్‌లే హాత్ జరా - హోజ్జాయే న పాగల్ తూ ॥మేరానామ్॥

షర్త్ లో పాట
న యే చాంద్ హోగా - న తారే రహేంగే
మగర్ హమ్ హమేషా - తుమ్హారే రహేంగే ॥నయే॥
నజర్ ఢూండ్‌తీ థీ జిసే పాలియా హై - ఉమ్మీదొకె ఫూలోఉ సె దామన్ భరాహై
యే దిన్ హమ్‌కొ సబ్ దిన్‌సె ప్యారీ రహేంగ్టెఉ ॥న యే॥

సాహిబ్ బీబీ ఔర్ గులామ్ లో పాట
నజాఓ సైయ్యాఉ ఛుడాకే బయ్యా - కసమ్ తుమ్హారీ మై రో పడూంగీ....
మచల్ రహా హై సుహాగ్ మేరా - జో తుమ్ న హోంగే,
తో క్యా కరూంగీ... ॥నజా ఓ॥
యే బిఖరీ జుల్ఫే, ేఏ ఖిల్‌తా కజరా - యే మెహెకీ చున్‌రీ యే మన్‌కీ మదిరా యే సబ్ తుమ్హారే లియే హై ప్రీతమ్
- మై ఆజ్ తుమ్‌కో నజానే దూంగీ,

జానేన దూంగీ ॥నజా ఓ ॥
మైతుమ్హా రీ దాసీ, జనమ్‌కీ ప్యాసీ - తుమ్హీ హో మేరా సింగార్ ప్రీతమ్
తుమ్హా రే రాస్తే కీ ధూల్ లేకర్ - మై మాంగ్ అప్‌నీ సదా భరూంగీ...
సదా భరూంగీ ॥నజాఓ॥

**ఆర్ పార్ లో పాట**
**బాబుజీ ధీరే చల్‌నా ప్యార్ మే జరా సంభల్‌నా –**
**ఆ... బడే ధోఖేహై, బడే ధోఖే హై ఇక్ రాహ్ మే ॥బాబూజీ॥**
**క్యోం హెూ ఖోయే హువే సర్ ఝుకాయే –**
**జైసే జాతే హెూ సబ్ కుఛ్ లుటాయే**
**యేతో బాబూజీ పెహలా కదమ్ హై –**
**నజర్ ఆతే హై అప్‌నే పరాయే**
**హా... బడే ధోఖే హై బడే ధోఖేహై ఇక్ రాహ్‌మే ॥బాబూజీ॥**

**భాయిభాయి లో పాట**
**ఏ దిల్ ముఝే బతాదే యూ కిస్ పే ఆగయా హై –**
**వో కౌన్ హై జో ఆకర్ ఖ్వాబోంపే ఛాగయా హై ॥ఏ దిల్॥**
**మస్తీభరా చర్‌నా క్యోం రాత్ గా రహీహై ?**
**అంఖోఉ మే నీంద్ ఆకర్ క్యోం దూర్ జా రహీహై**
**దిల్ మే కోయీ సితమ్‌గల్ అర్ మా జగా గయాహై**
**వో కౌన్ హై జువాకర్ ఖ్వాబోంపే ఛాగా యా హై ॥ఏ దిల్॥**

లతా, ఆశాల గొంతులకు భిన్నంగా తనకంటూ ప్రత్యేకమైన హస్కీ వాయిస్‌తో పాడి లక్షలాది అభిమానులను సంపాదించుకున్న గాయని గీతాదత్. ఆమె ఎక్కువ సంఖ్యలో పాటలు పాడకపోయినా, పాడిన పాటలు మాత్రం ఆమె అభిమానులు ఎన్నటికీ మరువలేనివే! అంత గొప్ప గాయని అయితే అన్ని తక్కువ పాటలు మాత్రమే పాడడమేం? అని మీరడగవచ్చు. నిజానికి ఆమె జీవితగాథ ఆమె పాడిన ఏ గొప్ప విషాదగీతానికి తీసిపోదు. ఆమె జీవించినది 41 సంవత్సరాలు మాత్రమే! 1930 నవంబరులో పుట్టిన ఆమె 1972 జులైలో మరణించింది. మితిమీరిన తాగుడు వల్ల ఆమె లివర్‌కి సిరోసిస్ వచ్చింది.

ఆమె భర్త అంతకుముందే వ్యక్తిగత కారణాల వల్ల 1964లో ఆత్మహత్య చేసుకున్నాడు. వారి వైవాహిక జీవితమంతా ఒడిదుడుకులమయం. భార్యాభర్తలిద్దరూ సినీరంగానికి చెందినవారే కాబట్టి ఇద్దరిలో ఈర్ష్యాసూయలు కలిగివుంటాయని "అభిమాన్" సినిమాలోలా అతను యామె కంటె బాగా పాడలేక హింసించి వుంటాడని అనుకుంటే పొరబాటు. అతను గాయకుడు కాదు. దర్శకనిర్మాత. నటుడు కూడా. మరి యిద్దరి మధ్య సంఘర్షణ ఎందుకు? ఇది ఈమెకు యిష్టంలేని పెళ్లా? అబ్బే, ప్రేమవివాహమే!

గీతా దత్ కష్టాలన్నిటికీ మూలకారణం పెళ్లి కాబట్టి అక్కడే కథ మొదలుపెడదాం. వివాహానికి పూర్వం గీతా దత్ ఇంటిపేరు రాయ్. గీతా రాయ్ అనే పేరుతోనే అనేక సినిమాలలో పాటలు పాడింది. ప్రఖ్యాత దర్శక నిర్మాత గురు దత్‌తో 1953లో పెళ్లి అయిన తర్వాత ఆమె గీతా దత్ అయింది. స్త్రీలకు పెళ్లి అయిన తర్వాత పుట్టింటి పేరు బదులు భర్త ఇంటిపేరు వస్తుందనే సాంప్రదాయం ప్రకారమయితే ఆమె 'గీతా పడుకొనే' కావాలి. కానీ ఆమె భర్త అసలు పేరులో కొంతభాగం స్వీకరించి గీతాదత్ అయింది.

దత్ అనే ఇంటిపేరు బెంగాలీలలో, పంజాబీలలో ఉంది. (సునీల్‌దత్ పంజాబీ, ఉత్పల్‌దత్ బెంగాలీ). అందువల్ల గురుదత్ బెంగాలీ అని చాలామంది పొరబడతారు. కానీ అతను కర్ణాటకకు చెందిన సారస్వత బ్రాహ్మణ కులానికి చెందినవాడు. శ్యామ్ బెనగల్‌కు కజిన్. గీతా రాయ్ తల్లిదండ్రులు గురు దత్‌కు వివాహానికి అడ్డు చెప్పడానికి కారణాలలో ఒకటి – అతను బెంగాలీ కాకపోవడం.

గురుదత్ దర్శకత్వం వహించిన "బాజీ" (1951) ముహూర్తం నాడు గురుదత్ కుటుంబాన్ని కలిసేనాటికే గీతారాయ్ అనేకమంది కంపోజర్స్ వద్ద పనిచేసి పేరు తెచ్చుకుని ఉంది. ఆ రోజు ముహూర్తం షాటుగా "తబ్‌దీర్ సే బిగ్‌డీ హుయీ" పాటను గీతాబాలి పై చిత్రీకరిస్తున్నారు. ఆ పాట గీతారాయ్ పాడినదే. ఆ పాట రికార్డింగు టైములో ఆమెను చూసిన గురుదత్ మనసు పారేసుకున్నాడు.

తను ప్రసిద్ధ గాయకురాలయినా, అప్పటికి గురుదత్ పేరులేని దర్శకుడయినా ఆమె గురుదత్‌ను అభిమానించింది. వాళ్ల ఇంటికి తరచుగా వస్తూ పోతూ ఉండేది. కానీ ఆమె సంపాదనపై ఆధారపడిన తల్లిదండ్రులు ఆమె వివాహానికి సమ్మతించలేదు. దాంతో వారి వివాహానికి మూడేళ్లు ఆలస్యమయింది. ఈ లోపుల గురుదత్ తీసిన "బాజీ", "జాల్" హిట్ అయ్యాయి. "బాజ్" ఫెయిలయింది. చివరికి గురుదత్ గీతాను కల్యాణ్‌లోని హాజీ మలాంగ్ బాబా సమాధి వద్దకు తీసుకెళ్లి "నన్ను పెళ్లి చేసుకుంటావో, మీ అమ్మానాన్నా చెప్పిన ఆ బెంగాలీ కుర్రాణ్ని చేసుకుంటావో తేల్చి చెప్పు" అన్నాడు. గీతా తల్లిదండ్రులను ఎదిరించింది. వాళ్లు దిగిరాక తప్పలేదు.

1953 మే 26న వాళ్ల వివాహం సాంప్రదాయ బెంగాలీ పద్ధతిలో జరిగింది. పెళ్లికి దేవ్ ఆనంద్, వైజయంతిమాల, నూతన్,

మోతీలాల్ ఇత్యాదులు వచ్చారు. ఈ ప్రేమవివాహం పట్టుమని పదేళ్లు కూడా సవ్యంగా సాగలేదు.

గీతా దత్ జీవితం ఏ సినిమాకథకూ తీసిపోదు. 1930లో నవంబరు 23న ఆమె ఫరీద్‌పూర్‌లో పుట్టింది. ఆ వూరు ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో వుంది. ఆమె తండ్రి దేవేంద్రనాథ్ రాయ్ చౌధురి బాగా డబ్బున్న జమీందారు. ఆమె తల్లి అమియాకు కవిత్వం అంటే ప్రాణం. చిన్నప్పుడు ఆమె పాటలపై ఆసక్తి కనబడరచడం చూసి తలిదండ్రులు ఆమెకు పండిట్ హీరేంద్రనాథ్ చౌధురి వద్ద సంగీతం నేర్పించారు. పదేళ్ల పిల్లగా వుండగానే ఆమె శ్రద్ధగా సంగీతం అభ్యసించడం చూసి తలిదండ్రులు మురిసిపోయేవారు.

ఇంతలో 1942 క్విట్ యిండియా ఉద్యమం వచ్చింది. బెంగాల్‌లో సమస్యలు వచ్చిపడ్డాయి. చేతికి అందినంత మేర తీసుకుని తట్టాబుట్టా నెత్తిని పెట్టుకుని బయటపడవలసి వచ్చింది. రాయచౌధురిల కుటుంబం కూడా భూములు యిక్కడ వదిలేసి బొంబాయికి తరలి వెళ్లవలసి వచ్చింది. హఠాత్తుగా ఓడలు బళ్లయ్యాయి. ఆ వరుసలో ఆమె సంగీతపాఠాలపై బ్రేకు పడింది. అయితే అప్పటికే గీతా సంగీతంపై పట్టు సంపాదించుకుంది, హార్మోనియం వాయించగలిగే స్థాయికి చేరుకుంది. అందువల్ల తమ యింటి సెకండ్ ఫ్లోర్‌లో హార్మోనీ వేసుకుని కూచుని సంగీతసాధన చేసేది.

ఒకరోజు ఆమె వాయిస్ ఆ సెకండ్ ఫ్లోర్‌నుండి గాలిలో తేలుతూ పోయి కింది అంతస్తులో హనుమాన్ ప్రసాద్ ఆయన చెవిలో పడింది. ఆయన సినిమాలకు సంగీతం సమకూరుస్తాడు. ఈమె పాటకు ముగ్ధుడైన ఆయన యీవిడకు ఛాన్సు యివ్వడం సైతం జరిగింది. ఆ విధంగా "భక్త ప్రహ్లాద" (1946) నాటి సినిమాలో ఓ పాటలో రెండు లైన్లు పాడడం ద్వారా గీతా చిత్రరంగ ప్రవేశం జరిగింది. మామూలు పరిస్థితుల్లో ఆమె తలిదండ్రులు సమ్మతించేవారో లేదో కానీ ఆర్థిక దుస్థితి వారిని సరేననిపించింది. అప్పట్లో ఆమె పేరు గీతా రాయ్.

ఒక్కసారి ఆమె గొంతు విన్నవారెవరూ మర్చిపోలేరు. అందుకు మొదటి సినిమా తర్వాత ఆమెకు ఆరునెలల్లో ఆరు సినిమాలు వచ్చాయి. అయితే ఆ సినిమాలు గానీ, సినిమా పాటలు గానీ యిప్పుడెక్కడా దొరకటం లేదు. సినిమారంగంలో నిలదొక్కుకుంటున్న మరొక బెంగాలీ – సచిన్‌దేవ్ బర్మన్ ఈమెలో సానబట్టిన వజ్రాన్ని చూశాడు. తను చేయవలసినదల్లా పట్టుకెళ్లి షోకేస్‌లో పెట్టడమే అనుకున్నాడు. "దో భాయ్" (1947) అనే సినిమాలో పాడించాడు. దీనిలోనే ఆమె తొలి హిట్ సాంగ్ 'మేరా సుందర్ సప్‌నా టూట్ గయా' రూపు దిద్దుకున్నది. అప్పటికి ఆమె వయస్సు 17 సంవత్సరాలే. ఇంత చిన్న పిల్లేం పాడుతుంది? అంటున్న ప్రొడ్యూసర్ మాటను లక్ష్యపెట్టక బర్మన్ పాడించాడుబీ గీతా రాయ్ కెరియర్‌కు పునాది వేశాడు. దీనిలోనే యింకో మంచి పాట 'యాద్ కరోగే యాద్ కరోగే, యిక్ దిన్ హమ్‌కో యాద్ కరోగే'!

ఇక దాంతో పేరున్న సంగీతదర్శకులంతా ఆమెను పిలవసాగారు. సి. రామచంద్ర, ఘులామ్ హైదర్, గ్యాన్ దత్, హన్స్‌రాజ్ బెహల్.. యిలా. 1947 నుండి 1950లోపున ఆమె పాడిన పాటల్లో చెప్పుకోదగ్గవి – 'కంకర్ కంకర్ సే మై పూఛూ' ("హరహర మహాదేవ్"), 'సపేరా బీన్ బజాయేరే' ("పద్మిని"లో అశోక్‌కుమార్‌తో కలిసి పాడినది), 'కిస్మత్ మే బిఛడ్‌నా థా' ("షబ్నమ్"లో ముకేశ్‌తో) 'ఖయాలోం మే కిసీకీ యిస్ తరహ్ ఆయా నహీ కర్‌తే' ("బావ్‌రే నైన్" లో ముకేశ్‌తో) .. వీటితో బాటు బులో సి.రాణి సంగీతదర్శకత్వంలో "జోగన్"లో మీరా భజనలు – 'మత్ జా మత్ జా', 'మై తో గిర్‌ధర్ కే ఘర్ జావూ', 'ఘూంఘట్ కే పట్ ఖోల్ రే తోహే పియా మిలేంగే' యివన్నీ చెప్పుకోదగ్గవే.

వీటితో బాటు మరిచిపోదగ్గ పాటలూ వున్నాయి. పంకజ్ మల్లిక్ సంగీతదర్శకత్వంలో "జల్‌జలా"కై పాడిన అయిదు పాటలూ, సర్దూల్ ఖ్వాత్రా సంగీతదర్శకత్వంలోని "సన్ ఆఫ్ ఆలీబాబా" సినిమాలో ఏడు పాటలూ (సినిమాలో వున్నవే 8) హనుమాన్ ప్రసాద్ సంగీతం యిచ్చిన "ఉషా కిరణ్" లో పాటలూ – యివన్నీ ఆ బాపతే! అయితే అతి త్వరలోనే ఈ ఫేజ్ మారిపోయి, గీతా పాడిన ప్రతీపాటా హిట్ అయ్యే యుగం వచ్చింది. ఆమె 'తక్‌దీర్' మారే రోజు వచ్చింది.

1950లో ఎస్.డి.బర్మన్ గురుదత్ సినిమా "బాజీ"కి సంగీతదర్శకత్వం వహిస్తున్నాడు. గీతా చేత "తద్‌బీర్ సే బిగడీ హుయీ తక్‌దీర్ బనాలే" అని ఓ సాంగ్ పాడిస్తున్నాడు. ఆ రికార్డింగు సమయంలోనే గురుదత్ గీతాను చూసి మనసిచ్చాడు. గురుదత్ తొలిప్రేమ 19వ యేటనే మోసులు వేసింది. పూనాలో ప్రభాత్ స్టూడియోలో పనిచేసే రోజుల్లో విజయ అనే డాన్సర్‌ను ప్రేమించాడు. (గురుదత్ కూడా మంచి డాన్సర్). ఆమెకు ఒక వివాహితుడితో కూడా ఎఫయిర్ ఉంది.ఈ విజయ తన భర్తజోలికి రాకుండా చూడాలని ఆ పెద్దమనిషి భార్య ప్రయత్నించేది. దానిలో భాగంగానే ఆ అమ్మాయిని పెళ్ళి చేసేసుకోమని గురుదత్‌ను ప్రోద్బలం చేసేది. మొత్తానికి పెళ్లి జరక్కుండానే ఆ ఎఫయిర్ ముగిసి పోయింది.

ఇది విన్న గురుదత్ తల్లి వాసంతి పడుకొనే హైదరాబాద్‌లో ఉన్న తన కజిన్ కూతురు సువర్ణ అనే అమ్మాయితో గురుదత్ వివాహం నిశ్చయించింది. గురుదత్ సరేనన్నాడు. ఆ అమ్మాయితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేడు. పెళ్లి దగ్గరపడుతోందనగా ఈ విజయ వ్యవహారం సువర్ణకు చెప్పడం భావ్యమనుకున్నాడు గురుదత్. ఆ విషయం వివరంగా రాశాడు. దెబ్బకి ఆమె తల్లిదండ్రులు పెళ్లి కాన్సిల్ చేసేశారు. గురుదత్ ఫీలయ్యాడో లేదో ఎవరికీ తెలియదు కానీ మళ్లీ అతను ప్రేమ జోలికి పోలేదు – 1950లో గీతా రాయ్‌ను కలిసేదాకా! చూడగానే, వినగానే గుమ్మయిపోయాడు. గీతా కూడా అతని ప్రేమకు స్పందించింది.

ఇది గీతా జీవితంలో అత్యంత ఆనందదాయకమైన సమయం. డబ్బు, కీర్తి ఎలాగూ గడిస్తోంది. వీటితో బాటు ప్రేమించే హృదయాన్ని కూడా గెలుచుకుంది. నిజానికి అప్పటికి గురుదత్ యింకా స్థిరపడలేదు. విజయాన్ని చవి చూడలేదు. అయినా ఆమె

పట్టించుకోలేదు. అతన్ని వలచింది. అతను ఆమె డబ్బు కోసమే వెంట పడ్డాడని, తనకు డబ్బు రాగానే ఆమెను నిర్లక్ష్యం చేశాడని కొందరు అన్నారు. ''డబ్బుకోసమే గీతాను మా అబ్బాయి వరించాడని అనుకున్నారు కానీ ఆమె డబ్బుని మావాడు ఎన్నడూ తాకనైనా తాకలేదు. ఆమె డబ్బు ఎలా ఖర్చు పెట్టిందో అడగలేదు.'' అని అంది అతని తల్లి వాసంతి పడుకొనే.

గురుదత్, గీతా రాయ్‌ల ప్రణయం మూడేళ్లు సాగింది. ''బాజీ''లో యిందాకా చెప్పిన పాటతో బాటు 'సునో గజరియా గాయ్', 'యే కౌన్ ఆయా కి మేరే దునియా మే బహార్ ఆయీ' పాటలు కూడా ఓ పూవు పూపాయి. సినిమా కూడా హిట్ అయింది. గురుదత్ తన తర్వాతి సినిమా 'బాజ్' ప్లాన్ చేశాడు. ఈ లోపున ఓపి నయ్యర్ ఆమెకు మంచి హిట్స్ యిచ్చాడు. నిజానికి అతను సంగీతం యిచ్చిన ''ఆస్మాన్'' (1952) ఫెయిలయిపోయినా, దానిలో గీతా పాడిన 'దిల్ హై దీవానా' పాట మాత్రం చాలా బాగా వచ్చింది. 'దేఖో జాదే భరే మోరె నైన్' కూడా బాగుంటుంది. అయినా నయ్యర్ సినిమా ఫ్లాప్ అయింది కాబట్టి తన తరువాతి చిత్రం ''ఛమ్ ఛమా ఛమ్'' లో గీతా బదులు ఆశాను తీసుకున్నాడు. అదీ దెబ్బతింది. నయ్యర్ తనను రిపీట్ చేయలేదని గీతా మనసులో ఏమీ పెట్టుకోకుండా 'బాజ్'కు నయ్యర్‌ను గురుదత్‌కు రికమెండ్ చేసింది.

'బాజ్' సినిమాలో 'ఐ దిల్ ఐ దీవానే' 'జరా సామ్‌నే ఆ, జరా ఆంఖ్ మిలా' వంటి మంచి పాటలున్నాయి. అయినా నయ్యర్ దురదృష్టమో ఏమో యీ సినిమా కూడా ఫెయిలయ్యింది.

గీతా దత్‌కి హిందీ సంగీతరంగంలో ఒక ప్రత్యేక స్థానం వుండడానికి కారణం – ఆమె గొంతులో వున్న ప్రత్యేకత. ఆమె ముందు హిందీ రంగాన్ని ఏలినవారిలో చాలామంది పంజాబ్, సింధు ప్రాంతాలనుండి వచ్చినవారు. వాళ్ల గొంతుల్లో ఓ మగటిమి (గట్టిగా మాట్లాడితే ఓ బండతనం) వుండేది. 'నువ్వంటే పడిఛస్తున్నాను. విరహంతో వేగిపోతున్నాను మొర్రో' అని ప్రియుణ్ని ఉద్దేశించి గట్టిగా గొంతెత్తి పిలిచినట్లు వుండేవి. గీతా దత్ గొంతు దీనికి పూర్తిగా వ్యతిరేకం. ఆమెది బెంగాలీ స్టయిల్. 'నీ విరహంలో రగిలిపోతున్నాను' అని ఆవేదనతో విలపించినట్టు వుండేది.

''ప్యాసా'' సినిమాలో పాట చూస్తే నా పాయింటు మీకర్థమవుతుంది. గురుదత్, వహీదా ఓ మిద్దెమీద నిలబడి వుంటారు. కింద ఓ బిచ్చగత్తె మీరాబాయి కృష్ణుడిపై విరహంతో పాడిన భజన వంటిది 'ఆజ్ సజన్ మోహె అంగ్ లగాలే, జనమ్ సఫల్ హోజాయే' ఆలపిస్తోంది. ఇటు వహీదా గురుదత్‌కేసి ఆర్తితో, మూగప్రేమతో చూస్తోంది. రొమాంటిసిజం అంటే యిదిరా అనిపిస్తుంది.

''సాహెబ్ బీబీ ఔర్ గులామ్''తో 'పియా ఐసే జియా మే సమాయే గయోరే' వంటి హుషారుపాటలోనూ, 'చలే ఆవో చలే ఆవో, కహీ దూర్‌సే' వంటి విరహ గీతంలోనూ, 'న జావో సయ్యా, చుడాకే బయ్యా, కసమ్ తుమ్హారీ మై రో పడూంగీ' వంటి విషాదగీతంలోనూ – ఏ పాట చూసినా సరే గీతాలో పరిపూర్ణ స్త్రీ కనబడుతుంది. ఇటువంటిది ఆమె ముందుతరం గాయనీమణుల్లో కనబడదు. ఇలాటి భావగీతాలు పాడడంలోనే కాదు, సిల్కీ వాయిస్‌తో క్లబ్ సాంగ్స్ పాడడంలోనూ గీతాది అందె వేసిన చేయి. ఆమెది పూర్తి ఫెమినైన్ వాయిస్.

ఓ పి నయ్యర్ పంజాబీయే ఐనా ఆమెతో 'ప్రీతమ్ ఆన్ మిలో' పాడించి యిటువంటి విరహ భావగీతాలకు ఓ స్టాంపు కొట్టేశాడు. గీతా, ఓపి కాంబినేషన్‌లో ఎన్ని మంచి పాటలు వచ్చావో తెలియదు కానీ ఓపి జీవితంలో ఆశా భోన్స్‌లే ప్రవేశించింది. ఆమెను గీతా మూసలో తీర్చిదిద్దేసి అన్ని పాటలూ ఆమె చేతనే పాడించాడు ఓపి. గీతాను పూర్తిగా వదిలిపెట్టేశాడు.

ఇంకో పక్క లతా మంగేష్కర్ దూసుకుంటూ వచ్చేసింది. ఆవిడదీ యావిడ లాగే పూర్తి ఫెమినైన్ వాయిస్. పైగా గీతా గొంతు అందరూ హీరోయిన్లకు నప్పదు కానీ, లతా గొంతు అందరికీ నప్పేది. అందువల్ల గీతాకు రావలసిన అవకాశాలు లతాకు వెళ్లిపోయాయి. పైగా లతాకు లేనిది, గీతాకు భారంగా మారినది ఒకటుంది – అది వైవాహిక బంధ(న)ం!

గీతాను పెళ్లాడినప్పుడు గురుదత్ వద్ద ఏమీ లేదు. అందువల్ల డబ్బు కోసమే గీతాను పెళ్లాడాడని ఎవడో పాత్రికేయుడు (రాతల ద్వారానే) కూశాడు. గురుదత్ అహం దెబ్బతింది. అందువల్ల తనకు కాస్త డబ్బు రాగానే గీతాను బయటి సినిమాల్లో పాడడం మానేయమని ఒత్తిడి తెచ్చాడు. గీతాకు తన వృత్తి వదులుకోవడం యిష్టం లేదు. పైగా ఆమె చుట్టూ స్నేహితురాళ్లు చేరి ఆమెను ఎగదోసేవారు. 'మొగుడికి తెలియకుండా వెళ్లి పాడి వచ్చేయి' అని. అది సాధ్యపడే విషయమా? అవాళ్టికి ఎక్కడికి వెళ్లిందో తెలియకపోయినా, ఆ సినిమా రిలీజైన తర్వాతైనా తెలియకపోతుందా?

గీతా అదేమీ ఆలోచించలేదు. వెళ్లి పాడేసి, మొగుడు తిరిగి వచ్చేలోగా యింటికి వచ్చేసేది. పాట బయటకు వచ్చినపుడు 'నేను వద్దన్నా వెళ్లి పాడేవ'ని గురుదత్ కోపం తెచ్చుకునేవాడు. దానివల్ల యింట్లో గొడవలు పెరిగేవి. మొగుడికి తెలియకుండా పాడి వచ్చేయాలన్న తాపత్రయం వలన ఆమె కెరియర్ కూడా దెబ్బ తింది. ఎస్.డి.బర్మన్ వంటి పెర్‌ఫెక్షనిస్టుకి ఈమె గడియారం చూసుకుంటూ పాడడం నచ్చేది కాదు. ఆమె కివ్వాల్సిన పాటలు ఆశా వంటి వారికి యిచ్చేసేవాడు. ఈ విధంగా ఆమెను ఆదరించిన బర్మన్ వంటి వారు దూరమయ్యారు.

ఇవన్నీ చాలనట్టు వహీదా రెహమాన్ గొడవ ఒకటి. వహీదా రెహమాన్ ''రోజులు మారాయి'' సినిమాలో 'ఏరువాక సాగారోయ్' పాటలో నర్తించింది. ఎన్టీయార్ ఆమెకు ''జయసింహ''లో సెకండ్ హీరోయిన్ పాత్ర యిచ్చి నటింపజేశారు. ''మిస్సమ్మ'' సినిమాను హిందీలో తీయడానికి వీలుపడుతుందేమో చూద్దామని హైదరాబాద్ వచ్చిన గురుదత్ సినిమా హాల్లో ''జయసింహ'' చూసి వహీదాను మెచ్చారు. ''రోజులు మారాయి'' శతదినోత్సవ సభలో ప్రత్యక్షంగా కలిసి తన సినిమా ''సి ఐ డి''లో హీరోయిన్‌గా వేయడానికి హిందీ

రంగానికి ఆహ్వానించారు. ఇది 1955లో జరిగింది.

ఆ విధంగా ఆయన ద్వారా హిందీ రంగానికి వచ్చిన వహీదా రెహమాన్ గురుదత్‌కకు సన్నిహితురాలైంది. ఇది సహజంగా గీతాకు కోపం తెప్పించింది. గీతా, గురుదత్ యిద్దరూ స్వతహాగా మంచివారే కానీ యిద్దరికీ 'యిగో' ఎక్కువే! కళాకారులు కదా, మామూలు మనుష్యుల కంటె అహంభావం ఎక్కువ మోతాదులో వుంటుంది. పైగా గురుదత్ ఎవరో లోకానికి తెలియని రోజుల్లోనే గీతా గాయనిగా పేరు తెచ్చుకుంది. అటువంటిది యిప్పుడు అనామకురాలిగా పడి వుండడం బాధగా వుందనుకుంటే పైగా సవతి పోరొకటా?

ఇంట్లో ఘర్షణ కొని తెచ్చుకున్న గురుదత్ యిటు వహీదాను, అటు గీతాను ఎవరినీ వదులుకోవడానికి యిష్టపడలేదు. గీతాకానీ, వహీదా కానీ స్వంత వ్యక్తిత్వం, ప్రతిభ గల మహిళలు. ఎవరికి వారే గురుదత్ తమకే స్వంతం కావాలని ఆశించారు. ఇలాటి పరిస్థితుల్లో రెండు పడవల ప్రయాణం సాగించడం సాధ్యపడే విషయమా?

ఇంతలో "ప్యాసా" సినిమా 1957లో రిలీజైంది. వహీదా అభినయం, గీతా పాటలు బ్రహ్మాండంగా కుదిరాయి. సినిమా సూపర్ హిట్ కావడంతో గురుదత్‌కి విపరీతంగా పేరు, డబ్బు వచ్చిపడింది.

అప్పుడు "కాగజ్ కే ఫూల్" సినిమా తీశాడు. 1959లో రిలీజైన యీ సినిమా గురుదత్ ఆత్మకథ లాటిది. ఓ డైరక్టర్, అతనికి దూరంగా వుండే భార్య, అతనిచేత సినిమాలకు పరిచయం కాబడి ప్రియురాలిగా మారిన ఓ తార. కూతురు ఒత్తిడి వల్ల ఆ ప్రియురాలు దూరమవుతుంది. ఈ డైరక్టర్ వృత్తిలో కూడా పతనమవుతాడు. ఈ విషాదాంత సినిమా ఘోరంగా ఫెయిలయింది.

అపజయాన్ని నిభాయించుకోలేని గురుదత్ ఆత్మన్యూనతకు, డిప్రెషన్‌కు గురయ్యాడు. ఇటు గీతా తనను హీరోయిన్‌గా పెట్టి సినిమా తీయమని ఒత్తిడి తెచ్చింది. ఆమెను హీరోయిన్‌గా పెట్టి "గౌరీ" అని రంగుల సినిమాస్కోప్ సినిమా హిందీ, బెంగాలీ ద్విభాషా చిత్రం ఎనౌన్సు చేశాడు. కొద్దిగా తీసి ఆపేశాడు. నిజానికి గురుదత్ అనేక సినిమాలు అలాగే చేశాడు – కాస్త తీయడం, కాన్ఫిడెన్స్ లేక మధ్యలో మానేయడం.

కానీ యీ సినిమా వహీదా చెప్పిన మీదట ఆపేశాడని గీతాకు ఆమె స్నేహితురాళ్లు చెప్పిపెట్టారు. దాంతో ఆమె తోక తొక్కిన తాచయింది. అల్లరి పెట్టింది. బాధతో తాగడం మొదలెట్టింది. మొగుడితో పేచీ పడి ఇంట్లోంచి బయటకు వెళ్లిపోవడం, మళ్లీ రాజీ పడి వెనక్కి రావడం – యిలా కొన్నాళ్లు సాగింది. గురుదత్ కూడా తాగుబోతయిపోయాడు. డిప్రెషన్‌లోకి వెళ్లి ఆత్మహత్యా ప్రయత్నాలు చేసేవాడు. ఇంటి పరిస్థితులు యిలా వున్నా గురుదత్ కెరియర్ ముందుకు సాగింది. "కాగజ్ కే ఫూల్" తర్వాత డైరక్టర్‌గా పేరు వేసుకోకపోయినా గురుదత్ సినిమాలు తీయడం మానలేదు. తర్వాతి సినిమాలు హిట్ అయ్యాయి. వాటిలో వహీదా నటించింది, గీతా పాడింది.

నిజానికి గీతా, గురుదత్ విడాకులు పుచ్చేసుకున్నా కథ మరోలా వుండేది. అప్పుడు గురుదత్ వహీదాను చేసుకునేవాడేమో! కానీ అలాగ జరగలేదు. గీతాకు విడాకులిచ్చేస్తానని వహీదాకు గురుదత్ నచ్చచెపుతున్న సమయంలోనే గీతా గర్భవతి కావడం వహీదాను మండించింది. అతనికి గుడ్‌బై చెప్పేసింది. అది గురుదత్‌ను బాధించింది. ఆమె నటిస్తున్న సినిమా సెట్స్‌కి వెళ్లి అల్లరి పడ్డాడు. ఇటుచూస్తే గీతా అతన్ని విడిచి వెళ్లిపోయింది.

ఇలా చేతులారా జీవితాన్ని అల్లకల్లోలం చేసుకుని, అయోమయ పరిస్థితుల్లో "బహారే ఫిర్ భీ ఆయేంగే" సినిమా తీస్తుండగా గురుదత్ ఆత్మహత్య చేసుకున్నాడు. గీతా నిర్ఘాంతపోయింది. ఆమె వైవాహిక జీవితం అలా విషాదభరితం అయిపోయింది. గృహకలహాల వల్ల, త్రాగుడు వల్ల ఆమె ఆరోగ్యం దెబ్బతింది. భర్త పోయాక అడ్డు చెప్పేవారు లేరు కదాని మళ్లీ పాడడానికి ప్రయత్నాలు చేసింది. కానీ అప్పటికే ప్లేబ్యాక్ రంగంలో లతా, ఆశా పాతుకుపోయారు. "అనుభవ్" సినిమాలో కానూ రాయ్ పాడించి ఆమె గొంతు యింకా బాగానే వుందని లోకానికి నిరూపించాడు. కానీ ఒకసారి శ్రోతలకు దూరమయ్యాక మళ్లీ మార్కెట్ తెచ్చుకోవడం కష్టం. అందునా లతావంటి లౌక్యురాలు రాజ్యం చేస్తూండగా దాదాపు అసాధ్యమనే చెప్పాలి.

నిరాశా, నిస్పృహలతో గీతా తాగుడుకి మరింత బానిసై, కాలేయం వాపు (సిరోసిస్)తో మరణించింది. ఇది దాదాపు ఆత్మహత్య వంటిదే. అత్యంత విషాదకరమేమిటంటే గురుదత్, గీతాదత్ కుమారుల్లో ఒకడు దరిమిలా యవ్వనంలో వుండగానే ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విధంగా ఆ కుటుంబం శాపగ్రస్తమైన కుటుంబంగా మిగిలిపోయింది.

ఈ విషాదం మాట ఎలా వున్నా గీతా దత్ పాట విన్నవారెవరూ ఆమెను మర్చిపోలేరు. హృదయానికి హత్తుకుపోయేట్లు పాడడంలో ఆమె నేర్చిన కళ. పాటలో పూర్తిగా నిమగ్నమై పాడుతుందామె! వచ్చేవారం ఆమె పాడిన ఒక పాటను పరిచయం చేస్తాను.

ఇప్పుడు గీతాదత్ పాడిన ఒక పాటను గుర్తు చేసుకుందాం. దాని పేరు 'వక్త్ నే కియా' . "కాగజ్ కే ఫూల్" సినిమాలోని పాట. ఆమె పాడిన ఎన్నో గొప్ప పాటలుండగా ఈ ఫ్లాప్ సినిమాలో పాట ఎందుకు ఎంచుకున్నానన్న సందేహం మీకు రావచ్చు. ఈ పాటకు, ఆమె జీవితానికి సంబంధం వున్నట్టు తోచడమే దానికి కారణం.

ముందుగా సినిమా కథ గురించి కాస్త చెబుతాను. సిన్హా అనే ఓ సినిమా డైరక్టర్ వున్నాడు. చదువుకున్నవాడు. సినిమాలపై ఆసక్తితో సినిమారంగానికి వచ్చాడు. ఇతను సినిమారంగంలో రారాజు. అతని మాట వేదవాక్యంగా చెల్లుబాటవుతోంది. అయినా

అతని భార్యకు, అత్తమామలకు యీ సినిమారంగం రుచించదు. వాళ్లు ధనికులు. పెద్ద కుటుంబం వాళ్లు. ఇతని సినిమాల వ్యవహారం నచ్చక భార్య పుట్టింటికి వెళ్లి కూచుంది. వాళ్లకో కూతురు కూడా వుంది. బోర్డింగు స్కూల్లో చదువుతోంది. ఆమె అంటే యితనికి ప్రాణం.

ఈ పరిస్థితుల్లో అతను అనుకోకుండా ఓ వర్షం రోజున ఓ కాలేజీ విద్యార్థినిని కలిశాడు. ఓ చెట్టుకింద తారసపడిందామె. తడిసిపోతోందని గొడుగు యిచ్చాడు. మళ్లీ ఎలా తిరిగివ్వాలి అంటే 'ఫలానా స్టూడియోలో వుంటాను' అన్నాడు. ఆమె మర్నాడు గొడుగు పట్టుకుని స్టూడియోకి వచ్చింది. అక్కడ కెమెరాలు అవీ చూసి బెదిరిపోయింది. తెలియకుండానే కెమెరా వ్యూలోకి వచ్చేసింది. కెమెరా లెన్స్‌లోంచి చూస్తున్న సిన్హాకు యీ భీతహరిణేక్ష బాగా నచ్చింది.

అప్పుడతను "దేవదాసు" సినిమా డైరక్షన్ చేస్తూన్నాడు. హీరోయిన్‌తో పేచీ వచ్చింది. తీసి పారేస్తానన్నాడు. స్టుడియోవాళ్లు అతని మాట కాదనలేదు. కానీ హీరోయిన్ ఎవరన్నారు. ఆ జంఝాటనలో వుండగానే ఈ హరిణేక్ష రావడం, పార్వతి పాత్రకు యిలాటి అమ్మాయే తగినదని సిన్హా అనడం జరిగింది. ఆమెకు భయమేసినా నచ్చచెప్పి యితను వేయించాడు. ఆమె హీరోయిన్‌గా సక్సెసయింది. సినిమా తర్వాత సినిమా వచ్చింది. పెద్ద తార అయిపోయింది. వీళ్లిద్దరి మధ్యా సాన్నిహిత్యం పెరిగింది. కానీ ఇద్దరూ కలవలేని పరిస్థితి. ఎందుకంటే అతను అప్పటికే వివాహితుడు.

డైరక్టర్-హీరోయిన్ రొమాన్సు గురించి పేపర్లలో చెత్తచెత్తగా రాసేశారు. అవి సిన్హా కూతురు చదువుతున్న స్కూల్లో కూడా చర్చనీయాంశాలయ్యాయి. అతని కూతుర్ని సాటి విద్యార్థినులు ఏడిపించారు. ఆమె తండ్రి దగ్గరకు వచ్చి మొత్తుకుంది. "నువ్వయినా నా వద్ద వుండు." అన్నాడు తండ్రి. తను చేరువై, యీ హీరోయిన్ దూరమైతే తల్లితండ్రీ ఒక్కటవుతారని అనుకుంది కూతురు. వెళ్లి హీరోయిన్‌ను తండ్రి జీవితంలోంచి తప్పుకోమని కోరింది. సిన్హా వైవాహిక జీవితం బాగుపడడం కంటె నాకు కావలసినదేముంది? అంటూ ఆమె యీ వైభోగాలన్నీ వదులుకుని అడవుల్లో ఓ మారుమూల పల్లెలో పాఠాలు చెప్పుకోవడానికి వెళ్లిపోయింది.

అయితే కూతురు పథకం ఫలించలేదు. ఆమె తల్లి భర్త వద్దకు రాలేదు సరి కదా, కూతురు కస్టడీగురించి కేసు పెట్టింది. కోర్టు వారు ఆ పిల్ల తల్లి దగ్గరే వుండాలన్నారు. ఇక సిన్హాకు తోడంటూ లేకుండా పోయింది. భార్య, ప్రియురాలు, కూతురు – ఎవ్వరూ లేని జీవితం. అతను తాగుబోతై పోయాడు. వృత్తిపట్ల నిబద్ధత తగ్గింది. డైరక్షన్ సరిగ్గా చేయలేకపోయాడు. సినిమాలు ఫెయిలయ్యాయి. ఒకప్పుడు అతనికి జోహారన్న సినీ నిర్మాతలు అతన్ని నిర్దాక్షిణ్యంగా చూశారు. హీరోయిన్ తిరిగి వచ్చి అతన్ని ఆదుకోబోయింది. కానీ ఆమె దాక్షిణ్యం స్వీకరించడానికి యితని ఆత్మాభిమానం అడ్డువచ్చింది.

అతను చరిత్రపుటల్లో నలిగిపోయాడు. తన డ్రైవర్ యింట్లో తలదాచుకున్నాడు. జూనియర్ ఆర్టిస్టుగానైనా పొట్ట పోసుకుందామని స్టూడియోకి వెళ్లాడు. గతమంతా కళ్లముందు తిరిగింది. అవి తలచుకుంటూ, తలచుకుంటూ ఒక కుర్చీలో – యాదృచ్ఛికంగా అది డైరక్టర్స్ కుర్చీ – కూచుని ప్రాణాలు విడిచాడు. మర్నాడు ఉదయం స్టుడియో తలుపులు బార్లా తెరిచారు. వర్ధర్లంతా బిలబిలా లోపలకు వచ్చారు. వారిలో ఒకతను ఈయన్ని గుర్తు పట్టాడు కూడా. అందరూ భక్తి పురస్సరంగా దూరంగా నిలబడి చూస్తున్నారు.

అంతలోనే నిర్మాత వచ్చాడు. కాగితపు పూల సినిమా ప్రపంచంలో యిలాటి సెంటిమెంట్లకు అర్థం లేదని బాగా ఎరిగున్నవాడు. "ఆ శవాన్ని విసిరిపారేసి పని మొదలెట్టండి" అని ఒక్క అరుపు అరిచాడు. మళ్లీ ఎప్పటిలాగానే ఆర్క్ లైట్లు, కెమెరాలు, గిర్రున తిరిగే రీళ్లు, తెరపై కనబడదామనే ఆశతో మూగే శలభాలు.. – 'ది షో కంటిన్యూస్'..

ఇదీ తొలి భారతీయ సినిమా స్కోప్ చిత్రం "కాగజ్ కే ఫూల్" కథ. తెరవెనుక నడిచే సినిమా వ్యక్తుల జీవితాలను తెరకెక్కించి గుండెల్ని పిండిన యీ సినిమా కమ్మర్షియల్‌గా ఫెయిలయింది. కానీ తర్వాతి రిలీజుల్లో క్లాసిక్‌గా పేరు తెచ్చుకుంది. గీతా, గురు దత్‌ల కథ తెలిసిన మనకి వాళ్ల జీవితమే దీనిలో ప్రతిఫలించిందని అర్థమవుతుంది. డైరక్టర్ గురుదత్, ఆయన వెలుగులోకి తీసుకు వచ్చిన హీరోయిన్ వహీదా రెహమాన్. అతనికి దూరమైన భార్య గీతా.

నేను యిప్పుడు చెప్పబోయే పాట సినిమా మధ్యలో వస్తుంది. డైరక్టర్, హీరోయిన్ ఓ ఉదయం పూట స్టూడియోలో యిద్దరే కూచుని వుండగా పాట నేపథ్యంలో వస్తుంది. వాళ్లిద్దరికీ తెలుసు – తమ దారులు వేరని, తాము ఏకమవడం కష్టమని. ప్రేమలో పడ్డామని, దానికి గమ్యం ఏమిటో తమకే తెలియదని తెలుసు. ఈ పాట పిక్చరైజేషన్ గురించి విశేషంగా చెప్పుకుంటారు. గురుదత్, వహీదా వున్న చోట పైనుండి కాంతి పుంజాలు పడాలని గురుదత్ కోరాడు. ఫోటోగ్రాఫర్ వి.కె.మూర్తికి అలా ఎలా తీయాలో అర్థం కాలేదు. ఓ సారి ఓ స్టూడియో కుర్రాడు అద్దాలు పట్టుకెళుతూంటే కాంతి దానిలో ప్రతిఫలించి ఒక వెలుగు స్తంభం ఏర్పడిందని గ్రహించాడు. పైన అద్దాలు ఏర్పరచి ఈ షాటు తీశాడు.

"ప్యాసా" సినిమాలో సాహిర్ లుధియాన్వి, సచిన్ దేవ్ బర్మన్ కలిసి పనిచేశారు. సాహిర్ గొప్ప కవి. సంగీతదర్శకుడితో సమానంగా తనకు పారితోషికం వుండాలని పట్టుబట్టేవాడు. "ప్యాసా" తర్వాత బర్మన్ రేటు అనూహ్యంగా పెరిగిపోవడంతో ఈ సినిమాకి అంత రేటు సాహిర్‌కి యివ్వడానికి గురుదత్ సిద్ధపడలేదు. అందువల్ల కైఫీ ఆజ్మీని గేయరచయితగా తెచ్చుకున్నాడు. కైఫీ కూడా మంచి కవి. పాట అర్థం గ్రహిస్తే ఆ విషయం మీరూ ఒప్పుకుంటారు.

**పాట –**

**వక్త్ నే కియా క్యా హసీఉ సితమ్**
**తుమ్ రహే న తుమ్ హమ్ రహే న హమ్**

**బేకరార్ దిల్ యిస్ తరహ్ మిలే**
**జిస్ తరహ్ కభీ హమ్ జుదా న థే**
**తుమ్ భీ ఖోగయే, హమ్ భీ ఖోగయే**
**ఏక్ రాహ్ పర్ చల్‌కే దో కదమ్ ॥వక్త్॥**

**జాయేంగే కహాఉ పూఛ్‌తా నహీఉ**
**చల్ పడే మగర్ రాస్తా నహీ**
**క్యా తలాశ్ హై కుఛ్ పతా నహీ**
**బున్ రహే హై దిల్ ఖ్వాబ్ దమ్-బ-దమ్ ॥వక్త్॥**

ప్రేమలో పడిన వారి అవస్థ చెపుతున్నాడు కవి. సితమ్ అనడంలోనే ఓ చమత్కారం వుంది. సితమ్ అంటే అనర్థం, అత్యాచారం. అంటే యిది 'గృహిణిపై అత్యాచారం' వంటి అత్యాచారం వంటిది కాదు. 'వలపు దోచుకున్నాడు' లో దోపిడి వంటిది. హసీ సితమ్.. అందమైన అనర్థం. 'కాలం మనపై ఓ అందమైన అత్యాచారం చేసింది. ఈ ప్రేమలో పడ్డాక నువ్వు నువ్వుగా లేవు, నేను నేనుగా లేను.' అంటుంది పల్లవి.

కరార్ అంటే మనశ్శాంతి. బే అనే ఉపసర్గ చేరిస్తే 'లేదు' అని అర్థం. బేకరార్ అంటే శాంతి కరువైన.. అని అర్థం. శాంతిలేని రెండు హృదయాలు కలిసాయట. ఎంత యిదిగా కలిసాయంటే అవి అసలెప్పుడైనా విడిగా వున్నాయాని అనిపించేటంత! జుదా అంటే విడిగా వుండడం. 'వలపుబాటపై రెండు అడుగులు (కదమ్) వేసేటప్పటికి నువ్వూ వలపులో కొట్టుకుపోయావు, నేనూ కొట్టుకుపోయాను.' ఖోజానా అంటే 'లూజింగ్ వన్ సెల్ఫ్'.. లాస్ట్ యిన్ లవ్ అంటారు చూశారూ అది. తెలుగులో మనం అలా ప్రయోగించం. అందుకనే కొట్టుకుపోయామందాం. ఇది మొదటి చరణం.

ఇక రెండో చరణంలో – ప్రేమలో పడ్డాక జరిగేది చెపుతున్నాడు. 'ఈ పయనంలో ఎక్కడికి వెళుతున్నామో అడగం. నడక సాగిస్తున్నాం కానీ కాలిబాటే కానరాదు. ఏం వెతుకుతున్నామో (తలాశ్) మనకే తెలియదు. క్షణక్షణం (దమ్-బ-దమ్) హృదయాలు మాత్రం కలలు (ఖ్వాబ్) అల్లుతున్నాయి (బున్ రహే హై).'

తెర మీదా, తెర వెనుకా ఈ ప్రేమ సఫలం కాలేదు. గీతాదత్, గురుదత్‌ల జీవితాలను బలిగొంది. **– ఎమ్బీయస్ ప్రసాద్**

## ఎమ్బీయస్: వేంకటేశ్వరుడి భార్యలెవరు?

మొన్న తిరుపతిలో బ్రహ్మోత్సవాలు జరిగాయి కదా. వెళ్లి చూద్దామనిపించి రైలెక్కా! రైల్లో నా ఎదురుగుండా సీట్లో ఓ భార్యా, భర్తా ఉన్నారు. వాళ్లకు ఓ పదేళ్ల కొడుకు. పన్నెండేళ్ల కూతురు. రైలెక్కి దగ్గర్నుంచీ ఆవిడ స్వాతి వీక్లీ తెగ చదివేస్తోంది. వాళ్లాయన రైల్లో ఆడ ప్రయాణీకులందరినీ తెగ చదివేస్తున్నాడు. వాళ్ల అమ్మాయి మిల్స్ అండ్ బూన్స్ బట్టీ పట్టేస్తోంది. ఏ పనీ లేనివాడు ఆ పదేళ్ల కుర్రాడొకడే!

వాడికి వాళ్ల నాన్నలాగే పుస్తకాల మీద మోజు లేనట్టుంది. రైలు కిటికీలోంచి ఏవేవో చూడ్డం, అవేమిటని వాళ్ల నాన్నను చంపడం. ఈయన తను చూస్తున్నవాళ్లపైనుండి చూపు మళ్లించకుండానే 'అవంతేలేరా' అంటూండడం. వాడు బలవంతంగా ఆయన గడ్డం పట్టుకుని కిటికీ వైపు తిప్పి 'ఆ చెట్టు పేరేమిటి? ఈ స్టేషన్ ఊరికి దూరంగా కట్టారేం?' లాటి ప్రశ్నలు గుప్పించడం.

చివరకు ఆయనకు కోపం వచ్చేసి 'చొప్పదంటు ప్రశ్నలు వేస్తే ఛంపేస్తాను. ఇక్కడే కుదురుగా కూచో' అని కేకలేసి బెర్తు మీదకి ఎక్కించేశాడు. వాడు అక్కణ్నుంచి గోలపెట్టాడు. ఆవిడ పుస్తకం లోంచి తలెత్తి 'పిల్లాడు ఏవో అడుగుతూంటే విసుక్కుంటారేం? మీకన్నీ తెలుసంటారుగా, చెప్పి వూరుకోబెట్టచ్చుగా, అయినా మీరు చేసే రాచకార్యాలు, రాణీకార్యాలు ఏమున్నా యిక్కడ?' అని భర్తకు వాతలు పెట్టింది.

కుర్రాణ్ని కిందకు దింపుతూ తండ్రి కండిషన్ పెట్టేడు. నోర్ముసుకుంటేనే కిటికీ దగ్గర కూచోనిస్తానని. వాడు సరేనన్నాడు. 'నీకు ఏదైనా డౌటొస్తే అమ్మనడుగు, అమ్మ పుస్తకాలు అవీ బోల్డు చదువుతుంది' అన్నాడు. కుర్రాడు పరిస్థితి గమనించి నోర్ముసుకుని కిటికీ దగ్గర కూచున్నాడు. క్రమంగా చీకటి పడింది. బయట ఏమీ కనబట్టంలేదు. ఆ కుర్రాడికి బోరు కొట్టింది.

తల్లి దగ్గరకి చేరాడు. 'అమ్మా, మనం తిరుపతి వెళుతున్నాం కదూ, అక్కడ దేవుడు వెంకటేశ్వరుడు కదూ!' అన్నాడు.

తల్లి 'ఊ' అంది.

'ఆయనకు ఎంతమంది భార్యలమ్మా?' అని అడిగాడు.

అదిగో, అదండీ రైల్లో అవాళ్టి చర్చకు నాంది!

పిల్లవాడి ప్రశ్న వినగానే ఆవిడ పుస్తకంలోంచి తలెత్తి భర్తకేసి కోరగా చూసింది. రుసరుస లాడుతూ 'ఇలాటి ప్రశ్నలన్నీ మీ నాన్న నడుగు. ఎవరి కెందరు పెళ్లాలో ఆయనకే బాగా తెలుస్తాయి' అంది.

ఆ కుర్రాడికి వ్యంగ్యాలతో పని లేదు. తండ్రి దగ్గరకు వెళ్లి, 'నాన్నా, వెంకటేశ్వరస్వామికి ఎందరు భార్యలు నాన్నా?' అని అడిగాడు.

తండ్రి మొహంలో మందహాసం వెలిసింది. 'లీగల్ నంబర్ చెప్పాలో, ఇల్లీగల్ వాళ్లని కూడా కలిపి చెప్పాలో మీ అమ్మనడిగిరా' అన్నాడు, చతుర్లు విసరడంలో తానూ తక్కువ తినలేదని చాటుకుంటూ.

కుర్రాడికి ఇవన్నీ పట్టలేదు. 'చెప్పు నాన్నా' అన్నాడు గడ్డం పట్టుకుని. 'ఇద్దర్రా' అన్నాడు తండ్రి.

ఈ లోపునే మిల్స్ అండ్ బూన్స్ అక్క కలగజేసుకుంది. 'నీకు తెలీదురా బుజ్జీ, మొన్న వచ్చిన సినిమాలో బాలకృష్ణ సిమ్రాన్‌ను పెళ్లి చేసుకోనా వద్దా అని ఆలోచిస్తూంటే వెంకటేశ్వరుడికే ఇద్దరు భార్యలున్నారు కదా, నువ్వు మాత్రం నన్నూ మా చెల్లెల్నీ చేసుకోవచ్చుగా' అంటుందిగా...' అని తమ్ముడికి గుర్తు చేయబోయింది.

తల్లికి చిర్రెత్తుకొచ్చింది. 'వెధవ సినిమాలూ, వెధవ డైలాగులూ, చెప్పొచ్చావు పెద్ద ఆరిందాలా, నోర్ముసుకో' అని కూతుర్ని వీపు మీద చిన్న దెబ్బ వేసింది.

కుర్రాడి గోల కుర్రాడిదే! 'ఇద్దరా? ఎవరు నాన్నా వాళ్లు?' అన్నాడు మళ్లీ.

అజ్ఞానిని చూసి జాలిపడే జ్ఞానిలా తండ్రి కాస్త మందహసించి, 'ఒకరేమో అలివేలు, ఇంకోరు మంగతాయారు' అన్నాడు.

వాళ్లావిడ ఫక్కున నవ్వింది. నవ్వి, 'ఏడ్చినట్టే వుంది తెలివి' అంది.

'అయితే నువ్వే చెప్పు' అన్నాడాయన ఉక్రోషంగా.

'అలివేలు మంగతాయారు అన్నది ఆవిడ పూర్తి పేరు. అలివేలు మంగాపురం అని కింద తిరుపతిలో ఉండదూ, అదే ఆవిడ గుడి.'

'సరే, అయితే ఇంకో ఆవిడ పేరు చెప్పు చూదాం'

'పద్మావతి'

'మరి ఆవిడ గుడి ఎక్కడ వుంది?'

భార్య ఆలోచనలో పడింది. 'తిరుచానూరు' అంటారు, అక్కడుందా? ' అంది జనాంతికంగా.

'ఏడిసినట్టుంది, అందుకేనేమిటి నవ్వావ్! తిరుచానూరు అన్నా అలివేలు మంగాపురం అన్నా రెండూ ఒకటే!'

'మరి పద్మావతి గుడి ఎక్కడ?'

'అది చెప్పాల్సింది నువ్వు' భర్త గొంతులో వెటకారం. 'పిల్లలకు పురాణగాథలు చెప్పి తీర్చిదిద్దవలసిన బాధ్యత తల్లిది'!

ఈలోగా నా పక్కనున్నాయన చదువుతున్న పేపరు పక్కన పడేసి 'అయ్యా, మీరు కాస్త తమాయించాలి. అలివేలు మంగాపురంలో ఉన్న అమ్మవారి పేరు పద్మావతి. కావాలంటే అక్కడ యిచ్చే టిక్కెట్టు మీద కూడా పద్మావతి టెంపుల్ అనే రాసి వుంటుంది. చూడండి.' అన్నాడు.

'టిక్కెట్టెక్కడ చూస్తాం లెండి. టిక్కెట్టు కొనేదాకా హడావుడి. కొన్నాక క్యూలో తోపిడి. టిక్కెట్టు జేబులోంచి మాటిమాటికీ తీస్తే పర్సు పోతుందేమోనన్న భయం. వాడి చేతిలో పెట్టి చింపించేసుకునేదాకా చింతే తప్ప అదిచూసి చచ్చిందెక్కడ? ఎన్నిసార్లు వెళ్లినా – ఇప్పటికి నాలుగుసార్లు వెళ్లాం– ఇదే తంతు' అని వాపోయాడు భర్త.

ఈలోగా మాకు సైడ్ బెర్త్‌లో కూచున్నాయనకు సడన్‌గా గుర్తుకు వచ్చింది. 'వెంకటేశ్వరుడి భార్యలు ఇద్దరండి – శ్రీదేవీ, భూదేవీనీ. ఆయన ఉత్సవ విగ్రహానికి ఇటూ, అటూ నించుంటారు కదా! అక్కడ శ్రీదేవీ, భూదేవీ సహిత వెంకటేశ్వరస్వామి అని రాస్తారు.' అన్నాడు

'అవునండోయ్, కరక్టే, నాకూ ఇందాకట్నుంచి నోట్లో ఆడుతోంది. మీరే చెప్పేశారు' అన్నాడు ఆయన పక్కన కూచున్నాయన.

'మరయితే బీబీ నాంచారమ్మ..?' అని అడిగాడు నాకు ఎదురుగా కూచున్న భర్తగారు.

'అబ్బే, ఆవిడ గురించి జనాలు చెప్పుకోవడమే తప్ప టిటిడి వాళ్లు అధికారికంగా ఆవిణ్ని గుర్తించినట్టు కనబడదండీ' అన్నాడు సైడ్ బెర్తాయన.

స్వాతి చదువుతున్నావిడ సన్నగా భర్తతో 'మీకు ఇల్లీగల్ వ్యవహారాలమీదే మోజు. అందుకే బీబీ నాంచారమ్మగురించి అడిగారు' అంది.

'చాల్లే, జనాలు అంటూంటారు కాబట్టి అడిగాను. తిరుపతి దగ్గర్లో ఆవిడకు ఓ గుడి కూడా వుందని ఎవరో అంటేనూ..'

'ఏవో చెబుతారు. అయినా హిందూ దేవుడికి ముస్లిం భార్యేమిటి? ఇస్లాం అంటే ఈ మధ్య వచ్చింది. వెంకటేశ్వరుడంటే కలియుగం ప్రారంభమైన దగ్గర్నుంచీ వున్నాడు.' అని ఝాడించి పడేసింది భార్యామణి.

'బావుంది ఏదో తెలిసున్నాయన కనబడ్డారు కదాని సందేహాలు తీర్చుకుంటూంటే అదీ తప్పేనా ఏమిటి?' అని కసురుకున్నాడు భర్త.

ఆ సదరు తెలిసున్నాయన కాలరెగరేయబోతూండగానే ఆ పక్క కాబిన్‌లోంచి ఓ ప్రశ్న వినబడింది.

'శ్రీదేవి, భూదేవి అంటున్నారు. మరి పద్మావతి ఏమయిందండి?' అని.

వేంకటేశ్వరుడి ఇద్దరు భార్యలూ శ్రీదేవీ, భూదేవీ అని విజయవంతంగా ఒప్పించిన పెద్దమనిషి పద్మావతి ఎక్కడ ఫిట్ ఇన్ అవుతుందన్న ప్రశ్న రాగానే కంగారు పడ్డాడు.

కానీ తమాయించుకుని 'అదేనండి, పద్మావతి అంటే వీళ్లిద్దరిలో ఎవరో ఒకరి అవతారం అయివుంటుందండి' అన్నాడు.

'ఎవరి అవతారం అని?'

ఈలోపున ఇంకో ఆయన కలగజేసుకున్నాడు. 'ఈయన కోస్తున్నాడు సార్. భూదేవి అంటే విష్ణుమూర్తి వరాహావతారం ఎత్తినప్పటి భార్య! ఈ అవతారంలో భార్య కాదు.'

'అవునవును, హిరణ్యాక్షుడు భూమిని ఎత్తుకుపోయి దాచేస్తే విష్ణుమూర్తి వరాహరూపంలో భూదేవిని కాపాడి పెళ్లి చేసుకుంటాడు.'

ఇంకో ఆయన గొంతు సవరించుకున్నాడు. 'ఈ కథ నేను వినలేదు కానీ భూదేవి అంటే విష్ణుమూర్తి దగ్గరకు ఎప్పుడూ ఏడుస్తూ వస్తూంటుందండి. భలానా రాక్షసుడు పాపాలు చేసి భూభారం పెంచేసాడు. నువ్వు అవతారం ఎత్తి వాణ్ని చంపు అని రిక్వెస్టు చేయడానికి వస్తుంది తప్ప 'వాణ్ని చంపవేం?' అని భార్యగా దబాయించినట్టు కనబడదు. పైగా అప్పుడు కూడా లక్ష్మీదేవి విష్ణువు కాళ్లొత్తుతూ కనబడుతుంది తప్ప అక్కా, లోపలికి రా అనదు.' అన్నాడు.

'అది నిజమే కానీ, విష్ణుమూర్తికి ఇద్దరు భార్యలన్నమాట వాస్తవమండి. పెద్దావిడ జ్యేష్టాదేవి, చిన్నావిడ లక్ష్మీదేవి. జ్యేష్టాదేవి అంటే దరిద్రదేవత అన్నమాట, చిన్నావిడ లక్ష్మీదేవి అంటే ఐశ్వర్యదేవత అన్నమాట. బహుశా ఆ జ్యేష్టాదేవే ఈ భూదేవేమో!' అని ఇంకో ఆయన సంభాషణలో జొరబడ్డాడు.

'గురూ గారూ, మీరు పప్పులో కాలేశారు. జ్యేష్టాదేవి లక్ష్మీదేవి అక్కగారే గానీ విష్ణుమూర్తి భార్య కాదండి. ఆవిడ భర్త వరుణుడో, ఎవడోనండి.'

'భలేవారు సార్, చిన్నప్పుడు పెద్దబాలశిక్షలో ఆవిడ విష్ణుమూర్తి భార్య అనే వుందండి. పెద్దయ్యాక చదివినవి గుర్తుండవు కానీ, చిన్నప్పుడు యింట్లో పెద్దబాలశిక్ష బట్టీ వేయిస్తారుగా, బాగా గుర్తుండిపోయింది. స్త్రీ రూఢివాచక శబ్దములు అని ఓ చాప్టర్‌లో వుంటుంది. 'సంగనాచి, అతి చాతుర్యము కల స్త్రీ' అని, అలాగే 'జ్యేష్టాదేవి, విష్ణుదేవుని పెద్దభార్య, అద వృష్టహీనురాలు' అని వుంటుంది.'

'పెద్దబాలశిక్ష సంగతి తెలియదు కానీ, భూదేవి, జ్యేష్టాదేవీ ఒక్కరు కాదని మాత్రం నాకు గట్టిగా నమ్మకమండీ' అన్నాడు మొదటాయన.

ఇంతలో ఎవరో కేక పెట్టారు. 'నాకు గుర్తు వచ్చిదండోయ్! భూదేవి విష్ణుమూర్తి భార్యే. అంటే డైరక్టుగా కాదు, వరాహావతారంలో పెళ్లి చేసుకుంటాడు. వాళ్లిద్దరకూ పుట్టినవాడే నరకాసురుడు. కృష్ణుడూ, సత్యభామా కలిసి వాణ్ని చంపేస్తారు చూశారూ, వాడే!'

'అవునండోయ్, ఇది కరక్టే. ఇంకోటేమిటంటే సత్యభామ భూదేవి అవతారమేనట. దుర్మార్గాలు చేసాడని కన్నకొడుకు అనయినా చూడకుండా చంపి పారేస్తుంది.'

'భలేవారే, ఈ కథ మన సినిమా వాళ్లెవరో కల్పించి వుంటారు కానీ భూదేవి అవతారమూ కాదు, మరోటీ కాదు.' అని తేల్చేశాడు మరో ఆయన.

'పోన్లెండి, మధ్యలో సత్యభామ గొడవ ఎందుకు గానీ, భూదేవి వరాహమూర్తి అవతారంలో భార్య అనేదాంట్లో అందరం ఒప్పుకున్నాం కదా, మరి వేంకటేశ్వరుడికి భార్య ఎలా అయింది?'

'డైరక్టుగా కాదేమో, ఆవిడ అవతారం ఒక భార్యేమో!'

ఇందాకా పద్మావతి గురించి ప్రశ్న లేవనెత్తినాయన 'అలా అయితే పద్మావతి శ్రీదేవి, భూదేవుల్లో ఒకరి అవతారం అయివుంటుంది' అని సంభాషణను ఒక కొలిక్కి తెచ్చాడు.

'ఎవరి అవతారం?' అని అడిగాడు ప్రశ్నను తొలిసారిగా లేవనెత్తిన పదేళ్ల కుర్రాడు.

ఇంతలో రైల్లో ముష్టాడు ఎవరో పిలిచినట్టుగా వచ్చి 'శేషశైలా వాసా' పాట అందుకున్నాడు. 'శ్రీదేవి వంకకు చిలిపిగా చూడకు, అలిమేలు మంగకు అలుక రానీయకు' అని వాడు పాడగానే నా పక్కన ఇప్పటిదాకా మౌనంగా వింటున్న కాలేజీ కుర్రాడు 'యురేకా' అన్నట్టు అరిచాడు.

'విన్నారా సార్, శ్రీదేవి ఒకరు. రెండోది అలిమేలు మంగ అంటే భూదేవి. దట్స్ సింపుల్.'

ఆ అబ్బాయి బామ్మగారిలా వుంది. పక్కనే కూచుంది. 'ఏడిసినట్టుంది. సినిమా పాటలు పట్టుకుని తీర్మానాలు చేయకు. ఇదిగో నా దగ్గర దేవస్థానం వారు వేసిన పుస్తకం వుంది. పద్మావతి కథంతా వేశారు. అందులో ఎక్కడా ఆవిడ భూదేవి అవతారమని వేయలేదు.'

ఇంకో ఆయన ఆవిడకు వత్తాసు పలికాడు.'బామ్మగారు కరక్టుగా చెపుతున్నారు. పద్మావతి ఆకాశరాజు కూతురండి. కూతురంటే

పుట్టినది కాదు. సీతలాగే భూమిలో దొరుకుతుంది. వెంకటేశ్వరుడు ఈవిణ్ణి చూస్తాడు. లైక్ చేస్తాడు. తల్లి వకుళాదేవితో చెప్పి చూసి రమ్మంటాడు. తర్వాత ఎరుకలదానిలా వేషం వేసుకెళ్లి ఆవిడ మనసు తెలుసుకుంటాడు. చివరకు పెళ్లి చేసుకుంటాడు. అంతే తప్ప ఎవరిదో అవతారమనీ ఎక్కడా రాయలేదు.'

'కథంతా బాగానే చెప్పారుకానీ మేష్టారూ, అవతారం కాదని ఎవరూ రాయకపోవడమేమిటి? దేవస్థానం వాళ్లు వేసిన ఓ పుస్తకంలోనే నేనూ చదివాను. ఆవిడ వేదవతి అవతారమని.' అన్నాడు ఇంకో ఆయన.

'వేదవతి అంటే రావణాసురుడికి శాపం యిచ్చేసి బూడిద అయిపోతుంది ఆవిడా?' అని అడిగాడు ఒకాయన.

'యా, అసలు ఆవిడ ఒక ఋషి వేదాలు చదువుతూంటే ఉద్భవిస్తుందన్నమాట. అందుకే వేదవతి అని పేరు పెడతారు. అప్పుడొక రాక్షసుడు, వాడి పేరు దంభుడు అనుకుంటా, వాడొచ్చి ఈవిణ్ణిచ్చి మేరేజ్ చేయమంటాడు. ఈయన ఒప్పుకోడు. ఆ రాక్షసుడు ఋషిని చంపేస్తాడు. ఋషి భార్య కూడా చచ్చిపోతుంది. అప్పుడీ అమ్మాయి అడవుల కెళ్లి తపస్సు చేసుకోవడానికి వెళుతుంది...'

'ఐనో, ఐనో అప్పుడే రావణాసురుడు వచ్చి పట్టుకోబోతే శాపం యిచ్చేస్తుంది కదూ'

'శాపం యిచ్చేసి అగ్నిదేవుడిలో కలిసిపోతుందన్నమాట. అగ్నిదేవుడు ఆవిణ్ణి తన భార్య దగ్గిర అప్పగించి కన్నకూతురులా చూసుకో అంటాడు. రావణాసురుడు సీత నెత్తుకుపోదామని వచ్చినపుడు అగ్నిదేవుడు అసలు సీతను బదులు వేదవతిని ఆవిడ స్థానంలో పంపి, మళ్లీ రాములారు అగ్నిపరీక్ష చేయిస్తాడు చూడండి అప్పుడు మళ్లీ ఫిరాయించేస్తాడన్నమాట'

అది విని కాలేజీ కుర్రాడు నవ్వుతూ 'సీతా ఔర్ గీతాలా, సీతా ఔర్ వేదా అన్నమాట! ఛేంజింగ్ ప్లేసెస్! ఫన్నీ ! అయినా ఈ కథలో పద్మావతి ఎక్కణ్ణుంచి వచ్చింది?' అని అడిగాడు.

'డోంట్ మాక్ ఎట్ ఇట్! పురాణాల్లో వున్నది చెబుతున్నాను. అగ్నిదేవుడు వేదవతిని తీసుకుని రాముడి దగ్గిరకు వెళ్లి ఇదిగో ఈవిడ ఫలానా, నువ్వంటే యిష్టం. నీ గురించి ఇలా శాక్రిఫైస్ చేసి రిస్కుతీసుకుని లంకలో వుంది. పెళ్లి చేసుకో అంటాడు. రాముడు 'అలా కుదరదు, ఈ జన్మకు ఒక్కరే భార్య. వెంకటేశ్వరుడిగా అవతారం ఎత్తినపుడు అప్పుడు పద్మావతిగా పుడితే పెళ్లి చేసుకుంటాను' అంటాడు. అని కథ ముగించాడు.

వేదవతి కథంటూ ఈయన చెప్పినది కంపార్టుమెంటులో చాలామందికి నచ్చలేదు.

'మేష్టారూ, మీరిలాగ పురాణాలు మార్చేస్తే కుదరదు. సీత బదులు వేదవతి  వెళ్లడమేమిటండీ? ఆవిడే అచ్చగా సీతయితేనూ... రావణాసురుడు పట్టుకోబోతే భస్మమయిపోతుంది కదా... అప్పుడు లంకలో ఓ పద్మంలో పసిపాపలా పుడుతుంది. పండితులు వచ్చి ఆ పాప లంకకు అరిష్టం అని చెబితే అప్పుడు రాక్షసులు పట్టుకెళ్లి సముద్రంలో పడేస్తే అది మిథిలా నగరానికి కొట్టుకెళుతుంది. అక్కడే భూమిలో జనకుడికి దొరుకుతుంది.' అని ఒకాయన పోట్లాటకు వచ్చాడు.

'భేష్‌గా వుంది. మిథిలా నగరంలో సముద్రం ఎక్కడుందండి? అసలు యూపీలో సముద్రం వుందని జాగ్రఫీ తెలిసున్నవాడెవడూ అనడు. సముద్రంలో పడేయరు. రాక్షసులు పెట్టె తీసుకెళ్లి మిథిలలో భూమిలో పాతి పెట్టేస్తారు.' అన్నాడు కాలేజీ కుర్రాడు.

'మీరు "సీతారామకళ్యాణం" సినిమా చూసి మాట్లాడుతున్నారు. నేను బ్రహ్మ వైవర్త పురాణం చదివి మాట్లాడుతున్నాను.' అని ఇవతలాయన కోపం తెచ్చేసుకున్నాడు.

'పోన్లెండి, ఎలా వెళ్లినా వేదవతి సీత అంటారు కదా, సీత అంటే లక్ష్మి అవతారం. ఆవిడ పద్మావతిగా అవతరించడానికి స్కోపు లేదు కదా!?'

'అంటే పద్మావతి భూదేవి అవతారం కాదు, వేదవతి అవతారం కాదు. మరి!? లక్ష్మీదేవి అవతారమా?' అన్నాడు ఒకతను విసుగ్గా.

ఇంతలో బామ్మగారు కలగజేసుకుంది. 'మీరెవరూ సరిగా పుస్తకాలు చదవరులాగుంది. దేవస్థానం వాళ్లు వేసిన పుస్తకంలోంచే చెబుతున్నాను వినండి. భృగుమహర్షి పరీక్ష పెట్టాలని, విష్ణుమూర్తిని గుండెల మీద తంతాడు కదా. విష్ణుమూర్తి తెలివిగా వ్యవహరించి ఆయన్ని పంపేస్తాడు కానీ లక్ష్మీదేవికి కోపం వస్తుంది. దాంతో వైకుంఠం వదిలేసి కొల్లాపూర్ వెళ్లిపోతుంది. అప్పుడు విష్ణువు కూడా వైకుంఠం వదిలేసి తిరుగుతూ చివరికి పద్మావతిని పెళ్లి చేసుకుంటాడు.'

'అదేమిటి? లక్ష్మీదేవిని వెతికే పనిలేదా?' అని కోపం తెచ్చుకుంది స్వాతివీక్లీ ఆవిడ.

'అదేలే, పద్మావతిని పెళ్లి చేసుకునేముందు లక్ష్మీదేవిని పర్మిషను అడుగుతాడు. ఆవిడ కొల్లాపూర్ నుండి వచ్చి పెళ్లికి హాజరవుతుంది.'

'మరి ఆవిడకు కోపం ఇంకా పెరగలేదా?' అడిగింది మిల్స్ అండ్ బూన్స్ పాప.

'లేదులే, తర్వాత గుడి కట్టించినపుడు వచ్చి వుండమంటే లక్ష్మీదేవిని గుండెలమీద ఒకపక్కా, పద్మావతిని మరో పక్కా పెట్టుకుంటాడు వెంకటేశ్వరుడు.'

'అయితే వెంకటేశ్వరుడి గుండెల మీద వున్న ఇద్దరూ లక్ష్మీ, పద్మావతీ అన్నమాట! ఆ ముక్క ఇందాకటినుండీ చెప్పవేం?' అన్నాడు ఆ కాలేజీ కుర్రాడు బామ్మతో.

ఈ చర్చ జరుగుతూండగా ట్రెయిన్ రెండు, మూడు స్టేషన్‌లలో ఆగడం, కొంతమంది కొత్తవాళ్లు రైల్లో ఎక్కడం జరిగింది. అందులో అరవం తెలిసున్నాయన ఒకడూ, సంగీతం తెలిసున్నాయన ఒకడూ ఉన్నారు.

ఆ సంగీతం తెలిసున్నాయన 'వెంకటేశ్వరుడి గుండెల మీద పద్మావతి వుంటే అన్నమయ్య తన కీర్తనల్లో దేన్లోనూ పద్మావతి గురించి రాయలేదేం?' అని అడిగాడు.

ఆయన ప్రశ్న విని అందరం ఆయన వైపు తిరిగాం. 'నిజమాండీ, అన్నమయ్య రాసినవి ముప్ఫయివేలో, నలభైవేలో కీర్తనలు కీర్తనలు వున్నాయంటారు. దేన్లోనూ పద్మావతి పేరు లేదంటారా?' అని ఒకాయన ఆశ్చర్యంగా అడిగాడు.

'అంటే నేను అన్నీ చదివానని అనను కానీ, చాలాభాగం చదివేను. ఎంతసేపూ లక్ష్మీ దేవంటాడు, అలివేలు మంగ అంటాడు కానీ పద్మావతి అనలేదండి.' అన్నాడాయన వినయంగానే!

ఈ అరవం వచ్చినాయన దగ్గాడు. 'సామీ అలిమేలు మంగ అంటే ఏమిటనుకున్నారు? అలర్ మేల్ మంగై అంటే అలర్ – పువ్వు మేలై – మీద ఉన్న మంగై – స్త్రీ, మహిళ అని అర్థం. అదే తెలుగులో అలిమేల్ మంగ అయింది. అంటే పద్మావతే కదా'

ఇంకో ఆయన లాజిక్ లాగాడు. 'పద్మం మీద కూచున్నది లక్ష్మి కావచ్చుగా! పద్మావతే అవ్వాలని ఏముంది?' అని.

ఈ అన్నమయ్య భక్తుడుకి కాస్త ధైర్యం వచ్చినట్టుంది. 'ఆ మాటకొస్తే అన్నమాచార్య కీర్తనల్లో ఆయన తిరుచానూరుకు వెళ్లినట్టు ఎక్కడా లేదండి.' అన్నాడు.

'స్ట్రేంజ్, ఆయన అన్ని వూళ్లు తిరిగాడు. కంచీ, శ్రీరంగం అన్ని తిరిగినాయన తిరుచానూరుకు వెళ్లకుండా ఉంటాడా? అంటే అప్పటికి ఆ గుడి లేదన్నమాట. అన్నమాచార్య అంటే ఎప్పటివాడండి?'

'14 వందల..అదే, 15 వ శతాబ్దం అనుకోండి'

'అంటే ఆ గుడి సబ్సీక్వెంట్‌గా వచ్చివుంటుందేమో!'

సంగీతం వచ్చినాయన గొంతు సవరించుకున్నాడు. డాఎఎ పి.టి. జగన్నాథరావు గారని తాళ్లపాక వాజ్మయ పరిష్కర్తండి. ఆయన రాసిన పుస్తకం యిదిగో నా చేతిలో వుంది. దీని అనుబంధంలో వున్నది చదువుతాను, అందరూ వినండి – 'ఉదయగిరి శ్రీనివాసాచార్యులు గారు అనే ఆయన వెంకటేశ్వరా యూనివర్శిటీలో ప్రాచ్య పరిశోధనాలయ పుస్తకశాలలో పండితులు. ఆయన అన్నమయ్య గేయాలను పరిష్కరించి సంపుటాలుగా వెలువరించారు.. 17 వ సంపుటం పీఠికలో వారు స్పష్టంగా రాశారు. 'అన్నమయ్యగానీ, ఆయన పెద కుమారుడు గానీ, మనుమడు గానీ అలమేలు మంగకు ప్రత్యేక దేవాలయమున్నట్టు పేర్కొనలేదు. అన్నమయ్య కుమారుడు ఒక కీర్తనలో 'అదె వంటశాలలోని అలిమేలు మంగ' అని అన్నాడు. అంటే నేడు అక్కడ వకుళాదేవి పేరుతో పూజలందుకుంటున్న విగ్రహం అలమేలు మంగయే!

15 వ శతాబ్దంలో వేంకటత్తు రైవర్ అనే భక్తుడు ఊహించి వ్రాసిన శ్రీ వేంకటాచల మహాత్మ్యంలోనే వకుళ, తిరుచానూరు మంగ కల్పించబడ్డారు. ఇప్పుడు పద్మావతి గుడి వున్నచోట ఇదివరకు బాలకృష్ణుని గుడి వుండేది. '..ఇంకా ఏదో వుందనుకోండి. అందువలన.."

"ఇహ చెప్పకండి మహాప్రభో, మరింత కన్‌ఫ్యూజన్ తెచ్చిపెట్టారు. బాలకృష్ణుణ్ణి పద్మావతి ఎలా చేసేస్తారండీ, మరీ అన్యాయంగా.." అన్నారు ఇంకోరు.

ఇంతలో ఇంకో ఆయన కెవ్వుమని కేక పెట్టాడు. 'శ్రీరంగం అంటే గుర్తుకు వచ్చింది. వెంకటేశ్వరస్వామి ఇంకో భార్య పేరు ఆండాళ్లండి' అన్నాడు. అంతేకాదు మంచి ఉత్సాహంగా చెప్పుకుపోయాడు. "మా యింటి దగ్గిర ఆండాళ్ నిలయమని వుంది. అక్కడ ఆండాళ్‌కు, వెంకటేశ్వరస్వామికి కళ్యాణం చేస్తారు కూడాను. అదే కాదు, ఇంకా చాలా గుళ్లల్లో చూశాను కూడాను. వెంకటేశ్వరస్వామి విగ్రహం పక్కనున్న గుడిలో ఆండాళ్ విగ్రహం వుంటుంది. ఆయనకు ఓ భార్య పద్మావతి అయితే ఇంకో భార్య ఆండాళ్!" అని డిక్లేర్ చేశాడు.

"స్వామీ, మీరు ఏ లోకంలో వున్నారో! ఆండాళ్ అంటే గోదాదేవి. రంగనాయకులు భార్య. ఆవిణ్ణి హీరోయిన్‌గా పెట్టే కృష్ణదేవరాయలు 'ఆముక్త మాల్యద' కావ్యం రాశాడు. మీరు రంగనాయకులి పెళ్లాన్ని వెంకటేశ్వరస్వామికి కట్టబెట్టేయడం అన్యాయం.' అన్నాడు నా ఎదురుగా కూచున్న భర్త.

'ఆయనకూ మీలా ఇల్లీగల్ పనులు చేయడం సరదానేమో!' అని గొణిగింది, స్వాతి వీక్లీ పాఠకురాలైన ఆయన భార్య.

'రంగనాయకులు ఎవరు?' అడిగాడు ఓ అర్భకుడు.

'శ్రీరంగంలో వుంటాడు కదండీ. మన ఆంధ్రాలో నెల్లూరులో కూడా పెద్ద గుడి వుందీ, ఆయనే. విష్ణువు అవతారం కదా' అన్నాడు.

ఆండాళ్ భక్తుడికి కాస్త వూపిరి వచ్చింది. 'మీరంటూంటే నాకూ గుర్తుకు వచ్చింది. రంగనాథస్వామి పెళ్లి చేసుకున్నది ఆండాళ్‌నే! చిన్నప్పుడు పాఠం కూడా ఉండేది. విష్ణుచిత్తుడు కూతురు గోదాదేవి. తలలో పూలు ముడుచుకుని దేవుడికి పంపేది ఆవిడే! తిరుప్పావై కూడా రాసింది కూడాను. మరి ఆవిడకి వెంకటేశ్వరుడితో కళ్యాణం చేస్తారెందుకు?'

'ఆండాళ్, వెంకటేశ్వరస్వామి కనక్షన్ నేను చెబుతానుండండి' అని గొంతు సవరించుకున్నాడు అరవం తెలిసినాయన. "'దక్షిణభారతదేశం మీద ముస్లిమ్స్ దండయాత్రలు చేశారు కదా, ఎప్పుడంటే 1320 ఆ ప్రాంతంలో నన్నమాట. అప్పుడు హిందూ టెంపుల్స్ పగలకొట్టేస్తారేమోనని భయం వేసిందన్నమాట. శ్రీరంగం గుడిమీద పడతారేమోనని పూజారులు ఏం చేశారంటే గుడి మూసేసి మూలవిరాట్ ను అక్కడే అట్టేపెట్టి ఉత్సవ విగ్రహాలను తిరుపతి గుళ్లోకి తరలించారు."

''ఐనో, ఐనో తిరుపతి గుళ్లో రంగనాయక మండపం అని కూడా వుంది. అసలు అప్పణ్ణుంచే తిరుపతిలో ధనుర్మాసంలో తిరుప్పావై చదవడం ప్రారంభమైందిట.'' అని యింకో ఆయన సర్టిఫై చేశాడు.

చెప్పే ఆయనకి ఉత్సాహం వచ్చింది.''..ఇలా ఫార్టీ యియర్స్ పాటు రంగనాయకులు తిరుపతి గుళ్లోనే తలదాచుకున్నాడు. ముస్లిమ్ భయం పోయాక మళ్లీ శ్రీరంగం వెళ్లిపోయాడు. ఆయనతో బాటు ఆయన దేవేరి ఆండాళ్ కూడా తిరుపతికి రావడం, వెళ్లడం జరిగింది. అదీ వెంకటేశ్వరుడికి, ఆండాళ్‌కు ఉన్న కనక్షన్. అంతే తప్ప ఆండాళ్ వెంకటేశ్వరుడి భార్య కాదు. ఆండాళ్‌ను రంగనాయకి అంటారు కానీ వెంకటేశ్వరి అనరు..'' అని తేల్చిపారేశాడు.

''..అంటే వెంకటేశ్వరుడు ఆండాళ్ ఇల్లుగలాయన కానీ, ఇంటాయన కాదు. మరి వాళ్లిద్దరికీ కలిపి కళ్యాణం ఎలా చేసేస్తున్నారండీ మీ వాళ్లు?' అని గద్దించాడు ఇంకో ఆయన.

ఇందాకటి సైడు బెర్తాయన  కలగజేసుకున్నాడు. ''వెంకటేశ్వరుణ్ణి ఇల్లుగలాయన అనడం తప్పనుకుంటా. అసలు తిరుపతి క్షేత్రమంతా వరాహస్వామిది. ఆయన దగ్గిర ఈయన లీజుకి తీసుకున్నాడు. ప్రథమ దర్శనం, ప్రథమ నైవేద్యం అంటూ లీజు కండిషన్లు ఏవో పెట్టాడు వరాహస్వామి. ఆయన్ను చూశాకనే మనం వెంకటేశ్వరుణ్ణి చూడాలి.'' అంటూ చెప్పుకొచ్చాడు.

''వరాహస్వామి అంటే ఇందాకా మనం అనుకున్న భూదేవి మొగుడేగా! ఆ స్థలానికంతా వరాహస్వామి ల్యాండ్ లార్డ్ కాబట్టి భూదేవి వేంకటేశ్వరుడికి ల్యాండ్ లేడీ అన్నమాట.''

''దట్ మీన్స్, వేంకటేశ్వరుడికి ల్యాండ్ లేడీతో ఓ పక్క, టెనెంట్ భార్యతో ఓ పక్క పెళ్లి చేసిపడేశారన్నమాట'' అంటూ ఆశ్చర్యపోయాడు నా ఎదుటి బెర్తాయన.

''ఈ భక్తులు టూమచ్చండి. వావీ, వరసా చూడరు. దేవుణ్ణి ఎలా కావాలంటే అలా మార్చిపారేస్తారు. పాపం నోరులేని దేవుడు ఏమీఅనడు.'' అంటూ ఆవేశపడ్డాడు ఓ పెద్దాయన.

అరవం తెలిసినాయనకు ధైర్యం వచ్చినట్టుంది. ''అంతేనండీ, నిజానికి బీబీ నాంచారమ్మ కేసుకూడా అలాటిదేనటండి. ఇందాకా ముస్లిం ఇన్వేజన్స్ గురించి చెప్పాను కదండీ. వాళ్లు తిరపతిమీదకూడా పడతారేమోనని బీబీ నాంచారమ్మ కథ కల్పించారని అంటారండి. 'ఇదిగో ఈయన మీ ముస్లిముల అల్లుడేను, ఏం చెయ్యకండి' అని వాళ్లను బులిపించడం అన్నమాట.'' అన్నాడాయన.

క్రమంగా వేంకటేశ్వరస్వామి భార్యల చర్చ కంపార్టుమెంటంతా వేడెక్కించింది. పక్క కాబిన్ వాళ్లు కూడా వచ్చి మా దగ్గిర నిలబడ్డారు. ఎవళ్లకి తోచింది వాళ్లు చెబుతున్నారు. ఇంతలో కాలేజీ కుర్రాడి బామ్మగారు కలగజేసుకుంది.

''ఆండాళ్ గురించి ఇంత గొడవెందుకు నాయనా, ఎవళ్ల యిష్టం వాళ్లది. అందరూ లక్ష్మీదేవి అవతారమే కదా!'' అని ఏదో చెప్పబోయింది.

వాళ్ల మనుమడే రయ్యిమని లేచాడు. ''చాల్లే, గొప్పగా చెప్పావ్. సీతాదేవి లక్ష్మి అవతారం. కృష్ణుడు విష్ణువు అవతారం. కృష్ణుడి భార్య సీత అంటే నువ్వు ఒప్పుకుంటావా? ఆ మాటకొస్తే లక్ష్మిని వెంకటేశ్వరుడి భార్య అనడం కూడా తప్పు. ఆవిడ విష్ణువు భార్య అంతే! రాముడి భార్యాకాదు, కృష్ణుడి భార్యా కాదు, అలాగే వెంకటేశ్వరుడి భార్యా కాదు'' అని విరుచుకు పడ్డాడు.

బామ్మగారు నోరెత్తలేకపోయింది. ''ఇలాటి వితండవాదనలు చేయడం బట్టే పరీక్ష మూడుసార్లు పోయింది.'' అంది మనవడి నోరు మూయించాలని.

స్వాతి ఆవిడ భర్త నచ్చచెప్పబోయాడు. ''అలా అనకండి బామ్మగారూ, అతను చెప్పినదాంట్లో లాజిక్ వుంది. నా క్రితంజన్మలో భార్య అదిగో ఆ పూలమ్మి, అందుకని మేం కాపురం పెడతాం అంటే ఈ జన్మలోవున్న మా ఆవిడ ఒప్పుకుంటుందా?'' అని ఏదో చెప్పబోతూండగానే భార్య వాక్యం పూర్తి చేసింది ''..కాల్చి వాతలు పెడుతుంది' అని.

''అదే, మాట వరసకి చెబుతున్నా! రాముడి భార్య చెంచులక్ష్మి అన్నా, పరశురాముడి భార్య సీత అన్నా అలాగే వాతలు పెడతారండి.'' అన్నాడు.

సంభాషణ ఈ లెవెల్‌కి చేరేసరికి మిల్స్ అండ్ బూన్స్ అమ్మాయి ఇప్పటిదాకా జరిగింది సమప్ చేయబోయింది –

''అంటే బీబీ నాంచారమ్మను పక్కన పెట్టేస్తే వేంకటేశ్వర స్వామికి ఇద్దరు భార్యలన్నమాట. ఒకరు లక్ష్మీదేవి. ఇంకోరు పద్మావతి..కాదు శ్రీదేవి, భూదేవి.. అంతేనా అమ్మా?' అంటూ తల్లి కేసి చూసింది.

''ఏడిసినట్టుంది. శ్రీదేవి అంటే లక్ష్మీదేవి...'' అని తల్లి చెప్పింది.

''అంటే భూదేవి అంటే పద్మావతి కదా!?''

ఢిల్లీనుండి వచ్చినాయన ఒకాయన ఈ మధ్యలో చర్చలో జేరివున్నాడు. ''నో, నో. నేను టిటిడీ వెబ్‌సైట్‌లో చూశాను. పద్మావతి అంటే లక్ష్మీదేవే!'' అని అరిచాడు.

''వెబ్‌సైట్‌లో ఏం రాశారండీ?'' అని కుతూహలంగా ఓ మూడు, నాలుగు గొంతుకలు ప్రశ్నించాయి.

ఇక ఆయన తల కాస్త అటూ, ఇటూ తిప్పి కాస్త పోజు కొడుతూ ''యూనో, అసలు నేను కాటేజీ బుక్ చేద్దామని టిటిడి వెబ్‌సైట్ విజిట్ చేశానన్నమాట..'' అంటూ పురాణం యిప్పబోయాడు.

కాలేజీ కుర్రాడు అడ్డుకొట్టాడు. ''ఇప్పుడు యూఆర్ఎల్ దగ్గర్నుంచీ అంతా చెప్పనక్కరలేదు కానీ, టిటిడీ వెబ్‌సైట్‌లో వెంకటేశ్వరస్వామి

భార్యల గురించి ఏం రాశారో చెప్పండి చాలు." అంటూ విసుక్కున్నాడు.

"అలా ఏమీ లేదండి. ప్లేసెస్ టు విజిట్ ఎరౌండ్ తిరుపతి' అన్న హెడ్ కింద తిరుచానూరు అని వుంటే క్లిక్ చేశాను. అక్కడ రాశారు. 'భృగు మహర్షి విష్ణువును తంతాడు. అది విష్ణువు టోలరేట్ చేయడం, లక్ష్మీదేవి టోలరేట్ చేయలేకపోతుంది. కోపం వచ్చి పాతాళలోకం వెళ్లిపోతుంది. అక్కడ ఆకాశవాణి వినబడుతుంది – స్వర్ణముఖి నది ఒడ్డున, పుష్కరిణి సరస్సులో తపస్సు చేసుకో అని. అక్కడ విష్ణువు పన్నెండేళ్లు తపస్సు చేశాక, పదమూడో సంవత్సరంలో కార్తీక పంచమినాడు ఓ బంగారు పద్మంలో ఆవిర్భవిస్తుందన్నమాట. ప్రతి కార్తీక పంచమినాడు ఓ ఫెస్టివల్ కూడా చేస్తారుట. పద్మంలో పుట్టింది కాబట్టి పద్మావతి అన్నారేమో మరి!"

'వెబ్‌సైట్ మాట తెలియదు కానీ, యిదిగో నా చేతిలో టిటిడి వారు ప్రచురించిన తిరుపతి చరిత్రము పుస్తకంలోంచి పద్మావతీ దేవి ఆలయం గురించి ఉన్న అధ్యాయంలో ఏం ఉందంటే – 'లక్ష్మీదేవి వైకుంఠం వదలివచ్చేశాక కొల్లాపూర్ వెళ్లి వుంటుంది కదా, విష్ణువు కూడా అక్కడకు వచ్చి పదేళ్ల పాటు లక్ష్మీదేవిని అర్చిస్తాడు. అయినా ఆవిడ ప్రసన్నం కాదు. అప్పుడు అశరీరవాణి 'నువ్వు సువర్ణముఖీ తీరానికి వెళ్లు, ఓ సరస్సు తవ్వించి, దేవలోకం నుండి బంగారు పద్మాన్ని తెప్పించి తపస్సు చేయి, అప్పుడు లక్ష్మి ప్రసన్నురాలవుతుంది' అని చెప్తుంది. విష్ణువు అలాగ పన్నెండేళ్లు తపస్సు చేశాక లక్ష్మీదేవి ప్రసన్నురాలవుతుంది. అప్పుడు ఆ సరస్సుకు పద్మసరోవరమనీ, ఆ దేవికి పద్మావతి అని పేరు వస్తుంది. అదే అలర్‌మేల్ మంగ. పువ్వుపైన ఉన్న మహిళ!' అన్నాడు ఇంకో ఆయన.

ఇదంతా విన్నాక "అయితే లక్ష్మీదేవే పద్మావతి అని తేల్చారు." అన్నాడు కాలేజీ కుర్రాడు నిట్టూర్చి.

వాళ్ల బామ్మగారు చప్పరించింది. "ఈయనకేం తెలీదురా అబ్బాయ్, వెంకటేశ్వరుడి హృదయంలోనే లక్ష్మి వుంటుంది. ఆవిడే అలిమేలు మంగ. ఆయన చెప్పాడుగా అరవంలో అలిమేలు మంగ అంటే పువ్వుమీద కూచున్న స్త్రీ అని. అంటే లక్ష్మేగా!" అనేసింది.

"వెంకటేశ్వరుడి గుండెల మీద అటూ, ఇటూ కూడా దేవేరులు ఉంటారు బామ్మగారూ. ఒకళ్లు లక్ష్మి అయితే మరొకరు ఎవరని ప్రశ్న?"

"నన్ను చెప్పమంటారా?" అని ఓ కొత్త గొంతు వినబడింది. ఈయన ఇప్పుడే రైలెక్కినట్టున్నాడు. కానీ మంచి నాలెజబుల్‌గా మాట్లాడేడు. "ముందులో స్వామివారి విగ్రహం మీద ఒకరే దేవేరి వుండేదండి. అన్నమయ్యకూడా గుండెల మీద వున్న అలిమేలు మంగమీదనే కీర్తనలు రాశాడు. తర్వాత్తర్వాత అవతలివైపు ఇంకో అమ్మవారిని చేర్చారు..."

"..ఆ మాటకొస్తే శంఖ చక్రాదులు కూడా తర్వాతి కాలంలోనే చేర్చారట తెలుసా?" ఈయన ఇంకో కొత్తాయన. ముందాయన మాటల్ని అందరూ శ్రద్ధగా వినడంతో అసూయపడి ఈయన గొంతుపెంచి సంభాషణలో చొరబడ్డాడు

"రియల్లీ.." అంటూ కాలేజీ కుర్రాడు ఇంగ్లీషులో ఆశ్చర్యపడ్డాడు.

"అఫ్‌కోర్సు, యూనో దిసీజ్ ఆల్ డన్ బై రామానుజాచార్య. హీ .. ఆయన.. ఏం చేశారంటే మూల విరాట్ శివుడా? విష్ణువా? అన్న కాంట్రవర్సీ వచ్చినపుడు శంఖుచక్రాలు గుళ్లో పెట్టేసి గుడి తలుపులు మూయించేశాడట. మర్నాటికల్లా అవి విగ్రహానికి అతుక్కుని వున్నాయట. కొందరనేదేమిటంటే రామానుజులే రాత్రి పాము రూపంలో జలమార్గం, అంటే అభిషేకం నీళ్లు పోయే రాతి కాలువ ఉంటుంది చూశారా, దాని ద్వారా లోపలికి వెళ్లి శంఖుచక్రాలు ఏర్పాటు చేసి ఇది విష్ణువు అవతారం అని డిక్లేర్ చేశారుట."

ఈ రామానుజాచార్యుల కథ విన్నాక రైల్లో కాస్సేపు నిశ్శబ్దం ప్రవర్తిల్లింది. ఆ కాలేజీ కుర్రాడే నోరు పెగల్చుకుని "అలా అయిందంటారా? అన్‌బిలీవబుల్!" అన్నాడు.

అందరూ ఆలోచనలో పడ్డారు. మొదటాయన స్పాట్‌లైట్ తనమీదనుండి తప్పిపోతోందని చింతించడం మొదలెట్టి ఇంకో బాంబు పడేశాడు. "ఆ మాటకొస్తే ఈశ్వరుడు అని పేరులో వున్న విష్ణువు అవతారం మరోటి చూపించండి చూద్దాం." అని మరో ఛాలెంజ్ విసిరాడు.

స్వాతి వీక్లీ ఆవిడ వీక్లీ పక్కన పడేసి నోరు తెరుచుకుని వింటోంది. "తమాషాగా వుందే! రామానుజాచార్యుల వారు భలేగా చేశారే! ఎప్పటి ఆయన ఆయన? అదే ఏ శతాబ్దం?"

"11 వ శతాబ్దం మొదట్లోనేనండి. ఎర్లీ లెవెన్త్ సెంచరీనుండి ఎర్లీ ట్వెల్త్ సెంచరీ వరకు వున్నాడు. యాజ్ ఫార్ యాజ్ మై మెమరీ గోస్.. హీ లివ్డ్ మోర్ దాన్ హండ్రెడ్ ఇయర్స్..." అందమైన ఆడాళ్లతో ఇంగ్లీషులోనే మాట్లాడాలన్న నియమం మధ్యలో గుర్తు వచ్చినట్టుంది ఆయనకు!

ఆయన కొట్టేస్తున్న పోజు ఆవిడ భర్తకు నచ్చలేదులా వుంది. "మీరు చెప్పేదానికి ఆధారాలున్నాయాండి?" అన్నాడు.

అవతలి ఆయన "అఫ్‌కోర్స్, వేంకటేశ్వరస్వామికి బాలాజీ అన్నపేరు ఎందుకు వచ్చిందనుకుంటున్నారు?" అని అడిగాడు.

ఆయన అడిగిన ప్రశ్నకు ఎవరికీ జవాబు తోచలేదు. ఆయనే కాస్త చిరునవ్వు పడేసి చెప్పాడు. "బాలాజీ అంటే బాలాత్రిపుర సుందరి అన్నమాట. అది ఒరిజినల్‌గా అమ్మవారి విగ్రహం. ఆదిశంకరాచార్యులవారు ప్రతిష్టాపించి దానిముందు జనాకర్షణ యంత్రం పెట్టారు. అందుకే వెంకటేశ్వరుడికి అంత పాప్యులారిటీ." అన్నాడు.

స్వాతి వీక్లీ ఆవిడ భర్త లా పాయింటు లాగాడు. "ఈ విషయం ఆదిశంకరులవారి జీవిత చరిత్ర, శంకర విజయమో ఏదో దాంట్లో వుందా?" అని అడిగాడు.

ఈయన పోజుల రాయుడే కానీ ఆనెస్టు ఫెలోలా వున్నాడు. "లేనట్టుంది. అదే ఉన్నట్టు లేదు." అన్నాడు.

పోజులు కొట్టే ఆయనకు పోటీదారు పుంజుకున్నాడు. ''స్వామీ, బాలాజీ అంటే బాలామ్మవారు కాదు. బాలన్. కుమారస్వామి. ఆయనకు పక్కనే తిరుత్తణిలో కొండమీద ఆలయం. అలాగే తిరుపతిమీదా ఉండింది. పళని కూడా చూడండి. కొండే. అక్కడా ఆయన కోయిల్లే!''

''బాగుందండోయ్, కొండలన్నీ కుమారస్వామివేనా? శ్రీశైలం మీద ఈశ్వరుడు లేడా?''

''ఉన్నాడు సామీ, ఉన్నాడు. శివాలయమే కొండమీద వుంటుంది. ఈ వెంకటేశ్వర విగ్రహానికి కూడా నాగాభరణాలు వున్నాయి. ధనుర్మాసంలో బిల్వాలతో అర్చన చేస్తారు. జటామకుటం వుంది. గర్భాలయంలో కుక్కుట విగ్రహం వుంది. అభిషేకమప్పుడు ఉపయోగిస్తారు. కుక్కుటం స్కందుడి చిహ్నం...''

బాలాత్రిపురసుందరి భక్తుడు ఊరుకోలేదు. ''ఆ మాటకొస్తే ప్రతి శుక్రవారం పసుపు, కుంకుమలతో అర్చిస్తారు. ఆనంద నిలయ విమానం చుట్టూరా నాలుగుమూలల్లో సింహం వాహనాలు వున్నాయి. అంటే మూలవిరాట్ శక్తిరూపమైన విగ్రహమే!'' అన్నాడు.

బామ్మగారు గొంతు సవరించుకుంది. ''పసుపు, కుంకుమలతో పూజ అంటే.. స్వామివారి గుండెలమీద లక్ష్మీదేవిని పూజించడానికి అన్నమాట. అలాగే బిల్వార్చన అంటే లక్ష్మీదేవి బిల్వపత్రంలో వుంటుంది కదా. అందుకని బిల్వం పెట్టి పూజిస్తారు. అంతమాత్రం చేత శక్తి అవతారం అనవచ్చా?'' అంది.

''బామ్మా, వేరే లక్ష్మీ దేవాలయాల్లో బిల్వం పెట్టి పూజ చేస్తారా? పోనీ దీపావళికి నువ్వు పూజ చేస్తావు కదా, అప్పుడు బిల్వం ఉపయోగిస్తావా?'' అని అడిగాడు మనుమడు.

''చొప్పదంటు ప్రశ్నలు వేయకు. దేవుణ్ని ఏమైనా అంటే పరీక్ష మళ్లీ పోతుంది.'' అంటూ విసుక్కుంది ఆవిడ.

''అబ్బ, దేవుణ్ని ఎవ్వరూ ఏమీ అనటం లేదు లేవమ్మా! మహిమ గల దేవుడే వెంకటేశ్వరుడు. ఊరికే విషయం ఏమిటో తెలుసుకుందామని .. అంతే! ఆయన శివుడయితేనేం, విష్ణువైతేనేం మన కోరికలు తీర్చినంతకాలం మనకు యిష్టదైవం అంతే!''

కుర్రాడు ఆధునిక యుగానికి సరిగ్గా సరిపోయేవాడనిపించింది.

అరవం తెలిసున్నాయన చిన్నగా దగ్గి, ''సంభాషణ ఇంతదాకా వచ్చింది కాబట్టి చెబుతున్నాను. మా పక్కల ఏమనుకుంటారంటే, అది ముందులో ప్యూర్ శివాలయమేట. అమ్మవారి విగ్రహమో, లేకపోతే అర్ధనారీశ్వరుడి విగ్రహమోట! కొంతమంది మాత్రం శివుడు, విష్ణువు కలిసిన విగ్రహం...''

''.. అంటే అయ్యప్ప టైపా?'' మధ్యలో ఇంటరప్షన్.

''అబ్బే, అలాక్కాదు. స్త్రీమూర్తి మాత్రం వుందిటండి. శివుడు ప్లస్ మోహిని అవతారంలో విష్ణువు! తర్వాత రామానుజాచార్యులవారు దాన్ని వైష్ణవైట్ టెంపుల్ చేసినప్పుడు ఆ స్త్రీమూర్తిలో వున్న బ్రెస్ట్‌ను కవర్ చేయడానికి బొమ్మ పెట్టేసి వక్షస్థల లక్ష్మిగా ప్రకటించివుంటారు.''

''ముందులో చెస్ట్‌మీద ఒకరే అమ్మవారుండేది అని, ఆ తర్వాత రెండో బ్రెస్ట్ కూడా కవర్ చేయడానికి ఇంకో భార్యను కల్పించారని నేను విన్నానండి.'' అంది మరో కొత్తగొంతు.

మిల్స్ అండ్ బూన్స్ అమ్మాయి మళ్లీ సమప్ చేయబోయింది. 'దిస్ సీమ్స్ ప్లాజిబుల్. అందుకే రెండో భార్యమీద అంత కన్‌ఫ్యూజన్. ఒక భార్య అన్‌డౌటెడ్లీ లక్ష్మి. రెండో భార్యను కల్పించినపుడు కొందరు భూదేవి అన్నారు. మరి కొందరు పద్మావతి అన్నారు. యా మై రైట్?'' అంది అందర్నీ కలియజూస్తూ.

బామ్మగారు ఆ పిల్లకేసి మెచ్చుకోలుగా చూస్తూ భుజం తట్టింది. ఆ పిల్ల మరింత ఉత్సాహం పుంజుకుని ''కానీ భూదేవి అంటే వరాహమూర్తి భార్య. పద్మావతి అంటే కితం జన్మలో వేదవతి అని కొందరంటున్నారు. కాదు లక్ష్మీదేవే అని కొందరు అంటున్నారు. వేదవతే లక్ష్మీదేవి అని కొందరంటున్నారు.''

''అంటే పద్మావతి కథ అంతా కల్పించిందేనంటారా? ఐ డోంట్ బిలీవిట్! తిరుచానూరు గుడి చూడకపోతే తిరుమల గుడి చూసినా ఫలితం లేదంటారు!'' అంటూ వాపోయాడు ఒకాయన.

''కొత్తగా దేన్నైనా పాప్యులర్ చేసేటప్పుడే ఇటువంటి రూల్స్ పెడతారు సార్. వెయ్యికి పైగా శాసనాలు దొరికితే దాంట్లో దేంట్లోనూ పద్మావతి పేరు కనబడలేదట తెలుసా? మా మావయ్య ఆర్కియాలజీలో పనిచేస్తాడు, ఆయన చెప్పాడు.'' అన్నాడు ఒకాయన.

ఓ పెద్దాయన గొంతు సవరించుకున్నాడు. ''మాది బెంగుళూరండి. ఇందాకటినుండి మీ ఆర్గ్యుమెంట్స్ వింటున్నాను. వెంకటేశ్వరస్వామి గురించి ఆ మధ్య అంటే ఆగస్టు 2005లో ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో వచ్చిన ఆర్టికల్ 'మలయప్పస్వామి కథ' అని పేపరు కటింగ్ నా సూట్‌కేసులో వుంది. చూపించమంటారా?'' అన్నారు.

''ఇప్పుడు చదివే వోపిక లేదు. విషయం ఏమిటో చెప్పేయండి, చాలు'' అన్నాడు బామ్మగారి మనుమడు.

ఆయన చెప్పుకొచ్చాడు. ''అందులో ఏం రాశారంటే 1309లో మాలిక్ కాఫర్ సౌత్‌మీద పడ్డప్పుడు, తిరుమల గుడిమీదకు వస్తాడేమోనని భయపడి ఇద్దరు పురోహితులు ఉత్సవ విగ్రహాలను తీసుకుని కొండల్లోకి పారిపోయారటండి. తర్వాత చాలాకాలానికి అంటే 46 యేళ్ల తర్వాత ఆ పూజారుల అస్థిపంజరాలు, ఆ ఉత్సవ విగ్రహాలు బయటపడ్డాయి. అప్పట్లో రాజుగారైన శ్రీరంగనాథ యాదవ రాయలకు కబురు వెళ్లింది. ఆయన ఆ విగ్రహాలను శుద్ధి చేయించి, గుళ్లో పెట్టించాడట.

అలా పెట్టేటప్పుడు ఆ స్వామికి మలయప్పస్వామి అని పేరు పెట్టాడు. మలై అంటే కొండ. కొండలో దొరికాడు కాబట్టి మలయప్ప.

అంతవరకూ బాగానే వుంది. ఆయన పక్కన ఇద్దరు స్త్రీమూర్తులు ఉన్నారు. వాళ్లెవరు? ఏమో! ఈయనే శ్రీదేవి, భూదేవి అని పేర్లు పెట్టాడట. ఆ విధంగా శ్రీదేవి, భూదేవి పేర్లు ప్రాచుర్యంలో వచ్చివుంటాయి అని వ్యాసంలో భావం."

"ఇదేదో నమ్మేట్టుగానే వుంది. ముందునుండీ లేకుండా మధ్యలో యిలా అడ్డదిడ్డంగా పేర్లు పెట్టడం వలననే యింత కన్‌ఫ్యూజన్." అన్నాడు ఆ కుర్రాడు.

ఇంతలో రైల్వే పోలీసువాళ్లు వచ్చారు. అంతా ఒకచోట గుమిగూడడంతో కంగారు పడ్డారు.

"ఏటండీ, ఇదంతా?" అని అరిచారు.

"అబ్బే, వెంకటేశ్వరుడికి భార్యలెందరాని చర్చ జరుగుతోందండీ" అన్నాడు సైడ్ బెర్తాయన.

"ఆయనకి ఎంతమంది వుంటే మీకూ, నాకూ ఎందుండి? పదహారువేల మందిని మేన్‌టేన్ చేయగల కెపాసిటీ వుందాయనకు. నిరంతరం డబ్బొచ్చి పడుతోంది. మహిమ గల దేవుడు. దణ్ణం పెట్టుకుని ఊరుకోండి, చాలు." అని పోలీసుల్లో పెద్దాయన హితవు చెప్పబోయాడు.

"ఎంత మహిమ లేకపోతే మేమంతా కదిలి వస్తామండీ? ఊరికే ఎకడమిక్ డిస్కషన్." అంటూ ఆయన నాన్చాడు.

"టిటిడి వాళ్లకు ఉత్తరం రాయండి. 'మాకు ఇవీ డౌట్లు! అన్నీ క్లారిఫై చేస్తూ అథారిటేటివ్‌గా ఓ బుక్ వేయండి. స్వామివారి గుండెలమీద ఆచ్ఛాదన లేకుండా ఓ ఫోటో అందులో వేయండి. అర్చకులకు మాత్రమే తెలిసిన రహస్యాలను అందరికీ చెప్పండి.' అని అడగండి. 'తిరుమల కొండమీద వున్నది ఆడైనా, మగైనా, శివుడైనా, విష్ణువైనా, ఇద్దరు భార్యలున్నా, పదిమంది వున్నా మాకు పట్టింపులేదు. ఏ రూపంలో వున్నా కొలుస్తాం, అందుచేత అసలు విషయం చెప్పి పుణ్యం కట్టుకోండి' అని ఉత్తరం రాసి సంతకాలు పెట్టి పంపించండి. ప్రస్తుతానికి మాత్రం కిటికీ తలుపులు మూసి పడుక్కోండి. పది దాటింది. కావాలంటే తెల్లారఝామున లేచి డిస్కషన్ పెట్టుకోండి." అంటూ అక్షింతలు వేశాడు పోలీసు పెద్దాయన.

అంతేకాదు, దగ్గరుండి లైట్లు ఆర్పించి మరీ వెళ్లాడు.

పొద్దున్న రైలు దిగాక డిస్కషన్ సంగతి ఎవరికీ గుర్తున్నట్టు లేదు. దర్శనం క్యూల గురించి పరుగులు తీసేవారు కొందరైతే, కాటీజీలకై పరుగులు తీసేవాళ్లు కొందరు! **- ఎమ్బీయస్ ప్రసాద్**

**ఎమ్బీయస్ కబుర్లు 02-09-09 వైయస్ - 1**

పేపర్లలో, టీవీల్లో ఎటు చూసినా వైయస్ గురించిన కబుర్లే. ఆయన హెలికాప్టర్ మిస్సయిన దగ్గర్నుంచీ ప్రజలంతా ఉత్కంఠతో టీవీలకు అతుక్కుపోయారు. తీరా చూస్తే 24 గంటల తర్వాత పోయాడని తేల్చారు. మన ప్రభుత్వం అధికారిక ప్రకటన వెలువరించేదాకా తెలుగు ఛానెల్స్ మరణవార్తను ధృవీకరించలేదు. బతికే అవకాశం లేదని రాస్తే వైయస్ అభిమానులు స్టూడియోలపై దాడి చేస్తారేమోనని. ఉదయం 9 గంటల ప్రాంతంలో హెలికాప్టర్ కనుగొన్నారు అని చెప్పి వూరుకున్నారు కానీ అటు ఇంగ్లీషు ఛానెల్స్ 'హెలికాప్టర్ కాలిపోయింది, ఎవరూ బతికే ఛాన్సు లేదు' అని చెప్పేస్తున్నాయి. తెలుగు ఛానెల్స్ ఆ మాట అనకుండా ఆగాయి.

ప్రధాని, సోనియా అత్యవసర సమావేశం అన్నపుడే అర్థమై పోయింది, వారసుణ్ని వెతుకుతున్నారని. ఇంగ్లీషులో ఓ సామెత - 'కింగ్ ఈజ్ డెడ్. లాంగ్ లివ్ ద కింగ్' అని. రెండో వాక్యంలో 'కింగ్' కొత్తరాజు అన్నమాట. పాతరాజు పోగానే దేశం అరాచకంపాలు కాకుండా వారసుణ్ని వెతికేసి, ఆమోదింపజేసేసుకుని అప్పుడు పాతరాజు పోయినట్టు ప్రకటించడం ఆనవాయితీ. పాతరాజుకి జోహార్, కొత్తరాజుకి జిందాబాద్ రెండూ కలిపే చెప్తారు. ఇప్పుడూ అదే జరిగింది. వైయస్ పోయారు, రోశయ్య ఆపద్ధర్మ ముఖ్యమంత్రి అని ఒకేసారి ప్రకటించారు.

ఆ తర్వాత వైయస్ అంత్యక్రియలు. ఎప్పటిలాగానే సంతాపసందేశాలు. గంభీరమైన సంస్కృత పదాల్లో సంపాదకీయాలు. నన్ను కూడా వైయస్ గురించి రాయమని చాలామంది మెయిల్స్ రాశారు. నాకు వచ్చిన యిబ్బంది ఏమిటంటే 'పోయినందరూ మంచోళ్లు' అనే సిద్ధాంతం కాదు నాది. బతికున్నపుడు దుర్మార్గుడైన మనిషి చనిపోగానే మహనీయుడయిపోతాడంటే నేను నమ్మను. చనిపోయిన వాళ్ల గురించి చెడు పలకకూడదనే పద్ధతికి నేను మద్దతివ్వను.

మనిషి పోయినపుడైనా నిజానిజాలు మాట్లాడుకోవాలంటాను. అప్పుడు బతికున్నవాళ్లకు తెలిసివస్తుంది - ఈ రోజు మన అధికారం చూసి ఎవరూ నోరెత్తకపోయినా, రేపు పోయిన తర్వాత మన గురించి యిలా మాట్లాడుకుంటారు అనుకుని, బెదిరి కాస్త జాగ్రత్తగా వుంటారు. పోయినవాడు మారేదీ ఎలానూ సాధ్యం కాదు, బతికున్నవాళ్లయినా బాగుపడితే అదే చాలు.

ఎలిజీలన్నీ చూడండి - పోయినవాడు ఇంద్రుడు, చంద్రుడు అన్నట్టుంటాయి. స్వభావతహ కూడా నాకు ఇంద్రుళ్లు, చంద్రుళ్లు కనబడరు. గాంధీ గారు కానీయండి, ప్రకాశం గారు కానీయండి - నాకు వాళ్ల గొప్పతనం కనబడుతూనే లోపాలు కూడా కనబడతాయి. లోపాలున్నంత మాత్రాన మహానుభావుడు కాకుండా పోడన్న యింగితమూ వుంది. అంతమాత్రం చేత లోపాల మీద సున్నం పూసేసి, అదీ ఓ గొప్పలక్షణం అన్నట్టు భ్రమపడను, భ్రమపెట్టను.

'భానుమతి అహంభావే కానీ కొందరి విషయంలో అది అలంకారం కూడా. అహంకారం ఆమెకు వన్నె తెచ్చింది' అంటూ

రాస్తారు కొందరు. అహంభావం ఎవరికున్నా చెడ్డదే. అది అలంకారం కాదు, వన్నె తేదు అన్నది నా అభిప్రాయం. అహంభావం ఆమెకుందని, అది చెడ్డదని నువ్వు గ్రహించినప్పుడు ఆమె లక్షణాల్లో దాన్ని నెగటివ్ సైడ్ వేయవలసినదే! దాన్ని మసిపూసి మారేడుకాయ చేయనక్కరలేదు.

ఎలిజీల విషయంలో కుశ్వంత్ సింగ్‌ది ఒక ప్రత్యేక ధోరణి. ఎవరైనా పోగానే వాళ్ల చెడ్డలక్షణాలని ఆయన ఏకరువు పెడతాడు, అప్పటిదాకా ఆపుకుని కూచున్నట్టు. రెండూ రాసి బాలన్స్‌డ్‌గా రాస్తే వివాదం కాకపోను. కానీ ఆయన చెడ్డే రాస్తాడు. దానిమీద ఆయన్ని అనేకమంది విమర్శిస్తారు. ధీరేన్ భగత్ అనే ఓ జర్నలిస్టు కుశ్వంత్ సింగ్ పోతే ఆయన ఎలిజీ – కుశ్వంత్ సింగ్ అయితే ఎలా రాస్తాడో – రాసి ప్రచురించాడు. దానిలో అన్నీ కుశ్వంత్ సింగ్ అవలక్షణాలే!

ధీరేన్ కుశ్వంత సింగ్‌కి కుటుంబస్నేహితుడు. కుశ్వంత్ దాన్ని స్పోర్టివ్‌గా తీసుకుని నవ్వి వూరుకున్నాడు. ట్రాజిడీ ఏమిటంటే యిది రాసిన కొన్ని నెలలకే ధీరేన్ పోయేడు. కుశ్వత్ సింగ్ ఎలిజీ రాశాడు. 'నా కొడుకు వయసువాడు, ప్రతిభావంతుడు. నాకంటే ఎంతో ముందే పోయాడు' అంటూ వాపోయాడు. ఆ ఎలిజీలో ధీరేన్‌ని మెచ్చుకున్నాడు తప్ప తిట్టలేదు. తనపై అతను రాసిన ఎలిజీని గుర్తు చేసుకున్నాడు.

ఇదంతా ఎందుకు రాస్తున్నానంటే వైయస్‌పై నా ఎలిజీ మూసధోరణికి వ్యతిరేకంగా వుంటే నన్ను తిట్టుకోవద్దు. వైయస్‌పై యిదివరకు నేను వెలిబుచ్చిన అభిప్రాయాలనే మళ్లీ ఏకరువు పెడతాను, అప్‌టుడేట్ చేస్తాను తప్ప ఆయన దుర్మరణం పాలయ్యాడు కదాని అర్జంటుగా అభిప్రాయాలు మార్చేసుకోను.

2009 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గెలిచే అవకాశాలున్నాయని రాసినందుకు నన్ను కొందరు పాఠకులు కాంగ్రెస్ ఏజంటు అన్నారు. తనకు అనుకూలంగా రాయమని వైయస్ నాకు డైరక్టుగా లంచాలు యిస్తున్నాడని ఆరోపించారు. ఇద్దరు, ముగ్గురయితే నాకు ఎప్పుడు మెయిల్ రాసినా 'హాయ్ వైయస్ ఫ్యాన్' అంటూ సంబోధిస్తారు. ఈ పిల్లచేష్టలు చూసి నేను నవ్వుకుంటాను. నా రాతలు వైయస్ దృష్టిదాకా పోనే పోవని నాకు తెలుసు. ఇక నాకు లంచాలు పెట్టే సందర్భం ఎందుకు వస్తుంది? ఒకవేళ పెడదామనుకున్నా, నాది లంచాలు తినే స్వభావం కాదే!

అందువలన పదాడంబరాలకు పోక, తేలిక పదాలలోనే వైయస్ గురించి నిష్పక్షపాతంగా బేరీజు వేసుకుని చూదాం.

2

వైయస్‌కున్న ప్రజాదరణ గురించి ఆయన బతికున్నంతకాలం ఎవరికీ పూర్తి అంచనా చిక్కలేదు. ఆయన జనంలోకి వెళితే ప్రజలు వస్తున్నారు. (చిక్కేమిటంటే ప్రజలు అందరికీ వచ్చారు) ఇంకో పక్క పేపర్లు చూస్తే ఆయన మూర్తీభవించిన అవినీతి అని వ్యాసాలు వార్తలు వస్తున్నాయి. ప్రజలు చెప్పులతో కొట్టడానికి వస్తున్నారని కార్టూన్లు వస్తున్నాయి. వైయస్ గురించి ఏ మంచిమాట అన్నా మేధావులు నొసలు చిట్లించి అవినీతిని ప్రోత్సహించేవాణ్ని చూసినట్టుగా తిరస్కారభావంతో చూశారు. పట్టణాల్లోనే యీ స్థితి తప్ప, పల్లెల్లో అతన్ని నెత్తిమీద పెట్టుకుంటున్నారనీ, ప్రతీ కుటుంబం ఏదో పథకం ద్వారా లబ్ధి పొందిందని కొందరు చెప్తూ వచ్చారు. వైయస్ పదవిలో వుండకపోతే వర్షాలు కురవవనే మూఢనమ్మకంతో కొట్టుమిట్టులాడుతున్నారని పల్లెప్రజలపై కొందరు జాలి పడ్డారు కూడా.

కానీ ఎలక్షన్ ఫలితాలు వెలువడ్డాక అందరూ అవాక్కయ్యారు. వైయస్ పట్ల అంత ప్రతికూలత లేదని తేలిపోయింది, కాంగ్రెస్‌ని మళ్లీ గెలిపించడంతో. అలా అని మరీ సానుకూలతా లేదని తెలిసింది – బొటాబొటీగా గట్టెక్కించడంతో. అంటే అర్థమేమిటి? నీ మార్గం కరెక్టే గానీ, చాలా పొరబాట్లు జరిగాయి, జాగ్రత్తగా వుండు, అహంభావం తగ్గించుకో అని హితవు చెప్పినట్టయింది – అని నేననుకుంటున్నాను. టిడిపి అండు కోల నడిగితే యిదంతా యివిఎంల మాయాజాలం తప్ప వైయస్‌కు ప్రజాదరణ లేదు అని వాదిస్తారు.

మరి వైయస్ పోయిన తర్వాత దృశ్యం ఏమిటి? ఇంతమంది అతనికోసం ఆత్మహత్యలు చేసుకోవడమా? అతని అంత్యక్రియలు చూసి గుండెపోటుతో మరణించడమా? నిజంగానే వైయస్ అంటే ప్రజలు యింత పడి'ఛస్తారా'? కొన్ని సహజమరణాలను కూడా యీ ఎక్కవుంటులో కలిపేశారనీ, సగానికి సగం అతిశయోక్తులనీ కొట్టిపారేసినా కనీసం 50, 60 మంది అతనికోసం ప్రాణాలు విడిచినవారే వున్నారే! ఇది ప్రపంచ రికార్డేమో! అన్నాదురై పోయినప్పుడు, ఎన్టీయార్ పోయినప్పుడు కూడా యీ స్థాయిలో శోకతప్తులు కాలేదే! ఇంతమంది అసువులు బాయలేదే! వారి కంటె గొప్పవాడా వైయస్?

అన్నాదురై ఎక్కడో తమిళనాడు వాడనుకోండి. తెలుగుజాతికి గౌరవం తెచ్చిన ఎన్టీయార్ సంగతేమిటి? వెండితెరను శాసించాడు, రాజకీయరంగంలో తనదంటూ ముద్ర వేశాడు. అంత్యక్రియలకు అశేషజనం వచ్చారు. బహుశా వైయస్ కంటె ఎక్కువ వచ్చారేమో! కానీ యీ స్థాయిలో శోకం వ్యక్తం కాలేదు. ఎందుచేత? ఒకటి – ఆయన అప్పటికే వృద్ధుడయ్యాడు, అనారోగ్యపీడితుడయ్యాడు. వైయస్ విషయంలో అయితే 60 పూర్తవగానే పోయాడు. అంటే ఎన్టీయార్ ఆయుర్దాయం కంటె దాదాపు 15 ఏళ్లు తక్కు ఆయుర్దాయం. పైగా అనారోగ్యం లేదు. నవ్వుతూ నవ్వుతూ వున్న వ్యక్తి ఒక్కసారి మాయమయ్యేసరికి పరాయివాడికి కూడా అయ్యో అనిపించింది.

రెండు – పోయేనాటికి ఎన్టీయార్ పదవీచ్యుతుడై వున్నాడు. ప్రజలకు ఏమీ చేయలేని స్థితిలో వున్నాడు. చంద్రబాబును దూషించే మూడ్‌లో తప్ప పాజిటివ్ మూడ్‌లో లేడు. వైయస్ విషయంలో నైతే అతను ఉత్సాహంతో వురకలు వేస్తున్నాడు. రెండో సారి ఎన్నికైన హుషారుగా కొత్త పథకాలు వేస్తున్నాడు. అప్పోజిషన్‌తో ఆడుకుంటూ, వూగిసలాడేవారిలో ఆశలు రేకెత్తిస్తూ, తనవారిని ఉత్సాహపరుస్తూ ఇప్పట్లో తనకు ఎదురే లేదన్నంత హుషారులో వున్నాడు. పైగా ప్రజలకు మరింత చేరువ కావడానికి రచ్చబండ కార్యక్రమాన్ని రూపొందించి, తన పాలనలో లోటుపాట్లు కనుగొనడానికి సర్‌ప్రైజ్ విజిట్ ప్లాన్ చేసి దానికోసం వెళుతూ మధ్యలో ప్రాణం పోగొట్టుకున్నాడు. అంటే డైడ్ ఆన్ డ్యూటీ అన్నమాట. ఇదే కుటుంబంతో విలాసయాత్ర గడపడానికి వెళుతూ పోయి వుంటే యింత బాధ వుండేది కాదేమో!

మూడు – ఎన్టీయార్ పోయిన తర్వాత ఎవరు ఎంత ఆకాశానికి ఎత్తివేసినా పోయేనాటికి ఆయనకు పెద్దగా ప్రజాభిమానం లేదు. కొత్తపెళ్లాం మోజులో బాధ్యతలు విస్మరించిన మతిమాలిన మహారాజు పాత్రలోనే ఆయన్ని జనం చూశారు. అందుచేత చంద్రబాబు వెన్నుపోటు తర్వాత బహిరంగ సభలకు వెళ్లి తన గోడు వినిపించినా ఆ సభలు విజయవంతం కాలేదు. ప్రజలు పెద్దగా పట్టించుకోలేదు. నాదెండ్ల వెన్నుపోటు సమయానికి, చంద్రబాబు వెన్నుపోటు సమయానికి హస్తిమశకాంతరం వున్న సంగతి గ్రహించే ఎన్టీయార్ ఖిన్నుడయ్యారు. ఆయన అహం దెబ్బతింది. అదే ఆయన మృత్యువుకి హేతువు కావచ్చు. ఆయన పోయిన తర్వాత ఆ సింపతీని ఎన్‌క్యాష్ చేసుకోబోయిన లక్ష్మీపార్వతి పార్టీని ప్రజలు ఆదరించలేదని యిక్కడ మనం గుర్తించాలి. వైయస్ విషయంలోనైతే ఆయన రైజింగ్ స్టార్‌లా వున్నాడు.

నాలుగు – ఎన్టీయార్ అంత్యదశలో ఆయనకు మీడియా సపోర్టు లేదు. అప్పట్లో మీడియా అంటే ఈనాడు, ఈటీవీ, ఆంధ్రజ్యోతి, వార్త. వీటిలో ఏవీ ఆయనకు సపోర్టు కాదు. అప్పట్లో యింత మీడియా ఎక్స్‌ప్లోజన్ లేదు. పైగా ఆయన మరణం సహజమరణం. చంద్రబాబు వెన్నుపోటు పొడవగానే ఆయనకు గుండెపోటు వచ్చివుంటే అప్పుడు పరిస్థితి వేరేలా వుండేదేమో. కానీ వెన్నుపోటును జనాలు హరాయించుకున్నాక యీయన పోయాడు. దాంతో చావు యింపాక్ట్ అంతగా పడలేదు.

ఇక వైయస్ సంగతికి వస్తే – మంచికో, చెడుకో మీడియా ఫోకస్ అంతా ఆయనమీదనే వుంది. ఆయన హెలికాప్టర్ మిస్ కావడంతో ఉత్కంఠ పెరిగింది. ఇంత వెతుకుతున్నారు పాపం క్షేమంగా తిరిగి వస్తే బాగుండును అనిపించింది. లేదు, పోయాడు అనగానే ఉసూరుమనిపించింది. అమితాబ్ బచ్చన్ సినిమాలు చూడనివారు సైతం, ఆయనకు ఏక్సిడెంటు అయినప్పుడు అయ్యో ఏమీ కాకుండా వుంటే బాగుండును అనుకున్నారు, మానవసహజంగా. వైయస్ విషయంలో అదే జరిగింది. టీవీలో వైయస్ అంతర్ధానం గురించి, అంత్యక్రియల గురించి తెగ చూపించడంలో సహజంగా ఆయనంటే అభిమానం వున్నవారు తట్టుకోలేని పరిస్థితి వచ్చింది.

దానీదీనా వైయస్ మరణంతో పోయినవారి సంఖ్య యింతకు చేరిందని అనుకోవచ్చు.

3

ఇలా వైయస్‌పై ఆర్టికల్స్ రాయడం మొదలెట్టేనో లేదో అలా ఉత్తరాలు కురవడం మొదలెట్టాయి. ఇదే ధోరణిలో రాయండి అన్నవారు చాలామంది వున్నా, కొంతమందికి నేను ఎన్టీయార్‌ను, వైయస్సార్‌ను పోల్చడం నచ్చలేదు. మహానుభావుడు ఎన్టీయార్‌ను ఓ ఫ్యాక్షనిస్టుతో పోలుస్తావా అని కొందరు కోప్పడితే, వైయస్సార్‌ను మానవమాత్రులతో పోలుస్తావా అని మరికొందరు చివాట్లేశారు. ఇద్దరూ ముఖ్యమంత్రులే, ఇద్దర్నీ పోల్చడంలో తప్పేముందో నా కర్థం కాలేదు. మధ్యలో అన్నాదురై ఎందుకు వచ్చాడు? అని మరి కొందరి సందేహం. ముగ్గురిలోనూ నేను తీసుకున్న సామాన్య అంశం (కామన్ ఫ్యాక్టర్) – అంత్యక్రియలకు హాజరైన జనం, వారి మరణం ప్రజల్లో కలిగించిన ఉద్వేగం. పరిపాలన విషయానికి వచ్చేసరికి వైయస్‌ను చంద్రబాబుతో ఎలాగూ పోల్చకతప్పదు.

ఇక వైయస్ వ్యక్తిత్వం గురించి చెప్పుకోవడం ఆయనపై వున్న ఫ్యాక్షనిస్టు ముద్రతోనే మొదలెడదాం. ఆయన ప్రత్యర్థులు మాటిమాటికీ అనేది ఆయన ఫ్యాక్షనిస్టనే! ఆయన ఫ్యాక్షనిస్టా? అయితే ఎంతమందిని చంపించాడు? ఎన్ని కేసులున్నాయి? నాకు తెలిసినంతవరకు ఆయన కుటుంబానికి ఫ్యాక్షనిస్టు నేపథ్యం వుంది కానీ వైయస్ స్వయంగా ఫ్యాక్షనిస్టు కాదు. ప్రత్యర్థిని రాజకీయంగా ఎలిమినేట్ చేయిద్దామని చూడడమే కనబడుతుంది కానీ ఫిజికల్‌గా ఎలిమినేట్ చేసే ప్రయత్నం కానరాదు. ఆయనే స్వయంగా చెప్పుకున్నాడు – 'ఓ సారి ఎన్నికలలో నా ప్రత్యర్థులను ఓడించడానికి వారి నియోజకవర్గాలలో వారికి వ్యతిరేకంగా పనిచేశాను, దానికి అనుభవించాను, నా మెజారిటీ బాగా తగ్గిపోయింది. నా పార్టీకి అతి తక్కువ సీట్లు వచ్చాయి' అని. ఫ్యాక్షనిస్టయితే యిలాటి చాటుమాటు వ్యవహారాలు చేయడు. 'నాకు వ్యతిరేకంగా నిల్చోకు, నిల్చుంటే ఔట్' అని హెచ్చరికలు పంపుతాడు.

ఫ్యాక్షనిజం వలన వుండే చేటు స్వయంగా చూసినవాణ్ని కాబట్టి దానికి దూరంగా జరిగానని వైయస్ ఎన్నోసార్లు చెప్పుకున్నారు. వాళ్ల తండ్రి రాజారెడ్డి కక్షలతో, కత్తులతో వ్యవహరించాడు. కత్తులవల్లనే పోయాడు. కుటుంబనేపథ్యం బట్టి చూస్తే వైయస్ పగతీర్చుకోవాలి లేకపోతే వాళ్ల పరిభాషలో 'మగాడే కాదు'. అయినా వైయస్ ఆ జోలికి పోలేదు. ఇప్పుడు 'ఆపరేషన్ ఆకర్ష్'లో గానీ, అంతకుముందు టిక్కెట్ల పంపిణీలో గానీ రాజకీయ చతురతే కనబడుతుంది తప్ప, బెదిరించి తనవైపు లాక్కున్న సందర్భాలు కనబడవు.

నిజానికి రాయలసీమ రాజకీయాలు గమనిస్తున్నవారు ఫ్యాక్షనిజం క్రమంగా తగ్గుతోందనే చెపుతున్నారు. ఎప్పుడో తాతలనాడు

మొదలైన వైరం యింకా కొనసాగించడంలో అర్థం లేదని వారు గ్రహిస్తున్నారట. తనను నమ్ముకున్న వచ్చిన భార్యను వితంతువును చేయకుండా చూడాలని, పెరుగుతున్న అవకాశాలతో పిల్లలు చదువుకుని వృద్ధిలోకి వచ్చేదాకా ఆగాలని అనుకుంటున్నారట. పైగా ఫ్యాక్షనిజం చాలా ఖర్చుదారీ వ్యవహారం. అనుచరగణాన్ని పోషించాలి. ఇదివరకట్లా కాదు, అనుచరులు కూడా తెల్ల ఏనుగుల్లా తయారవుతున్నారు. వైయస్ పాలనకు ముందు తొమ్మిదేళ్లు నడిచిన కరువులో వ్యవసాయంపై ఆధారపడిన ఫ్యాక్షనిస్టులు చాలామంది కుదేలై వున్నారు. అనుచరులను పోషించడం వారికి సాధ్యమా? దానాదీనా వైయస్ పరిపాలన ప్రారంభమయ్యేసరికి ఫ్యాక్షనిజం చల్లబడుతోంది.

అయితే 2004 తొలినాళ్లలో అనంతపురంలో చాలా ఫ్యాక్షనిస్టు హత్యలు జరిగాయి. అవన్నీ తమ నాయకులవే అన్నారు, టిడిపివారు. అంటే టిడిపివారిలోనూ ఫ్యాక్షనిస్టులున్నట్టేగా! టిడిపి నాయకుడు పరిటాల రవి ఫ్యాక్షనిస్టు కాదా? ఆయన పోతే రాష్ట్రమంతటా టిడిపివారు ఆర్టీసి బస్సులు తగలబెట్టలేదా? అంటే టిడిపి ఫ్యాక్షనిజానికి జోహారు పలికినట్టే కదా! ఎటొచ్చీ టిడిపి అధినాయకుడి కుటుంబానికి ఫ్యాక్షనిస్టు నేపథ్యం లేదు కాబట్టి వాళ్లు ఓ మెట్టు పైన వున్నట్టుగా భావించుకుని వైయస్‌ను, కాంగ్రెస్‌ను ఫ్యాక్షనిస్టు ప్రభుత్వమని మాటిమాటికీ యీసడించారు. నిజానికి నాన్-ఫ్యాక్షనిస్టు కుటుంబం నుండి వచ్చిన బాలకృష్ణ తొడలు కొట్టి (అక్కగారి యింటిముందు కూడా) వయొలెంట్ స్వభావం చూపితే ఫ్యాక్షనిస్టు నేపథ్యంనుండి వచ్చిన వైయస్ గాలిలో ముద్దులు విసిరి నాన్-వయొలెంట్ స్వభావాన్ని కనబరచారు. అదీ తమాషా!

అయితే వైయస్ ఫ్యాక్షనిజానికి పూర్తిగా దూరమా? కాదనే చెప్పాలి. ఆయనకు ఫ్యాక్షనిస్టులతో సన్నిహిత బాంధవ్యాలున్నాయి. వాళ్లపై సింపతీ వుంది. వాళ్లకు మద్దతు అందించారు. ఎవరైనా ఏమైనా అనుకుంటారన్న జంకు లేకుండా జైలుకి వెళ్లి పరామర్శించారు కూడా. వారిని జైళ్లలోంచి విడిపించాలని అహరహం శ్రమించారు. ఫ్యాక్షనిస్టుల కుటుంబాల మధ్య సయోధ్య కుదిర్చి ఫ్యాక్షనిజం చల్లార్చాలని చూశారు.

ఆయన హత్యారాజకీయాలకు దూరం అని చెప్పవచ్చు గానీ దౌర్జన్యానికి దూరం అని చెప్పలేము. వైయస్ హయాంలో బోల్డు కబ్జాలు జరిగాయి. కడపముఠాల పేరు రాష్ట్రమంతా మారుమ్రోగింది. ఆ పేరు తుడిపేయాలని ఆయన ఏమాత్రం ప్రయత్నించలేదు. తెలుగుసినిమాలు రాయలసీమ బ్రాండ్ ఒకటి తయారుచేశాయి. రోజూ రక్తంతోనే పళ్లు తోముకుంటారన్నట్టు చూపించారు. దాంతో ప్రజలు 'కడప' అనగానే వణక నారంభించారు. ఎవరైనా వచ్చి 'మాది కుంభకోణమండి. (తంజావూరుజిల్లాలో ఓ వూరు) టైమెంత?' అని మనని అడిగితే మనం టైము కూడా చెప్పం, యిందులో ఏ కుంభకోణం వుందోనని భయపడి. బ్రాండ్ యిమేజ్ అలాటిది!

అలాగ కడపకు ఓ హింసాత్మక బ్రాండ్ పడ్డాక తెల్లలుంగీ కట్టుకున్న ప్రతీవాడు 'మాతో పెట్టుకోకు, మాది కడప. మేం సిఎంకు కావలసినవాళ్లం' అంటూ కబ్జాలు చేసేశారు. అంతకుముందు కబ్జాలు లేవని కావు. వీళ్లయితే ప్రాణాలతో చెలగాటం ఆడతారని భయం. కెసియార్ వంటివారు వీటి గురించి ఎంత గగ్గోలు పెట్టినా వైయస్ ఆ కడపబ్రాండ్‌ను తుడిచేయలేదు. తన పేరు (మిస్?)యూజ్ చేసుకుంటున్నవారిని అరికట్టినట్టు లేదు. దాంతో వైయస్ వచ్చాక రాష్ట్రరాజధానిలో రాయలసీమవారి దౌర్జన్యం పెరిగింది అన్న పేరు వచ్చిపడింది.

4

సిఎంగా వైయస్ ఎన్ని చిరునవ్వులు చిందించినా వైయస్ శాంతస్వభావి అనడానికి లేదు. పాదయాత్ర ముందు దాకా కోపం నరం యాక్టివ్‌గా పనిచేసిందని ఆయనే చెప్పుకున్నాడు కదా. పార్టీలో తనకు తగ్గ స్థానం లభించలేదని ఆయనలో అశాంతి, అలజడి తీవ్రస్థాయిలో వుండేవి. అందువలన నిత్య అసమ్మతివాదిగా ఆయన గుర్తింపు తెచ్చుకున్నాడు. దానికి యీయన ఒక్కడిదే తప్పు కాదు, ఆనాటి ముఖ్యమంత్రులు కూడా వైయస్ పొటెన్షియల్ గమనించి అతను పైకి రాకుండా తొక్కేయాలని తెగ చూశారు. దానికి యీయన అంతే ఘాటుగా తిరగబడ్డాడు.

పివి నరసింహారావుగారికి అత్యంత సన్నిహితుడైన పివిఆర్‌కె ప్రసాద్ స్వాతి వీక్లీలో విజయభాస్కరరెడ్డిపై వైయస్ చెప్పులు వేయించిన సంఘటన తాలూకు నేపథ్యం అంతా రాశారు. అది చదివితే ఆ చెప్పులు వేయడం సహజపరిణామమనే అనిపిస్తుంది. దానికి పివి టాసిట్ సపోర్టు (మౌనసమ్మతి) వుంది కాబట్టే వైయస్‌పై చర్య తీసుకోలేదు. ప్రతీ ముఖ్యమంత్రి వైయస్‌తో వేగవలసి వచ్చేది. కాంగ్రెస్‌లో వైయస్‌ను కడప జిల్లాకే పరిమితం చేశారు. వైయస్ జిల్లా పాలిటిక్స్‌లో కొట్టుకుంటూ వుండవలసినదే తప్ప ఒక రాష్ట్రస్థాయికి ఎదుగుతాడని ఎవరూ అనుకోలేదు.

వైయస్ చంద్రబాబుతో పోలిక పెట్టుకున్నారు. ఇద్దరూ ఒకేసారి కాంగ్రెస్‌లోకి వచ్చారు. కలిసిమెలిసి తిరిగారు. చూస్తూండగా చంద్రబాబు పార్టీ మారాడు. ఎన్టీయార్ హయాంలో చక్రం తిప్పాడు. కొన్నాళ్లకి తనే గద్దె నెక్కాడు. ఒక రాజకీయజీవి యిమేజినుండి పరిపాలనాదక్షుడి యిమేజికి ఎదిగాడు. ఆ తర్వాత జాతీయస్థాయిలో కూడా తనే చక్రధారియై పోయాడు. అంచెలంచెలుగా ఎదిగి ఆధునికయుగానికి కావలసిన ముఖ్యమంత్రి అని తెలుగువారందరూ గొప్పగా డప్పు కొట్టుకునేటంత యిదిగా బాబు ప్రతిష్ట పెరిగిపోయింది. జ్యోతి బసులాగ పాతికేళ్లు పాలించేసినా ఆశ్చర్యం లేదన్నట్టు అందరూ అనుకోసాగారు.

ఇటు వైయస్ ఒక మొరటు మనిషిగానే మిగిలాడు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా అయినదానికీ, కాని దానికీ అడ్డుపడుతూ మధ్యతరగతివారి దృష్టిలో నెగటివ్ యిమేజ్‌ను మూటగట్టుకున్నాడు. కళ్లు మూసుకుని ఆయన 'అధ్యక్షా' అంటూండడం మిమిక్రీవారికి పంటపండించింది. వైయస్ ముఖ్యమంత్రి అవుతాడని అప్పట్లో ఎవ్వరూ అనుకోలేదు. కానీ అవాలని, అయి చంద్రబాబు దాదాపు పదేళ్ల రికార్డును అధిగమించాలని వైయస్ అనుకున్నాడు, కలలు కన్నాడు. ప్రణాళికలు వేశాడు. ఆ కలలు కల్లలు కాకుండా చంద్రబాబు దోహదపడ్డారు.

అప్పట్లో మేధావులు చంద్రబాబు గురించి ఎంత డప్పు కొట్టేసినా, రాష్ట్ర స్థాయినుండి అంతర్జాతీయ స్థాయివరకు మీడియాను బాబు ఎంత బాగా మేనేజ్ చేసేసినా, ఫ్లయివోవర్లు, హైవేలు చూపించి చంద్రబాబు అంతర్జాతీయ అతిథులను ఎంత మురిపించేసినా గ్రౌండ్ రియాలిటీ వేరేలా వుంది. తర్వాత్తర్వాత బయటకి వచ్చిన గణాంకాలు బాబు హయాం ఎంతటి మేడిపండో చూపించాయి. వ్యవసాయంపై ఆధారపడిన రాష్ట్రంలో వ్యవసాయం నెగటివ్ గ్రోత్‌లో వుంటే యింకెక్కడి గ్రోత్? విద్యుత్ విషయంలో కూడా బాబు ఎన్నిసార్లు విద్యుత్ చార్జీలు పెంచారో గుర్తుందా? అయినా కరంటు కోతలు ఎంత ఘోరంగా వుండేవో గుర్తుందా? అంతకంటె ఎక్కువ ఆశిస్తే కరంటు తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిందే అని బాబు అంటే కాబోసు అనుకున్నాం తప్ప వేరేలా భావించలేదు. బషీర్‌బాగ్ సంఘటనలో ప్రతిపక్షాలు అనవసరంగా అల్లరి చేసి కొంతమంది ప్రాణాలు తీశారు అనుకున్నాను నేను.

కానీ వైయస్ వచ్చాక విద్యుదుత్పాదన ఎంత పెరిగిందో చూశారా, వర్షాపాతం ఒక్కటే దీనికి కారణం అంటే నేనొప్పుకోను. బెటర్ మేనేజ్‌మెంట్ వల్లనే యిది సాధ్యపడి వుండాలి. లాలూ రైల్వేలను బాగుచేసినట్టు, వైయస్ విద్యుత్ రంగాన్ని బాగు చేశారు. ఆ సంస్థలను అప్పుల్లోంచి బయటపడేశారు. 'మేం వేసిన పునాదుల వల్లనే యివన్నీ జరిగాయి' అని బాబు బోర విరుచుకోవచ్చు. అంటే తొమ్మిదేళ్లూ పునాదులు తవ్వుతూనే వున్నారా? పోనీ ఏడేళ్లు తవ్వి, చివరి రెండేళ్లూ మాకు ఫలాలు రుచి చూపించవచ్చుగా! 2004లో అధికారంలోకి వచ్చి వుంటే పునాదులు యింకా లోతుగా తవ్వుతూ వుండేవారేమో!

అలాగే శాంతిభద్రతల విషయం. మావోయిస్టులు సమాంతర ప్రభుత్వం నడిపారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి మీదనే దాడి చేశారంటే పరిస్థితి ఎంత ఘోరంగా వుందో ఆలోచించండి. అలిపిరి దాడి జరిగాక బాబు సిగ్గుపడి రాజీనామా చేసి యింకోర్ని కూచోబెట్టవలసినది. కనీసం హోంమంత్రిని మార్చవలసినది. అదేమీ చేయకపోగా దాన్ని పొలిటికల్‌గా ఎన్‌క్యాష్ చేసుకుందామని నక్సలిజాన్ని అణచడానికి నాకు యింకా మెజారిటీ యివ్వండి అనే నినాదంపై ఎన్నికలలోకి దూకారు. ఏ పోస్టరు చూసినా రక్తసిక్తమైన బట్టలతో దీనావస్థలో బాబు. 'ఆయనకే భద్రత లేదు, మనకేం కల్పిస్తాడు?' అన్న భావన ఓటర్లకు కలగదూ?

ఎందుకిలా జరిగింది? బాబు ఎంత పరిపాలనాదక్షుడని, విషయగ్రహణాశక్తి కలవాడని మనం అనుకున్నా అధికారులచేత, సాటి నాయకుల చేత పనిచేయించుకోవడం ఆయనకు రాలేదనే అనుకోవాలి. ఓడిపోయాక బాబు ఎన్నోసార్లు అన్నారు – 'అధికారంలోకి వెళ్లాక కార్యకర్తలకు దూరమయ్యాను' అని. అంటే ఏమిటన్నమాట? ఈయనకూ కార్యకర్తలకు మధ్య వారధి ఎవరూ లేకుండా పోయారు. ఆ జిల్లా మంత్రికి కూడా యీయన విలువ యివ్వలేదు. నిజానికి బాబు కాబినెట్‌లో ఏ మంత్రీ స్వంతంగా నిర్ణయం తీసుకోలేకపోయేవారు. బాబే సర్వస్వం. ఆయనకు తెలియకుండా ఆకు కదలడానికి లేదు. డెలిగేషన్ చేయలేకపోవడం బాబు బలహీనతల్లో ఒకటి. సత్వర నిర్ణయం తీసుకోలేకపోవడం మరో బలహీనత. తనకు తోచినదే చేసేవారు తప్ప వేరొకరు ఆయన్ను కన్విన్స్ చేయలేకపోయేవారు.

5

ఇక అవినీతి సంగతంటారా? బాబు హయాంలో అవినీతి జరగలేదని ఎవరైనా అంటే నేను ఫక్కున నవ్వుతాను. ఆయన పట్ల సానుభూతి కారణంగా పేపర్లు హోరెత్తించకపోయి వుండవచ్చు కానీ ఎలక్షన్లలో అభ్యర్థులు పెట్టే ఖర్చు చూస్తే చాలు మనకు తెలిసిపోతుంది – అవినీతి జరుగుతోందని. దేశం మొత్తం మీద ఆంధ్రలోనే ఎలక్షన్ల ఖర్చు ఎక్కువని జాతీయ టీవీ ఛానెల్స్‌లో కూడా అంటూంటారు. బాబు వచ్చాకనే ఎన్నికల ఖర్చు పెరిగిందని ఆయన ఒకప్పటి కొలీగ్ కెసియార్ సోదాహరణంగా చెప్పారు. ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా పార్టీలు యింతింత ఖఱ్చు పెట్టడం ఆంధ్రలోనే చూస్తున్నాం. విస్తరించిన అవినీతి కూడా బాబుపై ప్రజలకు విముఖతకు దోహదపడివుండవచ్చు.

బాబు పరిపాలన పట్ల ప్రజల్లో యింత విముఖత వుందని పేపర్లు పసిగట్టలేదు. ప్రభుత్వం యిస్తున్న యాడ్స్ మత్తులో పడివున్నాయి అవి కూడా. 2004లో జరిగిన ఎన్నికలలో టిడిపికి వ్యతిరేకంగా నిలబడిన పార్టీలన్నిటికీ బోల్డు సీట్లు వచ్చాయి. తెరాస అది చూసి ప్రజలు ప్రత్యేక తెలంగాణాకు మద్దతు యిస్తున్నారనుకుని మురిసిపోయింది. వామపక్షాలు తమ పోరాటాల ఫలితమే యిది అనుకుని చంకలు గుద్దుకున్నాయి. 2009 నాటికి వాటి అసలు స్థితి ఏమిటో తెలిసివచ్చింది. ఇవన్నీ 2004లో అంత వెలుగు వెలగడానికి కారణం బాబు హయాంలో అలుముకున్న చీకటే!

ఈ చీకటిని పసిగట్టగలిగినవాడు వైయస్. 1982లో కాంగ్రెస్ దుష్పరిపాలన వలన ఏర్పడిన ప్రజల్లో ఏర్పడిన ఏవగింపును గుర్తించి రంగంలోకి దిగారు ఎన్టీయార్. తను ఒక సమర్థవంతమైన ప్రత్యామ్నాయం అని జనాల్ని నమ్మించగలిగారు. వైయస్ అదే

పని 2004 ఎన్నికల్లో చేయగలిగారు. సంస్థాగత బలం ఎంత వున్నా సరైన నాయకుడు లేక అల్లాడుతున్న కాంగ్రెస్‌కు నేనే నాయకుణ్ని, చంద్రబాబుకి సాటి వచ్చేవాణ్ని అని చెప్పుకుంటూ వైయస్ ముందుకు వచ్చారు. కాంగ్రెస్ పక్షాన ఫోకస్ తనపై వుండేటందుకు పాదయాత్ర తలపెట్టారు.

పాదయాత్రలు చేసిన ప్రతీవారూ జనప్రియులు కాలేదు. చంద్రశేఖర్ దేశమంతా పాదయాత్ర చేశారు. పాదాలు వాచాయి కానీ పరువు దక్కలేదు. వైయస్ పాదయాత్ర విజయవంతం కావడానికి కారణం – బాబు పాలనపై ప్రజలలో కలిగిన నిస్పృహ, వైయస్‌కు మొదటినుండీ వున్న అనుచరగణం. విశ్వశాంతికై ప్రపంచమంతా సైకిలు తొక్కుతున్నాను, లేకపోతే దేశమంతా వెనక్కి తిరిగి నడుస్తున్నాను అనేవాళ్లు సాధారణంగా ఒంటరిగానే కనబడతారు – మధ్యమధ్యలో పత్రికల వాళ్లకు, టీవీ వాళ్లకు ఇంటర్వ్యూలు యిచ్చినప్పుడు తప్ప! మరి వైయస్ ప్రతి జిల్లాకు వెళుతూంటే అక్కడ స్వాగతం చెప్పడానికి ఆయన అనుయాయులు వున్నారు. గ్రూపులు గ్రూపులుగా విడిపోయిన కాంగ్రెస్‌వారు యిలా స్వాగతం చెప్పడమేమిటి? అని ఆశ్చర్యవేసింది. ఇలా ఒకణ్ని పైకెత్తేస్తే రేపు మనకు ముప్పు కదా అని ముఖ్యమంత్రి పదవిపై ఆశపెట్టుకున్న ఆ జిల్లా నాయకుడు అడ్డుపడడూ?

వీటన్నిటినీ అధిగమింపజేసినది – వైయస్‌కు అన్ని జిల్లాల నాయకులతోనూ వున్న సంబంధ బాంధవ్యాలు. అవి ఎలా ఏర్పడ్డాయి? మంత్రిపదవిలో వుండగా వాళ్లకు ఫేవర్ చేశాడేమో అనుకోవడానికి వైయస్ మంత్రిగా వున్నది ఎంతకాలం కనుక? ప్రతి ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా శిబిరాలు నడిపేవాడికి పరపతి ఎంత వుంటుంది? ఈయన చేసినది ఎమ్మెల్యేగా, కొంతకాలం ఎంపీగా, అంతే కదా! అయినా ప్రతీ జిల్లాలోనూ కాంగ్రెస్ నాయకులతో గుడ్‌విల్ పెంచుకోవడానికి ఎంత కృషి చేసి వుండాలి? వ్యక్తిగతంగా ఎంత ఆదరాభిమానాలు చూరగొని వుండాలి? తనంటే పడి'చచ్చే' నాయకులను, కార్యకర్తలను తయారుచేసుకోవడం మాటలు కాదు. వాళ్లను పేరుపేరునా గుర్తుపెట్టుకోవడమే కాదు, అవసరాల్లో ఆదుకోవడమే కాదు, కొన్ని సందర్భాల్లో మన్నించి అక్కున చేర్చుకోవాలి కూడా. ఇక్కడే ఆయన వ్యక్తిత్వంలో వున్న విశేషలక్షణం అర్థం చేసుకోవాలి.

వైయస్ వారసుడిగా జగన్‌కు ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టాలని ఆందోళన చేస్తున్నవారు యీ సంగతి గమనించాలి. వైయస్‌లో వున్న యీ విశిష్టగుణం జగన్‌లో వుందా అన్నది తేలితేనే యీ విషయంలో ఎవరైనా గట్టి నిర్ణయం తీసుకోగలరు. కొడుకు ఐనంత మాత్రాన తండ్రి గుణాలు ఆటోమెటిక్‌గా వచ్చేస్తాయా? విశ్వకవి రవీంద్రుడి కొడుకు ఆ స్థాయి కవిత్వం రాశాడా? మహాకవి శ్రీశ్రీ కొడుకు కవా? గాంధీ గారి కొడుకు కూడా మహాత్ముడా? ఒక కడుపున పుట్టిన నారా చంద్రబాబు నాయుడు, రామ్మూర్తి నాయుడు స్వభావాలు ఒకటేనా? వైయస్ రాజారెడ్డి విధానాలు, వైయస్ రాజశేఖరరెడ్డి స్వభావాలు ఒకటేనా? జగన్‌కు ఓ సోదరుడు వుండి వుంటే అతనూ జగన్‌లాగానే ఆలోచిస్తాడా? ఎవరి వ్యక్తిత్వం వారిదే. ఎవరి ఆలోచనలు వాళ్లవే. ఎవరి రుచులు, అభిరుచులు వాళ్లవే. పెరిగిన వాతావరణం ఒకేలా వుంటే కొంత పోలిక వుండవచ్చు. అప్పుడు కూడా ఎంతో వైరుధ్యం, వైవిధ్యం వుంటుంది. లేకపోతే లోకమంతా ఒక్కలాగానే వుండేది.

గంపెడంత కుటుంబంలో పెరిగి, ఆర్థికంగా క్రమంగా ఎదిగిన వైయస్‌కు పేదల కష్టాల పట్ల వున్న అవగాహన, సామాన్యుల పట్ల ఆదరం జగన్‌కి వుండాలని లేదు. జగన్ చూసిన లోకం వేరేలా వుంటుంది. అతను పుట్టి పెరిగినది ఐశ్వర్యం లోనే. ఫ్యాక్షన్ గొడవల్లో పడకుండా చదువు పట్ల మోజు పెంచుకుని యింటికి దూరంగా వెళ్లి ఎంబిబియస్ చదువుకున్నారు వైయస్. అన్ని సౌకర్యాలు వుండి కూడా చదువుపట్ల అంత శ్రద్ధ వహించలేదు జగన్. ఆసుపత్రి నడిపి, తర్వాత రాజకీయాల్లోకి వచ్చి ధక్కామొక్కీలు తిని రాటు దేలారు వైయస్. వడ్డించిన విస్తరి జగన్ జీవితం. తండ్రి సంపాదించిన ఆస్తి, పలుకుబడి అతను పరిశ్రమలు పెట్టడానికి మార్గం సుగమం చేశాయి. దానికి స్వంత వ్యాపారదక్షత తోడైంది కాబట్టి చకచకా పైకి వచ్చారు. ఎంతైనా కానీ తండ్రి ఛత్రచ్ఛాయ అతనికి వుపయోగపడిందనేది నిర్వివాదాంశం. మీరూ నేనూ దినపత్రిక పెడతానంటే "సాక్షి" లెవెల్లో ఎవరూ పెట్టుబడి పెట్టరు. జగన్ వైయస్ కుమారుడు కాబట్టే "సాక్షి"కి సులభంగా పెట్టుబడులు సమకూరాయి. అఫ్‌కోర్స్, తర్వాత దాన్ని విజయవంతంగా నడపడంలో జగన్ సామర్థ్యం కనబడుతుంది.

6

ఎంతైనా పోరాడి గెలిచినది వేరు. అవకాశాన్ని అందిపుచ్చుకుని ఎదగడం వేరు. జగన్ రెండోదానిలో నిష్ణాతులు. రాజకీయంగా మొదటిది కూడా చాలా అవసరం. అది రాజీవ్ గాంధీ విషయంలో నిరూపితమైంది. ఇప్పుడు జగన్‌ను రాజీవ్‌తో పోల్చేవారు విస్మరిస్తున్న విషయం ఒకటుంది. ప్రధాని కావడానికి పూర్వం రాజీవ్ ఎఐసిసి సెక్రటరీగా వుండి, రాజకీయం నడిపారు. అరుణ్ నెహ్రూ, అరుణ్ సింగ్‌లను అండగా పెట్టుకుని కశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని విజయవంతంగా కూలదోశారు. ఆ విజయం తర్వాత ఆ ప్రయోగాన్ని నాదెండ్ల ద్వారా ఆంధ్రలో చేయబోయి చేతులు కాల్చుకున్నారు. ఇలా రాజకీయ జయాపజయాలు రెండూ చవిచూసిన తర్వాతనే ప్రధాని అయ్యారు. జగన్‌లా వ్యాపారాలలో బిజీగా లేరు, రాజకీయాల్లో ఫుల్‌టైమర్‌గా వుంటూ అనేకమంది నాయకులతో నిత్యం యింటరాక్ట్ అయి కాస్త అనుభవం గడించిన తర్వాతనే ప్రధాని అయ్యారు.

అయినా అది సరిపోలేదు. అందుకే ఐదేళ్లలో పదవి పోగొట్టుకున్నారు. ఇందిరా గాంధీ హత్య తర్వాత సానుభూతి పవనాలు

సుడిగాలిగా మారి ఆయనకు కనీ వినీ ఎరుగని మెజారిటీ (తర్వాత కూడా ఎవరూ బీట్ చేయలేని రికార్డు) కట్టబెట్టాయి. అయితే ఏం లాభం, పరిపాలనా అనుభవం చాలలేదు. బోఫోర్స్ గొడవ చుట్టుముట్టినపుడు ఎదుర్కొనే రాజకీయ అనుభవం చాలలేదు. ఐదేళ్లలో ఆ సింపతీ అంతా హారతికర్పూరమై పరాజితుడిగా మిగిలాడు.

ఈ చరిత్ర జగన్ సమర్థకులకు తెలియనిది కాదు. కానీ వారి ఆత్రుత వారిది. వైయస్‌తో కుదుర్చుకున్న లావాదేవీలు గాలికి ఎగిరిపోతాయన్న బెరుకు కాబోలు. కానీ కాంగ్రెస్ అధిష్టానవర్గం అంత తెలివితక్కువది కాదు. ఎవర్ని కూచోబెట్టినా ఒప్పందాలు సజావుగా అమలు అయ్యేట్లు చూస్తుంది. లేకపోతే క్రెడిబిలిటీ దెబ్బ తింటుంది. సిఎం ఎవరైనా సరే, వైయస్ కుటుంబం మద్దతు లేనిదే ప్రస్తుత పరిస్థితుల్లో మనజాలదు. కానీ జగన్ వీరాభిమానులు దానితో తృప్తి పడక వితండ వాదనలు ముందుకు తెస్తున్నారు. వైయస్ విధానాలు కొనసాగించాలంటే జగనే సిఎం కావాలట. అక్కడికి వైయస్ విధానాలు, కాంగ్రెస్ విధానాలు వేరైనట్టు. వైయస్‌కు వేరే పార్టీ అంటూ వుందా? తన విధానాలతోనే నడపాలనుకుంటే తన పేరుతోనో, తండ్రి పేరుతోనో పార్టీ పెట్టలేకపోయారా? కాంగ్రెస్‌నే పట్టుకుని వేళ్లాడడం దేనికి. కాంగ్రెస్ పార్టీ విధానాలు అన్ని రాష్ట్రాలకూ సమానంగానే వుంటాయి కానీ ఒక పర్సనల్ స్టాంప్ వేసేది, ఓరియంటేషన్ (దృక్పథం) యిచ్చేది వైయస్‌వంటి ముఖ్యమంత్రులే. పార్టీ, ముఖ్యమంత్రి యిద్దరూ ముఖ్యులే.

వైయస్, జగన్ ఒకలా వుండరని యిప్పుడే తెలుస్తోంది. ఇప్పటి జగన్ స్థానంలో వైయస్ వుండివుంటే అధిష్టానంపై యిలా ఒత్తిడి తెచ్చేవారిని వారించి వుండేవారు. ఆయన అధిష్టానాన్ని ఎప్పుడూ ఎదిరించలేదు. తన వ్యక్తిగత అభిప్రాయం తెలియబరుస్తూనే, అక్కడి నాయకులతో లాబీయింగ్ చేస్తూనే అంతా అధిష్టానంపై వదిలేసేవారు. అన్ని వేళలా ఆయన మాట చెల్లలేదన్న విషయం మనందరికీ తెలుసు. అప్పుడు కూడా బ్లాక్‌మెయిలింగ్‌కు దిగలేదు.

ఇప్పుడు మంత్రులు చూడండి. జగన్ సిఎం కాకపోతే ప్రమాణస్వీకారం చేయరా? మనం వాళ్లను ఎన్నుకున్నది ప్రజాసేవ చేయమనే కదా! షరతులు పెట్టి బాధ్యత తప్పించుకోవడం సబబా? ఇప్పుడు ప్రమాణ స్వీకారం చేయకపోతే యింకెప్పుడూ చేయాల్సిన పని వుండదు అని అధిష్టానం అనగానే పరుగులు పెడుతూ వెళ్లారు. వైయస్ మీద అంత గౌరవం వుంటే ఆయన ఎంతో మన్నించిన రోశయ్యను యింత చులకన చేస్తారా? ఇలా చేస్తున్నా చూస్తూ వూరుకున్నారన్న అప్రతిష్ట హైకమాండ్‌కి తెస్తారా? ఇలాటి స్నేహితులుండగా వేరే శత్రువులు అక్కరలేదు జగన్‌కి.

సోనియా గాంధీ ఎటువంటి వ్యక్తో మనం చూస్తూనే వున్నాం. నీవు తప్ప మాకు దిక్కులేదని కాంగ్రెస్ నాయకులంతా ఒకళ్ల తర్వాత ఒకళ్లు రోదించినా ఆవిడ ఏడిశారు లెండి అంటూ మన్‌మోహన్‌కి పదవి కట్టబెట్టింది. నువ్వు అడ్మినిస్ట్రేషన్ చూసుకో, నేను రాజకీయాలు చూసుకుంటా అని. అలా చేసింది కాబట్టే ఆర్థికమాంద్యంలో కూడా దేశం బతికి సగమో, పావో బట్టకదుతోంది. ఆవిడ జగన్‌కు కూడా అదే సలహా చెప్పవచ్చు –

– రోశయ్య పాలనలో సమర్థుడు కదా, ఆయన్ని ప్రభుత్వం నడపనీ, నువ్వు మీ నాన్నలాగ పాదయాత్రలు చేసి తిరిగే ఓపిక వున్నవాడివి. పిసిసి అధ్యక్షుడిగా వుండు అనవచ్చు.

– రోశయ్యకు కరిష్మా లేదు, నువ్వు మీ నాన్న టైపులో అందరితోనూ కలిసిమెలిసి, కార్యకర్తలలో ఉత్తేజం కలిగించు అనవచ్చు.

– మన పార్టీకి కావలసిన నిధుల సేకరణలో రోశయ్య వుత్సాహం చూపించకపోవచ్చు, చరమదశలో యివన్నీ నాకెందుకని. నువ్వు పారిశ్రామికవేత్తవి, మంచి డీల్స్ వర్కవుట్ చేయి అనవచ్చు.

– నేను రాహుల్ గాంధీని అనుభవం తెచ్చుకునే దాకా ఆగమనలేదా? నువ్వూ రాహుల్ బాటలో నడవలేవా? అనవచ్చు.

– నువ్వు కుర్రాడివి, యిప్పుడే నిన్ను సిఎంను చేశాననుకో, బాగా పాలిస్తే యింకో 30 యేళ్లదాకా నువ్వే సిఎంగా ఏలతావు అనే భయం కలిగి వాళ్లు బతికుండగా యీ పార్టీ ద్వారా సిఎం అయ్యే ఛాన్సు వుండదనే నిస్పృహతో తక్కిన నాయకులు గోడ దూకవచ్చు, కొత్త పార్టీ పెట్టవచ్చు. అనవచ్చు.

ఏదైనా అనవచ్చు, కాస్త టైమిస్తే. కానీ జగన్ వీరాభిమానులు టైమెక్కడ యిచ్చారు? శవాన్ని హైదరాబాదుకి తీసుకొచ్చే లోపునే రంకెలు మొదలెట్టారు. జగన్‌ను సిఎం చేయకపోతే రాజీనామాలు చేస్తాం, పీకలు కోసుకుంటాం అంటూ. ఎంత ఎబ్బెట్టుగా వుందో చూడండి. అటు వైయస్ చావు తట్టుకోలేక మామూలు జనాలు గుండాగి చస్తున్నారు. ఇటు వీళ్లు గతంలో పిఎం పదవిలో పివి పాతుకుపోయినట్టు సిఎం పదవిలో రోశయ్య ఎక్కడ పాతుకుపోతాడోనని హడిలి ఛస్తున్నారు. తామనుకున్న వారికి పదవి దక్కకపోతే రాష్ట్రం అగ్నిగుండం చేస్తామని బెదిరిస్తున్నారు.

వైయస్ బతికుంటే వీళ్లిలా కూతలు కూసేవారా? ఆ మధ్య ఒకతను వైయస్ సిఎం కావాలని నాలుక కోసుకున్నాడు. 'నేను అతన్ని పరామర్శించడానికి వెళ్లలేదు. వెళితే మరో పదిమంది ఆ పని చేస్తారు.' అని చెప్పారు వైయస్. తన పట్ల ప్రజలకున్న క్రేజ్‌ను ఎలా కంట్రోలు చేయాలో తెలిసున్న ప్రజానాయకుడు వైయస్. జగన్‌కి అది యింకా చేతకానట్టుంది. వైయస్ వ్యక్తిత్వం మరికొంత వచ్చే వ్యాసంలో



నేను యీ సీరీస్ మొదలెట్టినపుడు నివాళి కదాని అతిశయోక్తులకు పోను, మంచీ చెడూ రెండూ రాస్తాను అన్నాను. నాలుగు

రాశానో లేదో, కొంతమంది పాఠకులు నా వెంట పడ్డారు. చెడు రాస్తానన్నారు, రాయలేదేం? అంటూ. చెడు వినడానికి అంత తొందరెందుకు? ఇన్నాళ్లూ వింటున్నది అదే కదా. పాపం ఏదో పోయాడుకదాని పేపర్లు జోరు తగ్గించాయి కానీ ఆయన మిస్సయ్యాడన్న రోజుదాకా తిడుతూనే వున్నాయిగా. చెడు కూడా రాస్తానన్నాను కానీ, చెడే రాస్తాననలేదు. అయినా సీరీస్ పూర్తి కాకుండానే రియాక్ట్ కావడం దేనికి? నేనేమీ సంపాదకీయం రాయటం లేదు. బెత్తెడు చోటులోనే రాయాలన్న నిబంధన లేదు. తోచినవి, గుర్తు కొచ్చినవి రాసుకుంటూ పోతాను. సీరీస్‌లో ఎన్ని వ్యాసాలు రాస్తానో నాకే తెలియదు. ఈ లోపునే నువ్వూ, నీ వెబ్‌సైటూ కాంగ్రెస్ పక్షపాతులు అంటూ.. లేఖలు. వెబ్‌సైటులోని తక్కిన ఆర్టికల్స్‌కు, నాకూ ఏ సంబంధం లేదని ఎన్నిసార్లు రాసినా యీ మూరు?లు వినరు. నా పేరుమీద వెలువడిన ఆర్టికల్స్‌కే నా జవాబుదారీ. ఏ పత్రికలోనూ, ఒక రచయిత పక్క పేజీలో రాసినవాటికి బాధ్యుడు కాడు. ఏ టీవీ ఛానెల్‌లోనూ యాంకర్ అరగంట తర్వాత వచ్చే ప్రోగ్రాంలోని కాంటెంట్‌కు బాధ్యుడు కాడు. ఇంతమాత్రం యింగితం లేకుండా మీ వెబ్‌సైట్ యిలాటి వార్తలు వేసింది, యిలాటి ఫోటోలు వేసింది అంటూ నన్ను తప్పుపట్టేవాళ్లని ఏమనాలో నాకు తెలియడం లేదు.

వైయస్ అంత్యక్రియల్నీ, ఎన్టీయార్ అంత్యక్రియల్నీ పోలిస్తే ఎన్టీయార్‌తో ఓ ఫ్యాక్షనిస్టును పోలుస్తావా అంటూ రాశారు కొందరు. ఫ్రంట్‌లైన్ తాజా సంచిక చూడండి. వాళ్లూ పోల్చారు. జర్నలిజంలో కాకలు తీరిన యోధులు వారు. ఇక వైయస్ అధికారంలోకి వచ్చే కారణాలు గురించి రాస్తూ చంద్రబాబు పాలన గురించి రాస్తే 'వైయస్ గురించి రాయక బాబు గురించి రాస్తావేం?' అంటూ అదలింపులు. 'కాంగ్రెస్ దుష్పరిపాలన కారణంగా ఎన్టీయార్ అధికారంలోకి రాగలిగారు' అనే వాక్యానికి వీళ్లు అభ్యంతర పెట్టలేదు. 'బాబు పరిపాలన బాగోలేకపోవడం వల్లనే వైయస్ అధికారంలోకి రాగలిగారు' అని రాస్తే తప్పుపట్టారు. బాబు పాలన అమోఘంగా వుండి వుంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది కాదన్న విషయం కూడా వీళ్లకు తట్టదు.

బాబు తర్వాత వెంటనే వైయస్ ముఖ్యమంత్రి అయ్యారు కాబట్టి యిద్దర్నీ పోలుస్తాం. రేపు వైయస్‌ను, రోశయ్యను పోలుస్తాం. ఎల్లుండి జగన్ సిఎం ఐతే అతన్ని రోశయ్యను, వైయస్‌లతో పోలుస్తాం. సహజమే కదా. బాబు అధికారంలోకి వచ్చినపుడు తనను మాటిమాటికి కాంగ్రెస్ ముఖ్యమంత్రులతో పోల్చుకోలేదా? ఇదో పెద్ద సెన్సిటివ్ యిస్యూగా ఫీలవడం దేనికి? ఇక వైయస్ హయాంలో విద్యుత్ రంగం మెరుగుపడిందని రాస్తే అది కూడా ఒప్పుకోవడానికి కొందరు సిద్ధపడటం లేదు. స్టాటిస్టిక్స్ చూసుకోండి అని రాస్తే అవి నువ్వే పంపించు అంటూ తిరుగు మెయిల్ రాస్తారు. నేను యిక్కడ ఎకడమిక్ వ్యాసాలు రాయడానికి కూచోలేదు. అలాటివి వి.హనుమంతరావు గారి లాటి పెద్దలు ఎందరో అనేక పత్రికలలో ఎడిట్ పేజీల్లో వ్యాసాలుగా రాస్తూనే వున్నారు. జాతీయ పత్రికలలో పూర్తి గణాంకాలతో యిస్తారు. నమ్మబుద్ధి కాని వారు అవి చదివి నిజానిజాలు తెలుసుకోవడం మంచిది.

నేను రాసేవి 'కబుర్లు'. ఇక్కడ స్పిరిట్ ఆఫ్ ది స్టేటుమెంటే ముఖ్యం. శివాజీ ఔరంగజేబును ఓ యుద్ధంలో ఓడించాడు అనే రాస్తాను తప్ప, శివాజీ వైపు యింత కాల్బలం, యింత ఆశ్వికదళం, అవతలివైపు యింత గజబలం, యింత మందుగుండు సామగ్రి.. ఇన్ని రోజుల ముట్టడి... ఫలానా తారీకున కోటలో జనాలు లొంగిపోయారు... యిలాటివి రాయడం నా స్టయిల్ కాదు. బాబు హయాంలో విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగాయి. వైయస్ హయాంలో పెరగలేదు. విద్యుత్ సంస్థల ఆర్థికస్థితి బాగుపడింది. ఇవి కంటికి కనబడే నిజాలు. క్వాలిటీ ఆఫ్ పవర్, ఎన్ని మోటార్లు కాలిపోయాయి, ఎంతమందికి రైతులకు షాక్ కొట్టింది.. యివన్నీ టెక్నికల్ విషయాలు. వైయస్ హయాం అంతా చీకటి రాజ్యం అని నమ్మేవాళ్లు వాళ్ల నమ్మకాన్ని నా మీద రుద్దుదామని చూస్తున్నారు కాబట్టే యింత విస్తారంగా రాయవలసి వస్తోంది. ఎవరేమన్నా నాకు తోచినది నేను రాయబోతున్నాను. తప్పులు దొర్లితే చెప్పండి. ఇక అభిప్రాయం అంటారా? ఎవరి అభిప్రాయం వారిది.

స్వపక్షంలోనే విపక్షంగా వుంటూ వైయస్ చాలామంది స్నేహితులను కూడగట్టుకున్నారని రాస్తున్నాను కదా. ఆయనకు రాగద్వేషాలు ఎక్కువే. 'శరణన్న వారిపట్ల కరుణామయుడు, కత్తికట్టిన వారిపట్ల కాలయముడు' అని యిండియా టుడే రాసింది. ఆయన పోయినప్పుడు అంజలి ఘటించినవారందరూ యిదే విషయాన్ని నొక్కి వక్కాణించారు – అంతకుముందు ఎంత దూషించినా, వచ్చి శరణంటే అక్కున చేర్చుకుంటారని. (రోజా తాజా వుదాహరణ) అది గొప్ప వర్ర్యూ కింద అందరూ చెప్పడం బాగానే వుంది గానీ అదే ఆయన కొంప ముంచిందనిపించింది సెప్టెంబరు 3న.

సరైన ప్రొఫెషనలిజం వుండి వుంటే వైయస్ దుర్మరణం నివారించబడేది. కొత్త హెలికాప్టర్ కొన్నారు కానీ, దాన్ని రెడీగా పెట్టలేదు. పాత దాంట్లో పరికరాలు సరిగ్గా పనిచేయడం లేదు, పైలట్‌పై అనేక అభియోగాలు, వాతావరణం బాగా లేదు కాబట్టి వెళ్లడానికి వీల్లేదు, హెలికాప్టర్ దూరప్రయాణాలకు కాదు, తిరుపతి దాకా విమానంలో వెళ్లి అక్కణ్నుంచి హెలికాప్టర్‌లో వెళదాం అని గట్టిగా చెప్పలేని చీఫ్ సెక్యూరిటీ ఆఫీసరు, మిస్సయిన చాలా సేపటికిదాకా చర్యలు చేపట్టని యంత్రాంగం, హోం మంత్రిని లెక్కచేయని డిజిపి, పోలీసు మాన్యువల్‌లో గాలిలో ప్రమాదాలు లేవని తెలియని హోం మంత్రి, – అడుగడుగునా పాలనాయంత్రాంగం వైఫల్యమే. ఎక్కడ చూసినా వైయస్ స్వయంగా ఎంపిక చేసిన వ్యక్తులే. ఏం ఉద్ధరించారు వాళ్లు? సాక్షాత్తూ సిఎం మిస్సయితే మీరూ నేనూ వెళ్లి వెతకాలట. నేలమీద పడ్డాకైనా పోలీసుల డ్యూటీ ప్రారంభమవదా?

8

వైయస్ పుణ్యాత్ముడే అనాలి. హెలికాప్టర్ కూలీకూలగానే పోయి అనాయాస మరణం పొందాడు. ఒకవేళ పైలట్ ఏదో ఒకరకంగా

దింపాడనుకోండి. ఈ పోలీసులు కనిపెట్టేదాకా (అంటే 24 గంటలు) గాయాలతో, ఆకలిదప్పులతో, అడవి జంతువుల మధ్య, (మిగిలుంటే) మావోయిస్టుల మధ్య కొట్టుమిట్టులాడ వలసి వచ్చేది. వీళ్లు వచ్చేలోగానే పుణ్యకాలం దాటిపోయేది కూడా. ఆయన పెట్టిన ఆరోగ్యశ్రీ ఫలితం కూడా ఆయనకు అందేది కాదు.

పోనీ అంత్యక్రియలైనా సవ్యంగా జరిగాయా? సైనిక వందన వంటి ప్రభుత్వలాంఛనాలతో జరిగాయా? లేదే! దహనం చేసి వుంటే ఎత్తయిన ప్లాట్‌ఫారం మీద ఏర్పాటు చేసి చుట్టూ బారికేడ్లు కట్టేవారు. దూరం నుంచి చూడగలిగేవాళ్లం. ఖననం కాబట్టి ప్లాట్‌ఫారం కట్టలేరు సరే... కానీ జనాల్ని కాస్త దూరంగా నెట్టలేరా? ఎవరు పడితే వాళ్లు నెట్టుకుని వచ్చేయడమేనా? ప్రతిపక్ష నాయకులు, మంత్రివర్గ సహచరులు ఎవరూ చేరలేనట్టుగా చేసిందెవరు? ఆ జిల్లా పోలీసుల వైఫల్యం కాదా యిది? కడప జిల్లా, అందునా ఆ ప్రాంతం అంటే పైనుండి కిందదాకా వైయస్ మనుష్యులే. వాళ్లు జెడ్ కాటగిరీ నాయకులకు కూడా సెక్యూరిటీ కల్పించలేని అసమర్థులన్నమాట.

ఈ నిర్వాకానికి ఎవరు బాధ్యులు? ఫలానా ఎ, బి, సి.. మాత్రమే కాదు, వాళ్లను ఆ స్థానాల్లో నియమించినవారు కూడా. విశ్వాసపాత్రులైన వారినే కీలకస్థానాల్లో వేసుకోవడం ఎవరైనా చేసే పనే. అయితే యోగ్యత కూడా చూస్తారు. ఒక్కొక్కప్పుడు యోగ్యత వుండీ మాటవినని వాళ్లుంటే వాళ్లను సహించడం కూడా నేర్చుకుంటారు. కానీ వైయస్‌కు ఆ అలవాటు లేదు. అందరూ తన మాట వినవలసినదే. మాట విన్నవాడే యోగ్యత కలవాడన్న ఫిలాసఫీ కాబోలు. దానికి భారీమూల్యం చెల్లించారు పాపం.

వీళ్లకు యోగ్యత లేదండి అని ఎవరో ఒకరు చెప్పేవుంటారు. కానీ ఆయన వినరు. తనకు తోచినది జంకు, గొంకు లేకుండా చేయడం తప్ప విమర్శలు లెక్కచేయకపోవడం ఆయన సహజగుణం. జైల్లో వున్న ఫ్యాక్షనిస్టుని పలకరించాలంటే మరో నాయకుడైతే జంకుతాడు. 'కాలేజీ రోజులనుండి యిన్‌కమ్ టాక్స్ రిటర్న్స్ ఫైల్ చేశా'నని చెపుతూనే 'ఇడుపులపాయలో వందల ఎకరాలు అసైన్‌డ్ అని నాకు తెలియదు, మా నాన్నగారే ఆ వ్యవహారాలు చూసుకునేవారు. ఆయన పోయిన పదేళ్లకు గుర్తించి ఎవరూ అడక్కుండా నేనే ప్రభుత్వానికి అప్పగించేశా' అని అనడానికి సిగ్గుపడేవాడు. 'గాలి జనార్దనరెడ్డి ఎయిర్‌పోర్టుకు యిన్ని ఎకరాలా?' అని ప్రతిపక్షం విమర్శిస్తే 'ఆట్టే మాట్టాడితే అంతకు రెట్టింపు యిస్తా' అని అనగలిగే ఫ్యూడల్ స్వభావం బయటపెట్టుకోవడానికి భయపడతాడు.

'రాజువయ్యా, మారాజు వయ్యా' అని తనగురించి పాడే పాట ఆయనను యిన్‌స్పయిర్ చేసి వుంటుంది. నిజంగా రాజులాగానే పాలిద్దామని చూశారు. రాచరికపు పోకడలు పోయారు. పాతకాలపు రాజులు కవులకు అగ్రహారాలు యిచ్చేసే లెవెల్లో ఐటీ కంపెనీలకు ఎకరాలకు ఎకరాలు ధారాదత్తం చేసేశారు. అదేమంటే చంద్రబాబు యివ్వలేదా అని లాజిక్ లాగడం! ఆయన పది యిస్తే నా లెవెల్‌కు వందిస్తా అనే పంతం! వాళ్లకంత అవసరమా? దాన్ని వాళ్లు ఏం చేస్తున్నారు? అన్న ఆలోచనే లేదు. సెజ్‌లలో కూడా యిదే తంతు. ఎంత భూమి యిచ్చాం, వాళ్లు దాన్ని సద్వినియోగం చేస్తారా, లేదా అన్న ఆలోచనే లేదు. ఇచ్చేస్తూ పోవడమే. ఇప్పుడు సెకండ్ టర్మ్ సిఎం అయ్యాక కాస్త నిదానించి సెమ్ యిండియా లాటి కంపెనీల నుంచి వెనక్కి తీసుకోవడం మొదలెట్టారు. కానీ యీ లోపులే ఆయువు తీరిపోయింది.

మడమ తిప్పని, మాట తప్పని వంశం అని చెప్పుకోవడం కూడా ఫ్యూడల్ స్వభావమే. ఇప్పటికాలంలో యిదేదో మాఫియా లీడర్ భాష అనిపిస్తుంది తప్ప ప్రజాస్వామిక పంథా అనిపించుకోదు. ఎన్టీయార్‌ది కూడా యిదే తరహా. ఆయనకు తోచినది వెంటనే చేసేయడమే. సాధ్యాసాధ్యాల మాట ఆలోచించడం లేదు. వైయస్ ఎన్టీయార్ సినిమాలను అభిమానించేవారట. రాజకీయ నాయకుడిగా కూడా ఆయన పద్ధతి నచ్చినట్టుంది. ఆయన లాగానే ప్రజల మధ్య ప్రమాణస్వీకారం, తొలి ఫైల్‌పై జనాల హర్షధ్వానాల మధ్య సంతకం పెట్టడం – యివన్నీ చేశారు. ఆయన లాగానే రెండు రూపాయలకు కిలో బియ్యం యిద్దామనుకుని జనాల జీవితాల్ని అస్తవ్యస్తం చేశారు. 20 యేళ్ల క్రితం రెండు రూపాయలకు యిచ్చినదాన్ని ప్రైస్ ఇండెక్స్ ప్రకారం ఎంతకు యివ్వాలన్న సింపుల్ కాలిక్యులేషన్ కూడా చేయలేదు.

సినిమా టిక్కెట్టుకి, ఆఖరికి బస్సు టిక్కెట్టుకి వెచ్చించినంత డబ్బు బియ్యానికై వెచ్చించలేరా జనం? అయితే వాళ్లని ఆ స్థితిలో వుంచిన పాపం ఎవరిది? వాళ్ల కొనుగోలు శక్తి పెంచడానికి ఏం చేసినట్టు? ఎల్లకాలమూ ఆ రెండు రూపాయలకే యిస్తారా? అదీ ఎంతమందికి? రేషన్ కార్డులు చిత్తమొచ్చినట్టు పంచిపెట్టారు. రెండోసారి ఎన్నికలయ్యాకనే బోగస్ కార్డులు బయటపడ్డాయా? ఈ పని ముందే చేసి వుంటే యీ రోజు బయట మార్కెట్‌లో బియ్యం 35 రూ.లకు చేరేది కాదు కదా! ఇతర రాష్ట్రాలకు బియ్యం అక్రమ రవాణా అవుతోందని వారి ''సాక్షి'' పత్రికే రాస్తుంది. రెండు రూపాయలకు బియ్యం యివ్వాలన్న సదుద్దేశంతో బాటు యీ అక్రమ రవాణా అరికట్టాలన్న సంకల్పం వైయస్ సర్కారుకి లేదా?

తన సంక్షేమ పథకాలే తనను గట్టెక్కిస్తాయన్న నమ్మకంతో వున్న వైయస్ ఎన్నికల ఫలితాలు చూసి కంగు తిన్నారు. కేంద్రంలో మన్‌మోహన్ పరిపాలనను ఆమోదించినంత లెవెల్లో ఆంధ్రప్రజలు తన పాలనను ఆమోదించలేదని తెలుసుకున్నారు. పథకాల ఫలితాలు సామాన్యులకు చేరడంలో (డెలివరీ సిస్టమ్‌లో) లోపాలున్నాయని గ్రహించి వాటిని, సరిదిద్దడానికే 'రచ్చబండ' కార్యక్రమం పెట్టుకున్నారు. ఆ కార్యక్రమం అవేళ ఎలాగైనా ప్రారంభం చేయాలన్న పట్టుదలే ఆయన్ను ప్రమాదంలోకి నెట్టింది. అదీ ఐరనీ ఆఫ్ ఫేట్!

కిలో రెండు రూపాయల బియ్యం లాగానే  చాలా ప్రజాకర్షణ పథకాలు కనబడతాయి. ఆరోగ్యశ్రీ వలన వైయస్‌కి ఎంతో పేరు వచ్చింది. నిజంగా దానివలన మేలు జరిగినవాళ్లు ఎంతోమంది కనబడతారు. 'ఏదైనా ముంచుకొస్తే 108కి ఒక్క కాల్ చేస్తే చాలు, ప్రాణం నిలుస్తుంది' అన్న ధీమా నగరాల్లోనే కాదు, గ్రామాల్లో కూడా కలగడానికి కారణం యీ ఆరోగ్యశ్రీయే. దాన్ని విమర్శించినవారిని పట్టుకు తన్నేంత యిదిగా పేరు వచ్చింది ఆ పథకానికి.

నా బాధ ఏమిటంటే ఆరోగ్యశ్రీపై పెట్టిన శ్రద్ధలో పదోవంతు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై పెట్టలేదేమని. ప్రైమరీ హెల్త్ సెంటర్లు (పిఎచ్‌సి) అన్నీ మంచమెక్కాయి. డాక్టర్లు లేరు. హెల్త్‌కేర్ స్టాఫ్ లేరు. మందులు లేవు. కోతిపుండు బ్రహ్మరాక్షసి అయ్యాక మాత్రం ఆసుపత్రికి తీసుకెళ్లడానికి 108 వుంది. పేదప్రజలకు సైతం కార్పోరేట్ వైద్యం అన్న స్లోగన్ వినడానికి బాగానే వుంది. అసలు పేదవాడు కానీ, పెద్దవాడు కానీ కార్పోరేట్ హాస్పటల్‌కి వెళ్లవలసిన అవసరం ఎందుకు పడుతుంది, ఆరోగ్యకేంద్రాలు సవ్యంగా పనిచేస్తే?

ప్రజల వద్దకు పాలన అంటూ ప్రభుత్వమే మన ముంగిట్లోకి వస్తోంది కదా. మరి అలాటప్పుడు ఉత్తమవైద్యం మన ముంగిట్లోనే అందిస్తే మంచిది కదా. ఆరోగ్యశ్రీపై యింత ఖర్చు చేసినా మరణాల సంఖ్య తగ్గలేదని గణాంకాలు తెలుపుతున్నాయట. అంతే కాదు, హృద్రోగాలతో పోయేవాళ్ల కంటె డయేరియా, ఫ్లూ వుంటి సాధారణ రోగాలతో పోయేవాళ్లు ఎక్కువట. పిఎచ్‌సిలను బలోపేతం చేయవలసిన అవసరం ఎంతో వుంది. అది విస్మరించి కార్పోరేట్లకే మనం ప్రాధాన్యత యివ్వడంతో డాక్టర్లందరూ ఆ హాస్పటల్లో వుద్యోగాలకే ఎగబడుతున్నారు. మెడికల్ కాలేజీల్లో పాఠాలు చెప్పే డాక్టర్లు కరువవుతున్నారు. పోనుపోను మనకు డాక్టర్లు తయారవడం కష్టం.

తయారైనవాళ్లయినా గ్రామాలకు వెళ్లరు. గ్రామీణాభివృద్ధి జరిగి, అక్కడ రాజకీయ కాలుష్యం తగ్గి, డాక్టర్ల పిల్లలకు విద్యాసౌకర్యాలు వుంటాయన్న భరోసా యిచ్చిన రోజునే పిఎచ్‌సిలు పుంజుకుంటాయి. ఇది చాలా పెద్ద ప్రాసెస్. కానీ ఏదో ఒక స్థాయిలో జరుగుతూనే వుండాలి. ఆరోగ్యశ్రీ మీదనే ఫోకస్ పెడితే దీనిపై చిన్నచూపు పడుతుంది. ఈ లోపున ఆరోగ్యశ్రీ ఆపేయాలని నేననను. ఆరోగ్యశ్రీను, పిఎచ్‌సిల ను రెండింటినీ బాలన్స్ చేస్తూ రావాలి కానీ, ఆరోగ్యశ్రీలో రోగాల లిస్టు పెంచుతూ పోతేనో, లేక ఖర్చు లిమిట్ పెంచుతూ పోతేనో పొరబాటే. స్వయంగా డాక్టరై, పల్లెటూళ్లో రూపాయికే వైద్యం చేసిన వైయస్ గారు పిఎచ్‌సిల ప్రాధాన్యం గుర్తించకపోవడం నిజంగా విషాదకరం.

కేంద్రం పథకాలనండి, వైయస్ పథకాలనండి వాటిలో కొన్ని జనం స్థాయి పెంచే పథకాలు వున్నాయి. ముఖ్యంగా మహిళలను వుద్దేశించిన పథకాలలో చాలా మంచివి కూడా వున్నాయి. అయితే యివి ఎలా అమలయ్యాయి అన్న విషయమే తరచి చూడాలి. అది అంత సులభమైన పని కాదు. వైయస్ వ్యతిరేకులు పథకాలన్నిటిలోనూ అవినీతే అంటారు. వైయస్ భక్తులు అన్నీ అద్భుతంగా నడుస్తున్నాయంటారు. ఏదైనా ఒక యిండిపెండెంటు ఏజన్సీ పరిశీలించి నిజానిజాలు తెలిపితే బాగుండునని అనిపిస్తుంది. జాతీయ వుపాధి పథకం అద్భుతంగా అమలు చేస్తున్నారు, మీ వద్దనుండి మేం చాలా నేర్చుకోవాలి అన్నారట రాజస్థాన్ స్పీకర్ మొన్న వచ్చి. నిజమేనా? అని ఆశ్చర్యమేస్తుంది.

గ్రౌండ్ రియాలిటీ ఏమిటో అక్కడ వున్నవాళ్లే చెప్పాలి. అదీ ఆ వూరి వరకే చెప్తారు. ఎందుకంటే ప్రతీ వూళ్లోనూ ఒక్కో పరిస్థితి వుంటుంది – అక్కడి అధికారుల బట్టి, నాయకుల బట్టి. మొత్తం మీద జనరలైజ్ చేయలేం. ఈ స్టాటిస్టిక్స్ అనేవి ఏ ఐదు, పదేళ్ల తర్వాతనో వస్తాయి. టార్గెట్  ఇంత, కానీ జరిగినది యింతే అని. ఈ లోగా ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తూనే వుంటుంది. ఇన్ని యిళ్లల్లో దీపాలు, యిన్ని కోట్లమంది కళ్లల్లో వెలుగులు అని. అబ్బే అంతా చీకటే! అంటాయి పత్రికలూ, ప్రతిపక్షాలూ. మనం సర్వాంతర్యాములు కాము కాబట్టి ఏదైనా లాజిక్ వుపయోగించి నిజం వూహించగలగాలి. ఏదైనా పథకం విజయవంతం కావాలంటే పూనుకోవలసినది నాయకులు, అధికారుల యంత్రాంగం. అవి ఎలా వున్నాయో చూద్దాం.

వైయస్ మంత్రివర్గ సహచరులు ఎటువంటి వారో చూస్తే ఆ పథకాలు ఎలా అమలై వుంటాయో కాస్త వూహించవచ్చు. వైయస్ వున్నంత కాలం ఆయన కరిష్మాతో అన్నీ కప్పడిపోయాయి. సర్వస్వం తానెయే యై ఆయన భాసించాడు. ఎవరైనా గట్టిగా మాట్లాడబోతే తన వాక్చాతుర్యంతో, వ్యక్తిత్వంతో ధాటీగా జవాబు చెప్పి నోరు మూయించాడు. ఇప్పుడు ఆయన లేరు. సహచరుల నిజరూపాలు బయటపడుతున్నాయి. గత పదిహేను రోజులుగా యీ మంత్రివర్యుల ప్రవర్తన చూడండి. రాష్ట్రంలో స్వైన్‌ఫ్లూ స్వైరవిహారం చేస్తోంది. 85% మండలాలు కరువులో విలవిల్లాడుతున్నాయి. వర్షం వస్తే నగరం మునిగిపోతోంది. చేసిన పనులకు బిల్లులు చెల్లించే నాథుడు లేడు. ఖజానా నిండుకుంది. కేంద్రాన్ని అడుగుదామంటే అక్కడా డబ్బుల్లేవు. వాళ్లే ఫైవ్‌స్టార్ హోటళ్లలోంచి మకాం ఎత్తేస్తున్నారు.

ఇలాటి సమయంలో యీ మంత్రిపుంగవులు సెక్రటేరియట్‌కు రారు. సమీక్షా సమావేశాల్లో పాల్గొనరు. ఏం జరుగుతోందో, ఏం చెయ్యాలో పట్టించుకోరు. ఏమైనా అంటే జిల్లాలలో సంతాపసభలకు వెళ్లారని రోశయ్యగారు వెనకేసుకుని వస్తారు. నిజంగా సంతాపమా? 'సన్'తాపమా? ('పన్' సుధామది). శవం వెళ్లిన యిల్లు చూడండి. మర్నాటికి ఏర్పాట్ల సంగతేమిటి? పదిమందీ వస్తారు, కూరా నారా వున్నాయా? తెప్పించాలా? అని భర్తను పోగొట్టుకున్న భార్య సైతం ఆలోచిస్తుంది. ఇల్లు గడవాలి కదా! కానీ వీళ్లు రాష్ట్రం గడవడం

గురించి ఆలోచించరు. ప్రజల గోడు పట్టదు. ఇలాటి వీళ్లు యిన్నాళ్లూ ప్రజా సంక్షేమ పథకాలు యించక్కా అమలు చేశారంటే నమ్మగలమా?

10

ఏ పథకమైనా సరిగ్గా అమలు కావాలంటే అధికారగణం సహకారం అతి ముఖ్యం. అయితే యీ గణం పొగరుబట్టిన గుఱ్ఱం లాటిది. అదుపు చేయగలిగితే అద్భుతంగా ఎంతో ఎత్తుకు తీసుకెళుతుంది. ఆ విద్య చేతకాకపోతే కిందకు పడదోసి అదే మనమీద సవారీ చేస్తుంది. "ఎస్ మినిస్టర్" బిబిసి సీరియల్‌లో మంత్రులు-అధికారుల మధ్య సమీకరణాలు ఎలా వుంటాయో చాలా బాగా చూపించారు. రాజకీయ నాయకులపై అధికారులందరకూ చిన్నచూపే. వీళ్లకు మనంత చదువూ లేదు, భాషా రాదు, రూల్సూ తెలియవు. వీళ్లు చెప్పడం, మనం వినడం ఏమిటని వారి అభిప్రాయం.

ఆ సీరియల్‌లో ఓ అధికారి మరో అధికారితో అంటాడు – "ఒక మంత్రి సరాసరిన ఓ శాఖలో వుండే కాలం తొమ్మిది నెలలు. బాగా పనిచేస్తే మరో మంచి శాఖలోకి వెళ్లిపోతాడు, పని చేయకపోతే యింకో తక్కువ స్థాయి శాఖకు తోసేస్తారు. ఎటు తిరిగి వుండబోయేది తొమ్మిది నెలలే. ఈ లోపున నియోజకవర్గ పర్యటనలు, స్వంత పనులు, వచ్చిన కార్యకర్తలకు దర్శనాలు యివ్వడాలు, పదవి నిలుపుకోవడానికి పై వాళ్ల దగ్గర పైరవీలు – వీటన్నిటికీ టైము పోగా పని నేర్చుకునే దెప్పుడు? యిక మన జోలికి వచ్చేదెపుడు? మనమంటావా, దశాబ్దాల తరబడి యిక్కడే పడివుండేవాళ్లం. కొత్తపార్టీ కానీ అదే పార్టీలో కొత్త మంత్రిగానీ రాగానే 'పాతాయన నన్ను సరిగ్గా పనిచేయనీయలేదు సార్, నా దగ్గర ఓ అద్భుతమైన పథకం వుంది. దాన్ని ఆయన పట్టించుకోనే లేదు. అది మీరు క్షుణ్ణంగా చదివి గ్రీన్ సిగ్నల్ యిస్తే అమలు చేద్దాం' అనండి. ఓ పాతపథకానికే పేరు మార్చి ఓ దస్త్రం ఆయన మొహాన్న కొట్టండి. చదువుతూ కూచుంటాడు. ఈ లోపున కొత్త మంత్రో, కొత్త పార్టీయో వచ్చేస్తుంది– యిలా సాగుతుంది అతని వుపన్యాసం.

అయితే రాజకీయనాయకులు తెలివితక్కువ వారు కారు. వాళ్లకున్న బలం కామన్‌సెన్స్. గ్రాస్‌రూట్ లెవెల్లో ఏం జరుగుతోందో నిమిషాల్లో తెలిసిపోయే సౌకర్యం. అధికారులైతే వారిలాటి కింది అధికారుల రిపోర్టుల పైననే ఆధారపడాలి. నాయకుడికి ఆ బాధ లేదు. ఎంత బ్రహ్మాండమైన పథకమైనా ఆచరణలో ఎలా విఫలమౌతోందో చక్కగా తెలుసుకోగలడు. అందువల్లనే మంచి నాయకులన్నవాళు ్ల విషయపరిజ్ఞానంతో అధికారులను మన్నిస్తూ, అదుపు చేస్తూ, సామర్థ్యాన్ని రాబడుతూ పరిపాలన చక్కగా నడుపుతారు. లేనివాళ్ల సంగతి – చెప్పేదేముంది?

వైయస్ జమానాలో బ్యూరాక్రసీ నడిచిన తీరు ఎలా వుందో చూద్దాం. బాబు హయాంలో బ్యూరాక్రసీ ఆయనపై కత్తి కట్టింది. ఆ ఎత్తిన కత్తి యిప్పటిదాకా దించలేదని బాబుకి అనుమానం. అందుకే ఈవియంలు దురుపయోగమవుతాయని భయపడి వాటి వినియోగం వద్దని పోరాడుతున్నారు. జన్మభూమి అనీ, ప్రజల వద్దకు పాలన అనీ, వీడియో కాన్ఫరెన్సింగ్ అనీ, మరోటనీ బాబు బ్యూరాక్రసీని అదలిస్తూ, బెదిరిస్తూ, కొండొకచో పబ్లిగ్గా అవమానిస్తూ పరిపాలన సాగించారు. బాబుకి ప్రజాదరణ వున్నంతకాలం వుద్యోగిగణం ఏమీ చేయలేకపోయారు కానీ ఎప్పుడైతే అది తగ్గిందో వాళ్లూ ఓ చూపు చూశారు. గ్రామీణప్రాంతాల్లో ఓటర్ల బదులు వీళ్లే ఈవియం మీటలు కాంగ్రెస్ పక్షాన నొక్కేశారన్న మాట ఎంతవరకు నిజమో తెలియదు కానీ బాబు ఓడిపోయినప్పుడు సెక్రటేరియట్‌లో ఒకటే కోలాహలం. కాంగ్రెస్ పార్టీ మాదే అనుకుని మేమే అధికారంలోకి తెచ్చామని ఉద్యోగి సంస్థల నాయకులు కొందరు ప్రకటించారు కూడా.

మనది అనుకోగానే ఒక విధమైన వుదాసీనత్వం కూడా వచ్చేస్తుంది. సెక్రటేరియట్‌లో 11.30 కు కూడా ఎవరూ రాక సీట్లు ఖాళీగా వున్న ఫోటోలు పేపర్లలో వచ్చాయి. క్రమశిక్షణ తప్పిందని ఎన్నో ఫిర్యాదులు. అయినా వైయస్ యీ దిశగా చేసినదేమీ లేదు. ఎవర్నీ గట్టిగా తిట్టినది లేదు. వైయస్ పోయినప్పుడు టీవీ ఛానెల్‌లో మాట్లాడుతూ టీవీ పెర్శనాలిటీ, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ వైయస్ ఔదార్యం గురించి, సిఎం పేషీ పనితీరు గురించి ఎంతో మెచ్చుకున్నారు. ఏదైనా అడిగితే వెంటనే రెస్పాన్సు వస్తుందని, చకచకా పనులు జరుగుతాయనీ చెప్పారు. అదే గుక్కలో యితర మంత్రుల పేషీలు యిలా పనిచేసి వుంటే అసలు సమస్యలే వచ్చేవి కావు అన్నారు.

ప్రభుత్వోద్యోగులలో సాధారణంగా భయం వుండదు, జవాబుదారీతనం వుండదు. తిప్పించుకుంటారు. ఫిర్యాదు చేస్తే వినే నాథుడుండడు. ఇది ఎప్పుడూ వుండే లక్షణాలే అయినా వైయస్ హయాంలో ఓ డిగ్రీ ఎక్కువగా వుందనే చెప్పాలి. ఏం చేసినా, చేయకున్నా ఏమీ కాదులే అన్న ధీమా కనబడింది. నగరంలో రోడ్ల పరిస్థితి చూసినా, పంజగుట్ట ఫ్లయిఓవర్ కూలిన ఘటన చూసినా, గ్రేటర్ హైదరాబాదు వారి యింటిపన్ను బిల్లులు చూసినా – ఏది చూసినా ఎవరికీ బాధ్యత లేనట్టు, వారిపై అజమాయిషీ లేనట్టూ తోచింది. వైయస్‌కి కూడా పరిపాలనపై పట్టు లేదనిపించింది. చూడకుండా ఫైళ్లపై సంతకం పెట్టానని చెప్పడాలు ఒకటే కాదు. 2004లో ఆయన అధికారానికి వచ్చారు కదా, కనీసం మూడేళ్లపాటు ఆయనకు ఎడ్మినిస్ట్రేషన్ తెలియదనే అనిపించింది.

దానికి తోడు మాటిమాటికీ బదిలీలు ఒకటి. మజ్లిస్‌వాళ్లు కోరితే ఎంతటివాడినైనా సరే, తీసి పక్కన పడేయడమే. జిల్లాల్లో కూడా నాయకులు పట్టుబట్టి కొందర్ని మార్పించుకున్న సంఘటనలున్నాయి. ఇవి ఎవరిపాలనలో నైనా జరుగుతాయి. వైయస్ పాలనలో

మరింత ఎక్కువగా జరిగాయి. అయితే ఎవరూ బాధ్యత వహించకుండా వుంటే, ఎవరూ పట్టించుకోకుండా వుంటే పనులు ఎలా జరిగాయి? అందువలన జరిగాయి. కొత్త పథకాలు రూపొందించడం, కొన్నిటిని అమలు చేయడం, డైలీ ఆపరేషన్స్ – యివన్నీ జరగడానికి ఎందరో కొందరు మహానుభావులు పనిచేసి వుంటారు కదా. వారందరికీ నమస్కారం. ప్రజోపయోగ పథకాల అమలు గురించి మాట్లాడుతూ యివన్నీ చెప్పుకుని వచ్చాం. పథకాల అమలులో నాయకుల చిత్తశుద్ధి అంతంత మాత్రమే అని అనుకుంటే, అధికారుల చిత్తశుద్ధి కూడా మరీ అంత గొప్పగా లేదనే అనిపిస్తుంది. అందువలన ఏదో కొంత మేరకే అమలు అయి వుంటాయి. అందుకే ఆశించినన్ని ఫలితాలు ప్రజలకూ, ఓట్లు వైయస్‌కు దక్కలేదు. రెండోసారి పదవిలోకి వచ్చాక గట్టిగా నడుం బిగిద్దామని అనుకునే రచ్చబండ పెట్టుకున్నారు. కానీ అది జరగలేదు.

## 11

వైయస్ మంత్రిగా చేసిన అనుభవం గడించినది అతి కొద్ది కాలమే. రెండు దశాబ్దాలపాటు మళ్లీ దాని జోలికి పోలేదు. అంతా రాజకీయ కార్యకలాపమే. అందువలన పరిపాలనలో అనుభవరాహిత్యం వుండడం సహజమే. అయితే ప్రజలకు మేలు చేసే వుద్దేశంతోనే యీయన గద్దె నెక్కాడు అని ప్రజలు నమ్మారు. అంటే డొక్కశుద్ధి లేకపోయినా, చిత్తశుద్ధి వుందనుకున్నారన్నమాట. అందుకే ఆయన పాలనలో లోపాలను పెద్దగా పట్టించుకోలేదు. పేపర్లు ఎంత దుమ్మెత్తి పోసినా అందుకే ఆయన ప్రజాభిమానం కొనసాగింది. 20 ఏళ్లపాటు మంత్రి సీట్లో కూచోలేదు కానీ స్వంతపనులకో, యితరుల పనులకో ఆయన అధికారులతో వ్యవహరిస్తూనే వున్నాడు కదా. అందుకని ఎవరు ఎటువంటివారో తెలుసు. వాళ్లను ఎలా వుపయోగించుకోవాలో తెలుసు. ఇంతకుముందే చెప్పుకున్నట్టు ఆయనకు ఆర్ట్ ఆఫ్ డెలిగేషన్ తెలుసు. మంత్రులకు, అధికారులకు పనులు అప్పగించి పైపైన చూసుకుంటే చాలు అనుకున్నాడు. పని అప్పగించిన తర్వాత ఏదైనా తేడా పాడా వస్తే నేను చూసుకుంటానన్న హామీ యిచ్చి ఆ మాటకు కట్టుబడ్డాడు. అందుకనే ఆయనకు అన్నిచోట్లా నమ్మకమైన వర్గం ఏర్పడింది.

వైయస్‌కు విషయపరిజ్ఞానం చాలా హెచ్చు. ప్రతిపక్షంలో వుండడం చేత, పాలకపక్షంలోనే అసమ్మతినేతగా వుండడం చేత ఏ రంగంలో ఏ మేరకు అభివృద్ధి జరిగిందో, ఏ మేరకు జరగలేదో ఆయన గమనిస్తూనే వున్నారు. దాన్ని వెంటనే గుర్తుకు తెచ్చుకునే ప్రజ్ఞ కూడా వుంది. అసెంబ్లీలో కానీయండి, బయట మీటింగుల్లో కానీయండి – మంత్రులు పొరబాటు చేస్తే సవరించే సామర్థ్యం అనేకసార్లు కనబరచారు. ప్రతిపక్షాలను ఢీ కొనడంలో ఆయన విషయపరిజ్ఞానం ఎంతో వుపకరించింది. తడుముకోకుండా అంకెలు గడగడా వల్లించేవారు. ప్రతిపక్షాలు తప్పుగా చెపితే వెంటనే పట్టుకోగలిగేవారు.

నాలెజ్‌తో బాటు ఆయన కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా అద్భుతం. చక్కటి తెలుగు. సామెతలతో, జాతీయాలతో అవసరమైన వొత్తుతూ, హేళన చేసేచోట్ల తేల్చేస్తూ, నవ్వుమొహంతో చెప్పడం వలన శ్రోతపై పూర్తి ఎఫెక్టు పడేది. చంద్రబాబు యీ విషయంలో ఆయన వద్ద నేర్చుకోవలసినది చాలా వుంది. ఆయన బిగుసుకుని పోయి వుంటాడు. ఆయన వైఖరి ఏదో యాంత్రికంగా వుంటుంది. హ్యూమన్ ఎమోషన్స్ తక్కువ అనిపిస్తాయి. తన కుటుంబంతో వైయస్ వ్యవహరించే తీరు, ఎవరైనా తెలిసున్నవారు కనబడితే ఆప్యాయంగా దగ్గరకు తీసుకోవడం, భుజం తట్టడం, ఒక మామూలు వ్యక్తి ఎలా స్పందిస్తాడో అలా స్పందించడం యివన్నీ ఆయన్ని జనాలకు మానసికంగా దగ్గర చేశాయి.

అనుభూతులు బహిరంగంగా కనబరిస్తే తను మామూలు మనిషి అని అనుకుంటారేమో అనే కాంప్లెక్సుతో భయపడుతున్నట్టు వుంటుంది బాబు తరహా. ఆనందం, విషాదం – ఏదీ పలకదు ఆయన మొహంలో. ఒక ఐరన్ మాస్క్ తొడుక్కుని 'రోజూ 18 గంటలు పని చేసి నేనూ రోబోని అయిపోయా' అని చాటుతున్నట్టు వుంటుంది. వైయస్ యిలా ఒక ఎమోషనల్ బీయింగ్‌గా వుండటం చేతనే ఆయన మరణం అందర్నీ కలచివేసింది. పైగా అకాల మరణం, దుర్మరణం. నవ్వుతూ నవ్వుతూ వున్న మనిషి నిమిషాల్లో ఎగిరిపోయాడు పాపం అని శత్రువులు సైతం కంటతడి పెట్టేట్లా చేసింది. ఆయన గురించి చిన్న విమర్శ చేసినా 'అవన్నీ యిప్పుడు రాయాలా?' అని విసుక్కొనేట్లా చేసింది.

వైయస్‌లో అందర్నీ ఆకట్టుకునే మరో అంశం ఆత్మవిశ్వాసం. ధీరుడంటే యిలా వుండాలి అన్నట్టు వుంటుంది ఆయన పద్ధతి. 2009 ఎలక్షన్లలో 'గెలుపైనా ఓటమైనా నాదే బాధ్యత' అని చెప్పి ముందుకు సాగడం మేనేజ్‌మెంట్ పాఠాల్లో చెపుతున్నారని ఓ కాలమిస్టు రాశారు. నాయకుడు అలా వుంటే కార్యకర్తకు హుషారుగా వుంటుంది. గెలిస్తే నాదీ గొప్ప, ఓడిపోతే కార్యకర్తల అనైక్యత, ఎదుటి పార్టీల కుట్ర, ఎలక్షన్ కమీషనర్ పక్షపాతం, శుష్కవాగ్దానాలకు ప్రజలు ఏమారిపోవడం – యిలా మాటలు వినడానికి చికాగ్గా వుంటాయి.

ఓ పక్క మహాకూటమి అమలు చేయలేని హామీలు గుప్పిస్తూంటే 'నేను యింకేమీ చేయను. చేయగలిగిదంతా చేశాను. గెలిస్తే యిదిగో యీ రెండూ – చిన్నవే – చేయగలుగుతాను' అని చెప్పడానికి ఎంత ధైర్యం కావాలి! అదే విధంగా తెరాసను దూరం చేయడానికి ఎంత సాహసం చేయాలి! వాళ్లు రెచ్చిపోయి మేం వెళ్లిపోతాం జాగ్రత్త అంటే 'అయితే ఏంటంట?' అనడానికి ఎంత దమ్ము వుండాలి! ఓ పక్క సోకాల్డ్ తెలంగాణా సీనియర్లు ఒత్తిడి చేస్తున్నా తెరాసతో పొత్తు వద్దు' అని చెప్పడానికి ఎంత ధైర్యం

వుండాలి! ఖర్మకాలి ఫలితం అటూ యిటూ అయి అధికారంలోకి రాలేకపోతే వీళ్లంతా ఆయన్ని పాతేసి వుండేవారు కదా.

సమైక్యవాదమే పునాదిగా వెలసిన తెలుగుదేశం సైతం ప్రత్యేకవాదం పాట ఎత్తుకున్నా, విశాలాంధ్ర నినాదం చచ్చేదాకా వదలమన్న కమ్యూనిస్టులు వాళ్లతో స్వరం కలిపినా 'ఏది ఏమైనా నేను సమైక్యవాదినే' అని చాటి చెప్పడం మొనగాడి లక్షణం. 'ఎవరు గెలుస్తారు?' సీరీస్‌లో నేను రాశాను – 'ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రం విడిపోతే నష్టం. వైయస్ పాలనలో ఎన్ని లోపాలున్నా ఆయన సమైక్యవాదానికి కట్టుబడ్డాడన్న ఒక్క కారణంగా నేను కాంగ్రెస్‌కు ఓటేస్తున్నాను. వేరే ఎవరున్నా కాంగ్రెస్‌కు ఓటేసేవాణ్ని కాను. నాలాగే చాలామంది ఫీలైతే కాంగ్రెసే గెలుస్తుంది' అని రాశాను. నాలాగే చాలామంది ఫీలయ్యారు. అందుకే గ్రేటర్ హైదరాబాదు ఏరియాలో ప్రత్యేకవాదానికి నిలువనీడ లేకుండా పోయింది. తక్కినచోట కూడా తెలంగాణావాదానికి ఓట్లు పెద్దగా రాలలేదు. దీన్ని ముందే పసిగట్టి, దాని కోసం గట్టిగా నిలబడిన రాజకీయవాది వైయస్. ఆ చాకచక్యం తక్కినవారికి లేకపోయింది.

## 12

వైయస్ మరణానికి కారణం ఆయన స్వయంగా ఎంచుకున్న సహచరుల అసమర్థత అని నేను రాసినది కొందరు కాదన్నారు. దానికి దైవికమైన కారణం ఒకటి వుందట. వైయస్ హిందూ దేవాలయాలను ధ్వంసం చేసి, తిరుపతిని ఆక్రమించాలని చూడడం చేత తిరుపతి దేవుడు యిలా బుద్ధి చెప్పాడట. 2007లో వైయస్‌కు వ్యతిరేకంగా ఓ హిందూ సంస్థ ప్రచారంలో పెట్టిన ఓ కరపత్రాన్ని నాకు ఫార్వార్డ్ చేశారు కొందరు. అది బాగా చలామణీలో వుంది కాబట్టి దానిలో నిజానిజాలు చర్చించుకుంటే యిలాటి ప్రచారానికి ఎంత విలువ యివ్వచ్చో తేలుతుంది.

దానిలో వైయస్‌ను వై. శామ్యూల్ రెడ్డిగా వ్యవహరించారు. (ఆయన అసలు పేరు శామ్యూల్ అని సూచించడానికేమో) ఆయన పేరులో యస్ కు ఎక్స్‌పాన్షన్ 'సందింటి' అని అందరికీ తెలుసు. వాళ్ల కుటుంబసభ్యులందరికీ ఆ యస్ వుంది. అందరూ శామ్యూల్ లేనా? ఆంధ్రప్రదేశ్‌లోని దేవాలయాల ఆస్తులు అనేకం కొల్లగొట్టబడుతున్నాయని, దానికి యీయన బాధ్యుడనీ రాశారు.

నేను పుట్టకపూర్వం నుంచీ దేవాలయాల ఆస్తులు దోచుకుంటూనే వున్నారు. ఇదివరకు కాలంలో రాజులు, జమీందారులే కాదు, సామాన్య గృహస్తులు కూడా మొక్కుకనో, మరోదానికో దేవాలయాలకు పొలాలు రాసి యిచ్చేసేవారు. అప్పట్లో భూమి విలువ పెద్దగా వుండేది కాదు. సాధారణంగా కనబడే దేవాలయాలకు సైతం వందలాది ఎకరాల ఆస్తి వుండేది. కానీ ఏం లాభం? ఆ భూమి పరాధీనమై వుండేది. ఏ దుర్మార్గపు జమీందారో, రాజకీయ నాయకుడో దాన్ని సాగు చేసుకుంటూ దేవాలయానికి పదో, పరకో పడేసేవాడు. చాలా చోట్ల చిన్న చిన్న రైతులు కూడా ఆక్రమించి స్వంత భూముల లాగానే వాడుకుంటున్నారు. దేవుడి గుళ్లో పూజారికి పూట గడవడం కష్టంగా వుంటుంది. స్వామివారి ఆభరణాలు పెట్టేందుకు సరైన బీరువా కూడా వుండదు. బక్కచిక్కిన పూజారి వాటినేం కాపాడగలడు?

పరిస్థితి యిలా వున్నా అడిగేవాడు ఎవడూ లేడు. ఊళ్లో వాళ్లే పట్టించుకోరు. ఈ పరిస్థితి తరతరాలుగా వస్తోంది. గత ఐదేళ్లగా వైయస్ కొత్తగా మొదలు పెట్టినది కాదు. నిష్టాగరిష్టులైన హిందూ ముఖ్యమంత్రులు కూడా యీ విషయంలో చేసినది ఏమీ లేదు. ఇన్ని తరాల పాపాన్ని వైయస్ నెత్తిన చుట్టబోవడం తప్పు. నిజానికి ఆలయాల ఆస్తులు అక్టోబరు 2 నుండి వెబ్‌సైట్‌లో అందరికీ తెలిసేట్లా పెట్టాలన్న నిర్ణయం తీసుకున్నది వైయస్ ప్రభుత్వమే. దాని వలననే ఆభరణాలు తాకట్టు పెట్టేసిన పూజార్ల కథలు బయటకు వచ్చాయి.

తిరుపతిలో వెయ్యికాళ్ల మండపం కూల్చేసినవాడు వైయస్, అందుకే యీ దుర్మరణం అని కూడా ప్రచారం సాగుతోంది. వెయ్యికాళ్ల మండపం కూల్చేసినది బాబు హయాంలో అని ఏ పేపరు తిరగేసినా కనబడుతుంది. అయినా అది పవిత్ర పూజాస్థలం ఏమీ కాదు. గుడికి వెలుపల వున్న ఓ కట్టడం. షాపింగ్ కాంప్లెక్స్‌గా వాడబడుతున్న స్థలం. అది తీసేశాకనే గుడికి ఓ వ్యూ వచ్చింది. ఊరేగింపులు జరుగుతున్నపుడు చూడడానికి, సెక్యూరిటీ కాపాడడానికి వీలు చిక్కింది. ఎవరి హయాంలో కూల్చినా మంచిపనే జరిగింది. అదేదో పాపకార్యం అన్నట్టు, దానికి వైయస్ బాధ్యుడన్నట్లు రాయడం అన్యాయం. అలాగే తిరుపతి ఏడుకొండల్లో ఐదు కొండలు తాకట్టు పెట్టేసినట్టు కూడా. మూడేళ్ల క్రితం అలా చేస్తున్నట్లు న్యూస్ రావడం, దానిమీద కార్టూన్లు రావడం, సెటైర్లు పేల్చడం (నేనూ 'ఈనాడు'లో ఓ సెటైర్ రాశాను) జరిగింది. తర్వాత చూస్తే అదంతా వట్టి హంబగ్ అని తేలింది. తాకట్టు పెట్టిన దాఖలా ఎవరైనా చూపించగలరా?

వైయస్ క్రైస్తవుడు కాబట్టి తిరుపతిని క్రైస్తవ క్షేత్రంగా మార్చేద్దామని చూశాడనీ, అతని హయాంలో అక్కడ క్రైస్తవ ప్రచారం పెచ్చుమీరిందనీ మరో ఆరోపణ. క్రైస్తవ సంస్థల ప్రచారం గురించి ఓ మాట చెప్పాలి. వాళ్ల పనే మార్కెటింగ్! కొండలు కాదు, అడవులు కాదు, ఎడార్లు కాదు – ఎక్కడికైనా చొచ్చుకుపోతారు. పొద్దున్న ఏ టీవీ ఛానెల్ చూసినా వాళ్లే. ఏమరుపాటుగా వుంటే పడకగదిలోకి కూడా వచ్చి వుపన్యాసాలు యిచ్చేయగల ప్రబుద్ధులు. అసలు క్రైస్తవం వర్ధిల్లిందే అలాగ. లేకపోతే ప్రపంచంలో యింతమంది క్రైస్తవులు తయారయ్యేవారా? తిరుపతి కొండమీదే కాదు, సాక్షాత్తూ వేంకటేశ్వరుడి మెడలో శిలువ వేసేయగల సమర్థులు. రాష్ట్రంలో క్రైస్తవ ముఖ్యమంత్రి వుండడం వారికి వ్యక్తిగతంగా మరింత వూపు నిచ్చిందేమో కానీ యిప్పుడాయన పోయాడు కదా, ఓ

హిందూ ముఖ్యమంత్రి వున్నాడు కదాని వాళ్లు జోరు తగ్గిస్తారనుకుంటున్నారా? అబ్బే!

వైయస్ దగ్గరుండి తిరుపతిని వాటికన్ చేసేయబోయాడన్నది అసంబద్ధం. ఆల్ సెడ్ అండ్ డన్, అతనికి రాజకీయం ముఖ్యం, మతం కాదు. రాష్ట్రంలో మెజారిటీ ఓట్లు హిందువులవైనపుడు అంత సాహసానికి ఏ రాజకీయ నాయకుడూ ఒడి కట్టడు. హిందువులను మరీ నొప్పించకుండా మైనారిటీ ఓట్లు కూడగడదామనే ప్రతీ పార్టీ ప్రయత్నిస్తుంది. లేకపోతే క్రైస్తవ దళితులను ఎస్సీలతో సమానంగా చూడాలన్న వైయస్ అసెంబ్లీ తీర్మానాన్ని జెపి (ఆయనకు పెద్దగా ఓట్లు లేవు కాబట్టి సాహసం చేయగలరు) తప్ప తక్కినవారెవరూ కాదనలేదేం?

హజ్ యాత్రకు డబ్బులివ్వడం చాలనట్టు, జెరూసలెం యాత్రకు ప్రభుత్వం డబ్బులివ్వాలా? ఏం అన్యాయం! ఇవ్వకూడదు, అని గట్టిగా నిలబడిన పార్టీ ఏది? వాళ్ల కిచ్చారు కాబట్టి తిరుపతి యాత్రకు కూడా డబ్బులివ్వండి అని దత్తాత్రేయగారన్నారు. 'వాళ్లను విదేశాలకు పంపి మాకు మాత్రం చీప్‌గా లోకల్ ట్రిప్సా? క్రీస్తు పుట్టినది జెరూసలెం అయితే మా ఆర్యులు పుట్టినది జర్మనీ, అక్కడకు పంపండి' అని హిందువులం గట్టిగా అడిగామా? మనం అడగం అని తెలుసు కాబట్టే రాజకీయ నాయకులు మనల్ని తేలికగా చూస్తున్నారు. బిజెపి ప్రభుత్వంలో వున్నపుడైనా హజ్ యాత్రకు గవర్నమెంట్ ఫండింగ్ ఆపిందా? లేదే! ప్రతీ రాజకీయనాయకుడూ చేస్తున్నదిదే. వైయస్‌ను ఒక్కణ్నే తప్పుపట్టి లాభం లేదు.

## 13

అసలు వైయస్ హిందూద్వేషి అనడానికి ఆధారాలున్నాయా? నాకు తెలిసి మనమందరం ఒకే మతాన్ని నమ్ముకుని, పరమతాలను ద్వేషించేవాళ్లం కాదు. మనకు పనులు జరగాలి, అది ఏ దేవుడు చేస్తేనేం? దర్గాలకు వెళ్లి పిల్లలు పుట్టాలని మొక్కుకుని పుట్టిన పిల్లలకు మస్తానయ్య అని పేరు పెట్టుకుంటాం. చంటిపిల్లవాడు అర్ధరాత్రి లేచి ఏడుస్తూ వుంటే గాలో, ధూళో అనుకుని దూదేకుల సాయిబు వద్దకు వెళ్లి తావీజు కట్టించుకు వస్తాం. సాయిబాబా ముస్లింగా పుట్టాడని తెలిసినా షిర్డీకి ట్రిప్పులు కొడతాం. ముక్కోటి దేవతలున్నా వాళ్లను పక్కన పడేసి ఏ పురాణంలోనూ కనబడని సాయిబాబాకే అగ్రస్థానం యిచ్చేస్తున్నాం. ఎందుకు? ఆయనకు మొక్కుకుంటే మన పనులు జరుగుతున్నాయి కాబట్టి. తమిళనాడులోని వేలాంకణ్ణి మేరీమాత ఆలయానికి వచ్చేవారిలో ఎందరో హిందువులను చూశాను. ముస్లిములు కూడా వాస్తు బాగుందాని చూస్తున్నారు. ఇంట్లో ఫెంగ్ షూ బొమ్మలు పెట్టుకుంటున్నారు. విదేశాల్లోని క్రైస్తవులు కొందరు యిస్కాన్ టైపు హిందూమతం వైపు ఆకర్షింపబడుతున్నారు. మనం ఏ మతాన్నీ, ఏ దేవుణ్నీ వదలం. ఏ పుట్టలో ఏ పాముందో!

వైయస్ దీనికి అతీతుడని అనుకోను. క్రైస్తవంలో ఆయనకు నమ్మకం వుంది, అంతమాత్రాన హిందూమతంపై నిరాదరణ వుందని చెప్పడానికి లేదు. ఆయన పెళ్లికి మావగారు వేయించిన శుభలేఖ ''సాక్షి'' వాళ్లు యీ మధ్య వేశారు –

'విరోధికృతు నామ సంఎఎర మాఘు బహుళ దశమి బుధవారం 9-2-1972 వ తేదీ ఉదయం 8 గంటల 10 నిఎఎలకు కుంభలగ్న పుష్కరాంశయందు మా ప్రథమ పుత్రిక చిఎఎసౌఎఎకుంఎఎ రాజేశ్వరి అను కన్యారత్నమును.. పులివెందుల వాస్తవ్యులు, శ్రీ యెడుగూరు సందింటి రాజారెడ్డిగారి ద్వితీయ పుత్రుడు చిరంజీవి రాజశేఖరరెడ్డి యం.బి.బి.యస్ అను వరరత్నమునకు...' అని సాగింది పి.రామాంజుల రెడ్డిగారు రాసిన శుభలేఖ. (పెళ్లయిన తర్వాత అమ్మాయి పేరు విజయలక్ష్మిగా పేరు మార్చారేమో)..

ఇది హిందూ శుభలేఖలా వుందా? క్రైస్తవ శుభలేఖలా వుందా? క్రైస్తవులకు నిమిషాలతో సహా ముహూర్తాలుంటాయా? పోనీ మొన్నమొన్నటిదాకా ఆయన భార్య చేత హారతులు యిప్పించుకుంటూనే వున్నాడు కదా! అవేమైనా క్రైస్తవాచారాలా? ఇవన్నీ చూస్తే ఏమనిపిస్తుంది? మనందరిలాగానే ఆయనా ఏ మతాన్నీ వదిలిపెట్టడు. దేన్నీ ద్వేషించడు. అత్తతో అమ్మి, కోడలితో కొనే రకం. ఏ దేవుడితో ఎప్పుడు పని పడుతుందో! అందువలన క్రైస్తవానికి ఫేవర్‌లు చేశాడంటే ఒప్పుకుంటాను కానీ, హిందూమతాన్ని నాశనం చేయడానికి చూశాడంటే నమ్మను.

ఇక అల్లుడి ప్రచారం సంగతా? అనేకమంది క్రైస్తవప్రచారకుల్లాగానే అతను కూడా. కొత్త వైష్ణవం పుచ్చుకున్నవాడికి పంగనామాలు ఎక్కువ అన్నట్టు కొత్తగా క్రైస్తవుడయ్యాడు కాబట్టి జోరుగా చేస్తున్నాడు. అందునా మావగారు రాజకీయనాయకుడు కాబట్టి డబ్బు సరఫరాకు అనువుగా వున్నాడు. డబ్బుతో పట్టుబడితే అది ఎన్నికలకు కాదనీ, మతప్రచారానికనీ సులభంగా దబాయించవచ్చు.

ఇవన్నీ కాదని తిరుపతి దేవుడు వైయస్‌మీద పగ తీర్చుకున్నాడనే అనుకున్నా, మరి క్రైస్తవ దేవుడు తనకోసం యింత చేస్తున్న వైయస్‌ను కాపాడాలిగా!

అందువలన వైయస్ చావుకి, హిందూమతానికి జరుగుతున్న అన్యాయాలకు లింకు పెట్టడం అనవసరం.

ఇక వైయస్ యిమేజిలో రెండు ముఖ్యమైన విషయాల గురించి చర్చిద్దాం. ఒకటి జలయజ్ఞం, రెండు అవినీతి ఆరోపణలు. ఒకటి ప్లస్, మరొకటి మైనస్. అసలు వైయస్ గురించి రాస్తాననగానే అవినీతి గురించి రాయి, రాయి అని ఒకటే పోరు కొందరు పాఠకులనుండి. ఇప్పటివరకు దేశచరిత్రలో యింతటి అవినీతిస్వరూపం లేదన్నంత ప్రచారం జరిగింది. చెన్నారెడ్డి తర్వాత యింతటి ఆరోపణలు ఎదుర్కొన్న ముఖ్యమంత్రి లేడు. తమాషా ఏమిటంటే ఏదీ రుజువు కాలేదు. ప్రతీరోజూ వైయస్ అవినీతి గురించి

హెడ్‌లైన్సు రాసిన పత్రికలు కూడా తమ దగ్గర సాక్ష్యాధారాలుంటే కోర్టుకి ఎందుకు వెళ్లలేదో తెలియదు. అదే పాయింటుపై అతన్ని ఓడిద్దామని చూసిన టిడిపి వంటి ప్రతిపక్షాలు కూడా కనీసం ఒక ప్రజాప్రయోజనవ్యాజ్యం ఎందుకు వేయలేదో తెలియదు. రచ్చ చేయడానికే యీ పాయింటును వుపయోగించుకున్నారు కానీ ఆ అవినీతిని బయటపెట్టి, ఆస్తులను జప్తు చేయించి, ప్రభుత్వానికి జమ చేయించి, మనను ఉద్ధరించే ప్రయత్నం చేయలేదు.

'నేను అవినీతి గురించి ఎందుకు రాయను?' అని నేను రాసిన వ్యాసపరంపరలో రాశాను – యీ సబ్జక్ట్‌పై రాయడం మహా బోరు అని. అన్ని పార్టీలు కాస్త ఎక్కువతక్కువగా ఒక్కలాటివే అని. లేకపోతే ఎలక్షన్లలో యింతింత ఖర్చు ఎలా పెట్టగలుగుతున్నాయి? అవినీతి గురించి ఆధారాలు దొరకవు. అవి లేకుండా ఫైట్ చేయడమంటే డాన్ క్విక్సోట్ గాలిమరలతో యుద్ధం చేసినట్టు వుంటుంది. ఓ ఈ మెయిల్ చాలాకాలం నుండీ ప్రచారంలో వుంది. టాటాలు యిన్నేళ్లలో యింత ఆస్తి సంపాదించారు, బిర్లాలకు యింత సంపాదించడానికి యిన్నేళ్లు పట్టింది, కానీ వైయస్ ఐదేళ్లలోనే బోల్డు సంపాదించాడు అని. పదవిని అడ్డుపెట్టుకుని ప్రజాధనం దోచుకున్నాడు అని.

నేను కామన్‌సెన్స్‌తోనే మాట్లాడతాను – ప్రజాధనం దోచుకోవడానికి వైయస్‌కు ఛాన్సు వచ్చినదెప్పుడు? 2004లో ! అప్పటిదాకా ప్రతిపక్షంలోనే వున్నాడుగా! అంటే 2004 నాటికి వైయస్ ఆస్తులెంత? 2009 నాటికి ఎంత? ఈ మధ్యలో పెరిగినదెంత? పెరిగినదానిలో నేచురల్ యింక్రిమెంటల్ గ్రోత్ (కాపిటల్ బ్రీడ్స్ కాపిటల్ అన్నారుగా) ఎంత? బయటనుండి పంప్-యిన్ చేసినదెంత? ఇవి పరిగణించాలి. అందరూ ఎత్తి చూపించే యీ ఇడుపులపాయ ఎస్టేట్ 2004 నాటికే వుంది కదా... గత ఐదేళ్లలో అపసవ్యంగా పెరిగిన విలువనే లెక్కలోకి తీసుకోవాలి. అలాగే మిగతావీనూ.

## 14

ఇంకో మాట – వైయస్ అవినీతి పద్ధతులద్వారా సంపాదించినది తన వద్దనే వుంచుకుంటే హై కమాండ్ వూరుకుంటుందా? దేశం మొత్తంలో కాస్త పచ్చగా వున్న కాంగ్రెస్ ప్రభుత్వం మనది ఒక్కటే కదా. మహారాష్ట్రలో కూడా ఎన్సీపీతో పంచుకోవాలి. దేశంలో ఎక్కడ ఎన్నికలైనా కాంగ్రెస్ పార్టీ కయ్యే ఖర్చు మన రాష్ట్రం నుండి భరించవలసినదే. అలాటప్పుడు హై కమాండ్ 'నువ్వు సంపాదించుకున్నది నీ వద్దనే వుంచుకో నాయనా' అంటుందా? అబ్బే, వైయస్ అడ్డమార్గాల్లో ఏం సంపాదించినా సింహభాగం ఢిల్లీకి పోవలసినదే. ఇక సంబంధిత శాఖ మంత్రి కూడా నోట్లో వేలు వేసుకుని చూస్తూ వుంటాడా? మరి అధికారులు? ఇవన్నీ పోయాక మిగిలినదే వైయస్‌కు వస్తుందనుకోవాలి. ఐదేళ్లలో ప్రభుత్వం తరఫున ఖర్చయినదెంత? దానిలో కమీషన్ల కింద పోయినదెంత? ఆ కమీషన్లలో వైయస్ వాటాకు వచ్చినదెంత? ఇవన్నీ లెక్కవేసుకుని చూస్తే టాటా బిర్లాలు శతాబ్దాలలో సంపాదించిన దాని కంటె ఎక్కువగా వుందో, తక్కువగా వుందో తేలిపోతుంది. అవన్నీ వేయకుండా గాలిలో మాట్లాడడం సబబు కాదు.

అయినా గాలిలో మాట్లాడడం జరిగింది. వైయస్ అవినీతిపరుడు అనే ప్రచారం హోరెత్తిపోయింది. దీనివలన చాలా చెడు జరిగింది. సమాజంలో అవినీతికి ఆమోదముద్ర లభించినట్టయింది. ప్రభుత్వాఫీసుల్లోకి వెళ్లినా 'సాక్షాత్తూ సిఎం గారే తీసుకుంటున్నపుడు మమ్మల్ని అంటారేమిటండీ?' అని వినబడసాగింది. చెన్నారెడ్డి కాలంలో యిలాగే జరిగింది. మా బంధువు ఒకాయనకు 'ఇంత లంచం యిచ్చి మీ కాగితం పట్టుకెళ్లండి' అని ఓ ప్రభుత్వోద్యోగి పోస్టు కార్డు రాసి పడేశాడు. వెళ్లి 'బొత్తిగా యింత ధైర్యం ఏమిటయ్యా?' అని అడిగితే 'ఏం చేస్తారండి? పై నుంచి కిందదాకా యిలాగే వున్నాం. ఫిర్యాదు చేస్తారా? చేసి చూడండి.' అన్నాడతను నిర్లజ్జగా. వైయస్ జమానాలో అలాటి వాతావరణమే. బాబు హయాంలో కూడా ప్రభుత్వాఫీసుల్లో అవినీతి వుండేది కానీ వైయస్ హయాంలో రేట్లు పెరిగాయిట.

బాబు హయాంలో ఎగ్జెంప్షన్స్ వంటి పనులు ఓ పట్టాన అయ్యేవి కావు. ఎవరు నిర్ణయం తీసుకుంటారో, ఎప్పుడు తీసుకుంటారో తెలియదు. అన్ని ఫైళ్లమీదా బాబు బైఠాయించినట్టు కనబడేది. వైయస్ హయాం వచ్చాక ఆ మెషినరీ కదిలింది. డబ్బు పడేస్తే ఫైళ్లు పరుగులు పెట్టాయి. అర్బన్ సీలింగ్ నుండి ఎన్నో భూములకు ముక్తి లభించింది. పేపర్లు ఏమైనా ఘోష పెట్టుకోనీ, సంబంధిత వ్యక్తులందరూ హ్యాపీ. డబ్బు కావలసినవారికి డబ్బు. పనులు కావలసినవారికి పనులు.

వైయస్ యీ యిమేజిని చెరిపేసుకోవడానికి ఏ ప్రయత్నమూ చేయలేదు. గమనిస్తే యింకో విషయం కూడా తడుతుంది. అప్పోజిషన్ వాళ్లు కూడా ఆయన్ని యీ విషయంపై నిలదీయడానికి గట్టి ప్రయత్నం చేయలేదు. అసెంబ్లీలో ఎన్నో యిబ్బందికరమైన ప్రశ్నలు అడగవచ్చు. అడిగారా? ఎప్పుడు చూసినా 'నాకు సమయం యివ్వలేదు' 'నన్ను ముందు అడగనివ్వలేదు' 'ఆయన నవ్వాడు' 'ఈయన యికిలించాడు' – వీటిమీదనే చర్చ.

కోర్టులో చూడండి. వాదనలు ఎలా సాగుతాయో? జడ్జిగారు ఓ ప్రశ్నకు 'అబ్జక్షన్ సస్టెయిన్‌డ్' అన్నాడనుకోండి లాయరు అదే ప్రశ్నను తిప్పి అడుగుతాడు. అసెంబ్లీలో కూడా అలాగ ఎందుకు చేయరో నాకు అర్థంకాదు. ఉదాహరణకి 'ఎల్లంపల్లి ప్రాజెక్టులో కాంట్రాక్టరుకి యివ్వవలసిన దాని కంటె ఎక్కువ బిల్లు పే చేశారా?' అన్న ప్రశ్నను స్పీకర్ అనుమతించలేదనుకోండి, మర్నాడు '.. పోనీ తక్కువ పే చేశారా?' అని అడగవచ్చు. 'అబ్బే లేదు, ఆ మాటకొస్తే ఎక్కువే యిచ్చాం' అన్నారంటే పిలక పట్టుకోవచ్చు.

ఇలాటి ప్రయత్నాలు చేయాలంటే అప్పోజిషన్ వాళ్లు హోం వర్క్ చేయాలి. ఆ ప్రయత్నమే చేయరు. గనుల తణిఖీకి అఖిలపక్షం వెళ్లినపుడు నాగం జనార్దనరెడ్డి ప్రవర్తన చూడండి. 'వాళ్లంతా వెళ్లిన కారులో వెళ్లను', 'వాళ్లు బయలుదేరిన అరగంట తర్వాత బయలుదేరతాను' ఇలాటి మడతపేచీలు. ప్రజా ప్రతినిధిగా నిజాలు నిర్ధారించుకోవాలన్న ఆత్మ ఏమైనా కనబడిందా?

ఇవన్నీ చూస్తే అసెంబ్లీలో మనకు వినోదం కలిగించడానికి తప్ప వీళ్లు చేస్తున్నదేమీ లేదనిపిస్తుంది నాకు. మైకులు విరగకొట్టడం, వాకౌట్లు చేయడం, మార్షల్స్ చేత మోయించుకోవడం, వాళ్లను పిడిగుద్దులు గుద్దడం, బయటకు వచ్చి మాక్ ఎసెంబ్లీ నిర్వహించి మిమిక్రీలు చేయడం – యిదా వారి బాధ్యత? ఎవరు ఎటువైపునైనా వుండనివ్వండి, తెరవెనుక రూలింగ్ పార్టీ, అప్పోజిషన్ పార్టీ పరస్పరసహకారం అందించుకుంటారనే తోస్తుంది నాకు.

తమిళనాడులో కరుణానిధి అవినీతిపరుడన్న ప్రచారం చేసి ఎంజీయార్ అధికారంలోకి వచ్చాడు. తర్వాత అతని పాలనలోనూ అవినీతే. తన వంతు తాను పుచ్చుకుని చివర్లో 'ఓ సారి గోపాలపురం వెళ్లి చూడండి' అనేవాట్ట. గోపాలపురం అంటే కరుణానిధి వుండే పేట. అక్కడకి వెళ్లి అక్కడా సమర్పించుకున్నాకనే పనులు జరిగేవట. అలా ఫండ్స్ అందాయి కనుకనే అప్పోజిషన్‌లో దశాబ్దాలపాటు వున్నా డిఎంకె మనగలిగింది. ఎంజీయార్ పాలించినంత కాలం కరుణానిధి లాంఛనప్రాయంగా అవినీతి ఆరోపణలు చేస్తూనే వున్నాడు.

ఇక్కడా అలాటి అరేంజ్‌మెంట్ జరిగే వుంటుంది. బాబు పై అవినీతి కేసులు పెట్టిన వైయస్ వాటిని ఎందుకు విత్‌డ్రా చేసుకున్నారో యిప్పటిదాకా తెలియదు. మళ్లీ బాబు వైయస్‌పై అలాటి కేసులు ఎందుకు పెట్టలేదో తెలియదు. తన పార్టీవాళ్లు కానీ, వేరే పార్టీ వాళ్లు కానీ తనవద్దకు వచ్చి అడిగితే వైయస్ పనులు చేసిపెట్టేవారని, ఆయన పోయిన తర్వాత నివాళి అర్పించిన ప్రతీవారూ – ప్రతిపక్షం వారితో సహా – అన్నారు. అంటే యిదంతా రోజూ న్యూస్ పేపర్ నింపడానికి తప్ప మరెందుకూ పనికి రాలేదన్నమాట. ఏ పార్టీకి చెందిన వారైనా సరే, రాజకీయ నాయకుల్లో 5 శాతం కంటె నిజాయితీ పరులుంటారంటే నేను నమ్మలేను. వైయస్ ఒక్కడి ఆస్తే కాదు, ఏ నాయకుడిదైనా సరే, రాజకీయాల్లోకి వచ్చేముందు, తర్వాత ఆస్తుల వివరాలు లాగండి. అదే సమయంలో మీదీ నాదీ ఎలా పెరిగిందో పోల్చి చూడండి. మీకే తెలుస్తుంది.

## 15

దీనివలన రాజకీయనాయకుల మాట ఎలా వున్నా ఎడ్మినిస్ట్రేషన్ ఘోరంగా దెబ్బతింది. రోడ్లు వేస్తే నాణ్యత వుండదు. ఫ్లయివోవర్లు కూలిపోతాయి. పనులు సమయానికి జరగవు. ఎయిర్‌పోర్టు ఎప్పుడో పూర్తయింది. దానితోబాటు రెడీ కావలసిన ఎక్స్‌ప్రెస్ హై వే యిప్పటిదాకా అవలేదు. డబ్బులివ్వకపోతే పనులు జరగవు అన్నమాట బాగా ప్రబలింది. నిజానికి ప్రభుత్వోద్యోగుల్లో అందరూ లంచగొండులు కారు. కొందరే వుంటారు. కానీ జనరల్ యిమేజి బాగా చెడిపోయింది. జలయజ్ఞం వంటి మహత్కార్యం కూడా యీ అవినీతి వాతావరణం కారణంగానే అప్రతిష్ట పాలయింది. సహకార సేద్యం, వాన్‌పిక్ – యివన్నీ సూత్రప్రాయంగా చాలా మంచివి. కానీ వైయస్ సర్కారు ప్రవేశపెట్టింది కాబట్టి యివి చిత్తశుద్ధితో అమలు కావు అన్న సందేహం చేతనే అందరూ వ్యతిరేకించారు. ఇంతకంటె విషాదం యింకేముంటుంది?

మెట్రో ప్రాజెక్టు గురించి నాకు మొదటినుండీ సదభిప్రాయం లేదు. హైదరాబాదులో వున్న లోకల్ ట్రెయిన్లను కానీ, ఎంఎంటియస్‌లను కానీ పట్టించుకోకుండా మెట్రో ఒక్కటే ఏకైక పరిష్కారం అన్నట్టు చేసిన హడావుడి కాంట్రాక్టుల కోసమే అని నా వూహ. మెట్రోపై అంత ఖర్చు పెట్టాలా? దాని బదులు ఎప్పుడో ఖరీదు చెల్లించి వేసిన ఎంఎంటియస్ బోగీలు తెప్పించుకోవచ్చుగా! కొత్త రైలు లైన్లు వేయవచ్చుగా! శాటిలైట్ టౌన్సు పెట్టవచ్చుగా! కాంగ్రస్ వాళ్లు వస్తూనే (ముఖ్యంగా పిజెయార్) మెట్రో జపం వల్లించారు. చివరకు మేటాస్ వాళ్లు ఫేంటాస్టిక్ ఆఫర్ యిచ్చి ఫైనల్‌గా చేతులెత్తేశారు. గొహొవింద!

ఇక సెజ్‌ల గురించైతే చెప్పనే అక్కరలేదు. గతంలో యిండస్ట్రియల్ ఎస్టేటుల కెవరూ అభ్యంతర పెట్టలేదు కానీ వీటికి ఎన్నో అభ్యంతరాలు వచ్చాయి. వందలాది ఎకరాలు ధారాదత్తం చేసేయడమే పనిగా పెట్టుకున్నారు. అవసరమా? అని ఆలోచించడమే లేదు. అక్కడ వచ్చిన పరిశ్రమలెన్ని వున్నాయి? అవి వస్తున్నాయి, యివి వస్తున్నాయి అనడమే తప్ప పట్టుమని పదిశాతం కూడా వచ్చినట్టు లేవు. పాతవి రాలేదు కదా, కొత్తవెందుకు? అని అడిగితే బాబు యివ్వలేదా? టిడిపి హయాంలోనే కదా యిది మొదలెట్టారు? అని జవాబు. ప్రతీదానికీ బాబుశకంతో పోల్చడం చాలా విసుగు తెప్పించింది. అదేదో బెంచ్‌మార్క్ అన్నట్టు! ఓకే, వీటికి గాని, భూములమ్మడానికి గాని – వీటన్నిటికీ బాబు ఆద్యుడయితే కావచ్చు. కానీ యీయన హయాంలోనే కదా తారాస్థాయికి వెళ్లిపోయింది! కానీ ఏమి అడిగినా దీనికి మూలం టిడిపి శకంలోనే అనడం రివాజు అయిపోయింది. స్కాముల విషయంలోనూ అంతే. నిజమే బయటపడిన ప్రతీ స్కాముకీ పదేళ్ల చరిత్ర వుంది. అందుకే కదా, బాబుని గద్దె దింపినది. మీ హయాంలోనూ అలా చేస్తే ఎలా?

నిజం చెప్పాలంటే ఎన్టీయార్ హయాంలో దీర్ఘకాలిక పథకాల కంటె ప్రజాకర్షక పథకాలకు పెద్దపీట వేశారు. బాబు హయాంలో ఆలోచనలన్నీ ప్రపంచబ్యాంకు చుట్టూనే తిరిగాయి. కార్పోరేట్ స్టయిల్ అంటూ పల్లెప్రజలని విస్మరించడం జరిగింది. వ్యవసాయం గిట్టుబాటు కాదు అంటూ ముఖ్యమంత్రే అంటే ఎలా? అందునా వ్యవసాయమే ఆధారంగా బతికే రాష్ట్రంలో! వైయస్ పథకాలలో

కొన్ని ప్రజాకర్షకమైనవి, కొన్ని దీర్ఘకాలిక ప్రయోజనాలున్నవి. రెండోరకం వాటిల్లో ప్రధానంగా చెప్పుకోదగినది జలయజ్ఞం. కనీసం ఇంకో ఇరవైయేళ్లపాటు వైయస్‌ను ప్రజలు గుర్తుపెట్టుకునేలా చేయబోతున్నవి జలయజ్ఞం ప్రాజెక్టులే.

తాగునీరు, సాగునీరు యీ రెండే మనకు ప్రధాన సమస్యలు. వీటి గురించే పొలంగట్ల వద్ద తగాదాలు, తలకాయలు బద్దలు కొట్టుకోవడాలు, ఆడాళ్లయితే కొళాయివద్ద కీచులాటలు. దేశం బాగుపడాలంటే వ్యవసాయం, పరిశ్రమలూ రెండూ కావాలి. అయితే ఆ పరిశ్రమలు నగరాలలో రాకూడదు. పల్లెలకు ఆసరాగా వుండాలి. వ్యవసాయ వుత్పత్తులను ప్రాసెస్ చేసి మార్కెటింగ్ చేసి పెట్టగల పరిశ్రమలే మనను బతికిస్తాయి. అప్పుడు గ్రామాల నుండి నగరాలకు వలసలుండవు. నగరాలలో కాలుష్యమూ వుండదు. నగరాలను నిలబెట్టడానికి ఫ్లయిఓవర్లకు, షోకులకు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టడమూ వుండదు. పంజాబ్, హర్యానాలు బాగుపడ్డాయంటే యిటువంటి వాటి వల్లనే.

పల్లెలు బాగుపడాలంటే నీటివసతి వుండాలి. వ్యవసాయం పచ్చగా వుండాలి. వర్షాలపై పూర్తిగా ఆధారపడకుండా కొంత మేరకైనా నిశ్చితమైన నీటి సరఫరా వుండేట్లా చేయాలి. దాని గురించి ఆలోచించినవాడు వైయస్. అందుకే భగీరథుడు అన్నారు. దాని గురించి వచ్చేవ్యాసంలో రాసేందుకు ముందు నాకు వచ్చిన ఫీడ్‌బ్యాక్ గురించి కాస్త –

నా వ్యాసాల్లో నేను క్రైస్తవానికి వ్యతిరేకంగా రాసినట్టు కొందరు హిందువులు పొరబడ్డారు. నేను క్రైస్తవమతం గురించి గాని, క్రైస్తవుల గురించి గాని ఏ వ్యాఖ్యలూ చేయలేదు. క్రైస్తవమత ప్రచారకుల మార్కెటింగ్ ధోరణులనే నిరసించాను. వాళ్లేకాదు, ఇస్కాన్ వాళ్ల హిందూ మార్కెటింగ్ శైలి, వ్యాపారశైలి కూడా నాకు నచ్చదు.

వేంకటేశ్వరుడి మెడలో శిలువ వేసేయగలరు జాగ్రత్త అని రాశావు, ఇంతకుముందు వెంకటేశ్వరుడి భార్యలెందరు? అని రాశావు. ఆ దేవుడు నిన్ను నాశనం చేసేయగలడు జాగర్త' అని ఒకాయన హెచ్చరించాడు. ఒకవేళ యిది రాస్తూ, రాస్తూ నేను రాలిపోయినా, దాన్ని వెంకటేశ్వరుడి ఖాతాలో వేయకండి. ఏ హార్ట్ ఎటాకో అని ఆలోచించండి. వెంకటేశ్వరుడు దుష్టులను శిక్షించే కార్యక్రమం మొదలెడితే అది తన గుడిలోని పూజారులతో మొదలెట్టాలి, మిరాశీదారులతో ముందుకు సాగాలి. ఊరూరా దేవాలయాల భూములు కైంకర్యం చేసినవారితో విస్తరించాలి. కలియుగంలో దేవుళ్లు కూడా వాళ్ల పని చేస్తూన్నట్టు లేదు. శైవాలయాలు వైష్ణవులు నాశనం చేసినపుడు, వైష్ణవులను శైవులు హింసించినపుడు, బౌద్ధ, జైనాలయాలను హిందువులు ధ్వంసం చేసినపుడు, హిందువుల గుళ్లను ముస్లిములు నేలపాలు చేసినపుడు – ఆ యా సంబంధిత దేవుళ్లు ఏమీ చేసినట్టు దాఖలాలు లేవు.

16

ఫీడ్‌బ్యాక్ గురించే మరి కాస్త – రాష్ట్ర ఆర్థికాంశాలపై రాసే జర్నలిస్టు వి. హనుమంతరావుగారి గురించి నేను రాస్తే 'గూగుల్‌లో చూస్తే కాంగ్రెస్ నాయకుడు వి. హనుమంతరావు ఒక్కరే కనబడుతున్నారు. ఆయన గురించే రాశారా?' అని అడుగుతున్నారు. కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావుకి బిసిలు, రాజీవ్ గాంధీ, తెలంగాణా తప్ప వేరే విషయాలపై ఎంత తెలుసో నాకు తెలియదు. నేను ప్రస్తావించినాయన సీనియర్ జర్నలిస్టు. 50 ఏళ్ల ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్ర గురించి సాధికారికంగా పుస్తకం రాసినాయన.

గూగుల్ ఒక్కటే సర్వస్వం అనుకోవద్దని యిదే సందర్భంలో మనవి చేస్తున్నాను. తెలుగువాళ్ల గురించి దానిలో దొరికేది బహు తక్కువ. దానికి సాంకేతిక పరమైన కారణం (యూనికోడో మరోటో) వుందని కొడవటిగంటి రోహిణీ ప్రసాద్ గారు చెప్తూ వుంటారు. ఇంకో పాయింటు – 'ఆర్యుల జన్మభూమి జర్మనీ' అని రాసినదాని గురించి కొందరు చర్చ మొదలు పెట్టారు. ఆర్యులు యిక్కడి వారేనని వారి వాదం. వైయస్ సీరీస్ అయిపోయిన తర్వాత ఓ వ్యాసంలో వారికి నా వివరణ యిస్తాను.

ఇక వైయస్ చర్చ కొనసాగిద్దాం. జలయజ్ఞం కారణంగానే వైయస్ రాష్ట్ర చరిత్రలో కనీసం రెండు దశాబ్దాలపాటు నిలుస్తాడని రాశాను కదా. దాన్ని ధనయజ్ఞం అని కొట్టి పారేసేవారు వుంటే వుండవచ్చు. ఆ మాట కొస్తే దేన్నయినా ఎన్‌క్యాష్ చేసుకోగల ప్రజ్ఞ మన నాయకులది. కరువు, వరదలు, అగ్నిప్రమాదాలు, ఆత్మహత్యలు – దేనిలోనుండైనా డబ్బులు పిండగల ఘనులు వారు. ఎంత భారీగా పెడితే అంత దండుకోవచ్చు. రెండూ భారీ ప్రాజెక్టులే అయినా మెట్రో ప్రాజెక్టును నిరసించే నేను జలయజ్ఞాన్ని మాత్రం అభిమానిస్తాను. నీటి సమస్య కనుక తీరితే ముప్పాతిక ముప్వీసం సమస్యలు తీరినట్లే.

నేను కలలు కనే దేశంలో ఊరూరా చెరువులు వుండాలి, కాలువలు వుండాలి. అవి కబ్జా అయిపోకుండా వాటిని సంరంక్షించే పంచాయితీలుండాలి. దేశంలో నదులు అనుసంధానం చేసి నీరు వ్యర్థా కాకుండా చేయాలి. ఇంధనం ఆదా చేయడానికి రోడ్డు రవాణాని తగ్గించి జలమార్గాలపై రవాణాను ప్రోత్సహించాలి. (బకింగ్‌హామ్ కెనాల్‌ను పునరుద్ధరిస్తున్నారని వార్త వచ్చింది. ఎంతో సంతోషం. ఇలాటివి ఎన్నో కొత్తవి తవ్వాలి. పాతవాటిని పునరుద్ధరించాలి. చెరువులు పూడిక తీయించాలి. వాటికి నీరు వచ్చే మార్గంలో అడ్డుగా కట్టిన కట్టడాలను తొలగించాలి) మేఘమథనం అంటూ కోట్లు ఖర్చుపెట్టి వర్షం కురిపించగానే సరికాదు, కిందపడిన ప్రతీ చుక్కనూ మనం వాడుకోగలగాలి.

'ఉప్పొంగే జీవజలాలు ఉప్పుసముద్రం పాలు' అన్నట్టుగానే చేస్తాం మనం. వరదలు రాగానే గట్లు కొట్టేసి ఆ నీరంతా సముద్రంలోకి

వెళ్లిపోయేట్లు చేస్తాం తప్ప వూళ్లోకి రప్పించి దాన్ని స్టోర్ చేసుకుని అవసరం వచ్చినపుడు వాడుకునే పద్ధతి లేదు మనకు. ఆర్నెల్లు కరువు సహాయం, మరో ఆర్నెల్లు వరద సహాయం అంటూ నిధులు తెప్పించుకుని నాయకులు తినేయడమే తప్ప దశాబ్దాలుగా యీ పరిస్థితిలో మార్పు లేదు. ఎప్పుడో వందేళ్ల క్రితం ఆనకట్టలు కట్టిన కాటన్ దొర (ఆయన ఉద్యోగి మాత్రమే)ను యిప్పటిదాకా తలచుకుంటున్నామంటే కారణం – ఆ తర్వాత అంతటి మొనగాడు ఎవడూ రాకపోవడమే.

వైయస్ వస్తూనే బోల్డు ప్రాజెక్టులు చకచకా ప్రారంభించేశాడు. అనుమతులు లేవు. నిధులు లేవు. అయినా దిగిపోయాడు. అన్ని అనుమతులూ తెచ్చుకున్నాక ప్రారంభించి వుంటే బాగుండేదని మనలాటి భద్రలోక్ (పడక్కుర్చీ మేధావులు) సన్నాయినొక్కులు నొక్కవచ్చు. కానీ కేంద్రంలో ఫైళ్లు ఎంత అధ్వాన్నంగా కదులుతాయో తెలుసుకుంటే వైయస్ చేసినది మంచిదే అనిపిస్తుంది. స్వాతి వీక్లీలో పివిఆర్‌కె ప్రసాద్ గారు వైజాగ్ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్రాన్ని బై పాస్ చేసి ఎలాటి నిర్ణయాలు తీసుకున్నారో, తీసుకోవలసి వచ్చిన పరిస్థితులేమిటో చదివాక వైయస్ చేసిందే రైటు అనిపించింది నాకు.

కర్నాటక చూడండి, మహారాష్ట్ర చూడండి, అనుమతులు తీసుకునే ప్రాజెక్టులు మొదలెడుతున్నాయా? ట్రిబ్యునల్ ఆగు ఆగు అంటున్నా ఆగుతున్నాయా? కట్టి పాడేసి తర్వాత 'ఫెయిట్ ఎకాంప్లి' (జరిగిపోయినదాన్ని జరిగిపోయిందని ఆమోదించండి) అంటున్నాయి. మన రాష్ట్రంలో బిల్డర్లు ఏం చేశారు? అడ్డదిడ్డంగా యిళ్లు కట్టిపాడేశారు. ప్రభుత్వం మేలుకుని అడిగితే 'కూల్చలేం కదా, మధ్యలో యిళ్లు కొనుక్కున్నవారు నష్టపోతారు' అని మనని అడ్డం వేసుకున్నారు. ప్రభుత్వం ఏం చేసింది? 'సరే, మాకు యింత డబ్బు కట్టేయండి, రెగ్యులరైజ్ చేసి పడేస్తాం' అన్నారు. ఇవన్నీ ఆదర్శప్రాయమైన పరిస్థితులు అని నేను అనటం లేదు. ఇలా వుండకూడదు. కేంద్రం కానీ, రాష్ట్రం కానీ గట్టిగా నిలబడి 'నువ్వు చేసినది తప్పే, రూలుకి విరుద్ధంగా కట్టావు కాబట్టి కూల్చేయ్' అనగలగాలి.

మిలటరీ ప్రభుత్వం అలా అనగలుగుతుందేమో కానీ ఓట్లమీద ఆధారపడిన ఏ ప్రభుత్వమూ అలా అనలేదు. బాబ్లీ విషయంలో అన్యాయం జరిగింది అని ఆంధ్ర కాంగ్రెస్ వాళ్ల చేత అల్లరి చేయిస్తుంది – ఆంధ్రలో ఎన్నికలున్నపుడు. ఆ తర్వాత మహారాష్ట్రలో ఎన్నికలు వచ్చినపుడు 'అబ్బాయిలూ, మీరు కాస్త ఆందోళన వాయిదా వేయండ్రా' అంటుంది. లేకపోతే మహారాష్ట్రలో యిదో పెద్ద సెన్సిటివ్ యిస్యూ అయిపోయి రాజ్ థాక్రే ఓట్లు దండుకుపోవచ్చు. ఇలా కర్ర విరగకుండా, పాము చావకుండా, ఎటూ తేల్చకుండా, వేటకుక్కతో పాటు వేటాడుతూ, కుందేలుతో బాటు తప్పించుకుని పారిపోతూ ద్విపాత్రాభినయాలు చేసే ప్రభుత్వాలు వున్నంత కాలం యిలా దబాయింపు సెక్షన్‌గాళ్లదే పై చేయి. 'తిక్కోడి పెళ్లిలో తిన్నోడిదే మజా' అన్నట్టుగా ధైర్యం చేయాలి.

17

ఆ ధైర్యంతోనే వైయస్ అడ్డగోలుగా ప్రాజెక్టులు మొదలెట్టేశారు. సగం సగం అయిన పనులు జరిగాక యిప్పుడు కేంద్రం ఆపేయగలుగుతుందా? కట్టినదాన్ని కూల్చేస్తుందా? తవ్విన కాలువలను పూడ్చేస్తుందా? అలా చేస్తే ఆంధ్రలో పార్టీకి పుట్టగతులుంటాయా? అందువలన యీ ప్రాజెక్టులు ఐదేళ్లకో, పదేళ్లకో, కాకపోతే యిరవై ఏళ్లకో పూర్తి కాక మానవు. ఈ లోగా జన్మభూమి వంటి కార్యక్రమాలు చేపట్టి ప్రజలే శ్రమదానం చేసి సహకరిస్తే ఖర్చులు తగ్గి, త్వరగా పూర్తి కావచ్చు కూడా.

ఎంతో విషయపరిజ్ఞానం, పాలనానుభవం వుండి స్వయంగా రైతుబిడ్డ అయిన చంద్రబాబుగారు తలపెట్టని యీ సాహసాన్ని వైయస్ చేశారు కాబట్టే కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాగలిగింది. చంద్రబాబు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పైననే ఎక్కువ శ్రద్ధ పెట్టారు. అదీ అవసరమే. ఆ పట్టాలుంటూ వున్నాయి కాబట్టే వైయస్ బండి నడిచింది. చంద్రబాబు ప్రపంచబ్యాంకు సంస్కరణలు ఖచ్చితంగా అమలు చేసి వాళ్ల మెప్పు పొందారు. వైయస్ కాస్త ముందుకు వెళ్లి ఆ సంస్కరణలను కొనసాగిస్తూనే వాటితో బాటు తనవంటూ కొన్ని మార్పులు చేశారు.

చంద్రబాబు కాలానికి వైయస్ కాలానికి పేరడైమ్ షిఫ్ట్ (దృక్పథంలో మార్పు) స్పష్టంగా కనబడుతుంది. చంద్రబాబు శకంలో ఐటీ, ఐటీ అంటూ విపరీతమైన హడావుడి కనబడింది. నిజానికి అదే కాలంలో తమిళనాడులో, కర్ణాటకలో, మహారాష్ట్రలో కూడా ఐటీ ప్రగతి సాధించింది. (ఇంత హంగామా తర్వాత కూడా మన స్థానం వాటన్నిటి తర్వాతనే). అక్కడ ఏ బాబూ లేడు. అయినా ఐటీ ముందుకు సాగింది. ఎంత హంగామా చేసినా ఐటీ సర్వీస్ ఓరియెంటెడ్ ఇండస్ట్రీయే. మరొక దేశస్థితిగతులపై పూర్తిగా ఆధారపడి, నీటిబుడగపై హరివిల్లులా మెరిసి మాయమై పోయేదే! ఐటీ ఉద్యోగులు రాత్రికి రాత్రి జేబులు నింపేసుకుని తెల్లారేసరికి జేబులు ఖాళీ చేసేసుకుని గొల్లుమన్నారు. వారివలన హోటళ్లకు, పబ్‌లకు, విదేశీ విలాసవస్తువుల మార్కెట్లకు తప్ప సమాజానికి జరిగిన మేలు ఏమీ లేదు. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ పెద్దగా ఏమీ సృష్టించలేదు కాబట్టి దేశానికీ మేలు కలగలేదు. నడమంత్రపు సిరితో వాళ్లు అద్దెలు పెంచేయడంతో మధ్యతరగతి జీవుల వుసురు పోసుకోవడం తప్ప!

ఐటీతో బాటు ఆటోమొబైల్ వంటి సాలిడ్ యిండస్ట్రీలు ఏమైనా వచ్చి వుంటే బాగుండేది. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలలో అటువంటివి చాలా వచ్చాయి. మనకు ఫార్మా యిండస్ట్రీ తప్ప గట్టిగా ఏమీ లేదు. బయటనుండి వచ్చి యిండస్ట్రీ పెడతానని హంగామా చేసి భూమి ఎలాట్ చేయించుకోవడం తప్ప మరేమీ జరగటం లేదు. అలాటప్పుడు మన వనరులనే మనం బాగా వాడుకోవాలి.

మనకున్న భౌతికమైన వనరు – సారవంతమైన భూమి. మానవవనరులు– వ్యవసాయంలో చేయి తిరిగిన రైతులు. వాళ్ల శక్తియుక్తులను ఎక్స్‌ప్లాయిట్ చేసుకోకుండా 'వ్యవసాయం దండగమారి పని' అని అనుకోవడమే బాబు చేసిన పెద్ద పొరబాటు. వ్యవసాయాన్ని కిట్టుబాటు వ్యాపారంగా ఎలా చేయాలి అని ఆలోచించకుండా దాన్ని వదిలిపెట్టి ఆయన ఐటీ ఆకాశానికి నిచ్చెనలు వేశారు. ఐటీ ఆకాశంలాగానే శూన్యంగా తేలింది. ఉత్తరోత్రా వ్యవసాయం సాలిడ్‌గా, నిలబెట్టగల హార్డ్‌గ్రౌండ్‌గా తేలింది.

వ్యవసాయం ఆకర్షణీయంగా తయారుచేయడమే వైయస్ ఎఛీవ్‌మెంట్. భూముల రేట్లు పెరిగి, అరెకరం అమ్ముకుంటే చాలు, బాబు హయాంలో చేసిన అప్పులు తీరే పరిస్థితి కలిగింది. ఉన్నవూళ్లో వుద్యోగం చేసుకుంటూ వ్యవసాయం మళ్లీ చేపట్టిన కేసులు ఎన్నో వున్నాయి. రైతు సగర్వంగా తల ఎత్తుకునేట్లా చేసింది వైయస్సే. నగరప్రజలు ఎన్ని తిట్లయినా తిట్టవచ్చుగాక, పల్లెప్రజలు మాత్రం ఆదరం చూపారు. వైయస్‌ను తమవాడిగా భావించారు.

ఒక్కోళ్లకి ఒక్కో యిమేజ్ వుంటుంది. కమ్యూనిస్టులు అధికారంలో వున్నారనుకోండి, వర్కర్లు కాలరెగరేస్తారు, బిజెపివాళ్లుంటే వ్యాపారులు ప్రభుత్వాధికారుల కేసి జాగ్రత్త అన్నట్టు చూస్తారు. అంతమాత్రం చేత ఆ యా పార్టీలవాళ్లు తక్కిన వర్గాలను పట్టించుకోరని అర్థం కాదు. బాబు వైట్‌కాలర్ వాళ్ల ఫేవరేట్‌గా భాసిస్తే, వైయస్ రైతుజనబాంధవుడిగా వెలిగాడు. వర్షాలు కురిశాయి కాబట్టే యిదంతా అనుకోవద్దు. ఇది వెదర్ క్రైసిస్ కాదు, యిమేజ్ క్రైసిస్. ఎటువంటి యిమేజ్ మేన్‌టేన్ చేయాలి అన్నది నాయకుడి యిష్టాయిష్టాలపై ఆధారపడి వుంటుంది.

మనం ప్రస్తుతం ఏ వృత్తిలో వున్నా వస్తుతహ రైతుకుటుంబాల వాళ్లం. నేను ఉద్యోగిని, మా నాన్న వ్యాపారి కానీ మా తాతల వరకూ ఫక్తు రైతులే. మా నాన్న వ్యాపారం ప్లస్ కౌలు కిచ్చిన వ్యవసాయం. నా వద్దకు వచ్చేసరికే దూరప్రాంతాలలో వుంటూ శిస్తు వసూలు చేసుకోవడం చేతకాక భూములు అమ్మేశాను. కానీ ఎప్పటికైనా పూర్తిగా రిటైరయిపోయి ఓ కొబ్బరితోట కొనుక్కుని మధ్యలో మడతమంచం వేసుకుని పడుక్కుని శేషజీవితం గడిపేద్దామన్న కోరిక పోలేదు. ఆ సబ్జక్ట్‌పై రాసిన 'అధికారాంతమున..' అన్న కథ విడిగా అప్‌లోడ్ చేయిస్తున్నాను చూడండి.

నగరజీవితంతో, యీ కాలుష్యంతో బోరు కొట్టేసింది. రియల్ ఎస్టేటు బూమ్ అంటూ నగర పరిసరాల్లో రైతులు కూరగాయలు పండించడం మానేశారు. ఎంత సంపాదించినా సరైన తిండి లేకపోతే బతకడ మెందుకు? అన్న ఫీలింగ్‌తో కొబ్బరితోటవైపు మనసు లాగుతూనే వుంటుంది. పల్లెటూరిలో పట్టుమని ఒక నెలైనా వరసగా నివసించని నాకే యిలా వుంటే ఎంతో కొంత ఎటాచ్?మెంట్ వున్న వారి సంగతేమిటి? అన్ని కులాలవారికీ మట్టివాసన అంటే యిష్టం. గ్రామాలను బాగు చేస్తున్నాళ్లంటే అభిమానిస్తాం. బాబు రైతుబజార్ పెట్టారంటే ఎంతో సంతోషించామా? లేదా? వైయస్ వాళ్లకు వైభోగం పట్టించాడంటే మరీ ఆనందించాం – రైతు బాగుంటేనే మనకు నోట్లోకి ముద్ద వస్తుంది కాబట్టి! అందువలన బిసి పక్షపాతి అనిపించుకోవడం కంటె రైతుపక్షపాతి అనిపించుకోవడం రాజకీయాల రీత్యా మేలు. బాబుపై వైయస్ సొడ్డు వేసినది యిక్కడే!

18

ఇమేజి గురించి మాట్లాడినప్పుడే ఆహార్యం గురించి కూడా మాట్లాడాలి, మాటతీరు గురించి మాట్లాడాలి. శశి థరూర్ చూడండి, ఏదో చమత్కారంగా మాట్లాడబోయి ముప్పు తెచ్చుకున్నాడు. ఎకానమీ క్లాసును 'కాటిల్ క్లాస్' అంటాడా అని మనబోటి వాళ్లందరం వుడుక్కున్నాం. ఫైవ్ స్టార్ హోటల్లో నెలల తరబడి మకాం పెట్టాడని విని కోపగించుకున్నాం. ఆయన ఎంత మేధావైనా కావచ్చు, మన మనిషి కాదు అనిపిస్తుంది. అధికారిగా ఎలా వున్నా చెల్లుతుంది, ప్రజాజీవితంలోకి వచ్చాక యివన్నీ మార్చుకోవలసినదే. సోనియా గాంధీ ఆవిడ జన్మదేశాచార ప్రకారం స్కర్ట్ జాకెట్ వేసుకుని తిరిగితే తప్పు పట్టం. కానీ చీర కట్టుకుని తిరిగితే హర్షిస్తాం. పట్టి పట్టి హిందీ మాట్లాడినా క్షమిస్తాం. ఒడిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చాలా హై ఫై జీవితం గడిపినవాడే. కానీ ప్రజా జీవితంలోకి వచ్చాక దుస్తులు మార్చేశాడు. తన అలవాట్లను ప్రచారం చేసుకోలేదు. కష్టపడి ఒడియాభాష నేర్చుకుని మాట్లాడుతున్నాడు.

అంతెందుకు జ్యోతి బసు లండన్‌నుండి తిరిగి వచ్చిన కొత్తల్లో బెంగాలీ ధారాళంగా మాట్లాడగలిగేవాడు కాదు. కమ్యూనిస్టు పార్టీలో చేరగానే 'మొదట బాగా బెంగాలీ నేర్చుకుని రా. ఈ సూటూ, బూటూ తీసేసి పంచె, లాల్చీ కట్టుకో' అని చెప్పారు. కొన్ని నెలలపాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోయి బెంగాలీ క్షుణ్ణంగా నేర్చుకుని మంచి వక్త అయ్యాడు. పూర్తి బెంగాలీ ధోరణిలోనే వస్త్రధారణ. అతని కారణంగానే కమ్యూనిస్టులు గ్రామీణప్రాంతాల్లోకి చొచ్చుకుపోయి దరిమిలా అధికారంలోకి రాగలిగారు. అంతెందుకు, మన ఎయన్నార్, ఎన్టీయార్ సినిమాలో రంగురంగు దుస్తులు వేసినా బయట పంచెకట్టుతో ఎంత ముచ్చటగా కనబడతారు! వారి కంటె కృష్ణ, శోభన్‌బాబులలో తెలుగుతనం తక్కువ వుందని అనలేం. కానీ ఎయన్నార్, ఎన్టీయార్‌లను చూడగానే మూర్తీభవించిన తెలుగుతనం అనబుద్ధేస్తుంది, వాళ్ల బట్టల వలన.

వైయస్‌ను మెచ్చుకున్న వారంతా ఆయన బాబు సంస్కరణలకు మానవీయకోణం చేర్చాడని (రిఫార్మ్స్ విత్ హ్యూమన్ ఫేస్) మెచ్చుకున్నారు. అందువలననే ప్రజలు ఆయన సంస్కరణలను ఆమోదించారని విశ్లేషించారు. అలా అనిపించడానికి కారణం వైయస్ తనను తాను 'ప్రెజెంట్' చేసుకున్న తీరు. వైయస్ చూడగానే ఓ పల్లెటూరి మోతుబరి గుర్తుకు వస్తాడు. అచ్చ తెలుగు

పంచెకట్టు, పేర్లు గుర్తు పెట్టుకుని 'నువ్వు ఎలాగున్నావయ్యా?' అంటూ చిరునవ్వుతో పలకరింపు, ఎదుటివాడి కుటుంబం గురించి క్షేమసమాచారాల వాకబు, సామెతలతో, జాతీయాలతో మాట్లాడే పద్ధతి, పక్కన ఓ ఆప్తమిత్రుడు, వెనక్కాల ఓ నమ్మినబంటు, తన ప్రాంతం మీద విపరీతమైన అభిమానం, క్రిస్‌మస్ నాడు పేదజంటలకు మంగళసూత్రాలు వుచితంగా పంచడం, స్కూళ్లు, కాలేజీలు కట్టి యాజమాన్యం వేరే కాలేజీకి బదలాయించడం, 'జొన్న సంకటి తింటాం, మొన్న పండగ నుండి మా యింట్లో కూడా దుడ్డుబియ్యం వండమని చెప్పా' లాటి ప్రకటనలు, ఏదైనా ఫంక్షన్ జరిగితే భార్యాసమేతంగా రావడం, వేదికమీదనైనా సరే మనుమళ్లను ముద్దు చేయడం, 'నేను వున్నాగా, విజయమైనా, అపజయమైనా నాదీ బాధ్యత, మీరు నా వెంట రండి చాలు' అని ధీమా కలిగించే నాయకత్వం, తనవాళ్లననుకున్న వాళ్లని కాపాడడానికి ఎంతదూరమైనా వెళ్లడం, 'చాల్లేవయ్యా చెప్పొచ్చావ్, కూచో, నీ సంగతి నాకు తెలియదా' అని నిండుసభలో ప్రత్యర్థిని అదలించడం, 'అయితే ఏంటంట?' అని తీసిపారేయడం, 'మాట తప్పే, మడమ తిప్పే వంశం కాదు మాది' అని హుంకరించడం – యివన్నీ భూస్వామి లక్షణాలే అయినా మనసున్న (బెనొవెలెంట్) పెత్తందారులా కనబడ్డాయి.

వీటిల్లోనే పెద్దవాళ్లను మన్నించడం కూడా చేర్చాలి. ఎన్నికలు గెలిచివచ్చి ఆయన రోశయ్యను కౌగలించుకున్న తీరు చూడండి. (వైయస్ స్థానంలో బాబుని వూహించుకుని చూస్తే ఆ ఫోటో అతకదనిపిస్తుంది) అదేవిధంగా హై కమాండ్ తో ఆయన సమీకరణం చూడండి. పాత కాంగ్రెస్ ముఖ్యమంత్రుల్లా ఆయన చీటికీ, మాటికీ ఢిల్లీ పరుగులు పెట్టి మన పరువు తీయలేదు. అలా అని వాళ్లను ధిక్కరించలేదు. నామీద వదిలేయండి, నేను చూసుకుంటాగా అంటూ వాళ్లకు నచ్చచెప్పడానికే చూశారు. కుదరనిచోట తల వంచారు. అవకాశం యిచ్చినచోట కష్టపడి పనిచేసి ఫలితాలు సాధించి చూపించి వాళ్ల చేత వహ్వా అనిపించుకున్నారు. ఈ రోజు యుపిఏ ప్రభుత్వం కమ్యూనిస్టుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి లేదంటే ఆ క్రెడిట్ వైయస్‌కే యివ్వాలి.

అంతేకాదు, "సాక్షి" పేపరు, టీవీ ఛానెల్ పెట్టించిన ఘనత కూడా వైయస్‌దే. ఆ పేపరూ, ఛానెల్ కాంగ్రెస్ విజయానికి ఎంతో దోహదపడ్డాయి. ఈనాడు, ఆంధ్రజ్యోతి కట్టిన కళ్లగంతలు విప్పడానికి సాక్షి ఎంతో శ్రమించింది. వాటిలో రాసిన వ్యాసాలలో వున్న స్వవచోఘాతాలను, అతిశయోక్తులను స్తనశల్యపరీక్ష చేసి ఎండగట్టింది. నాణానికి మరోవైపు కూడా చూసే అవకాశాన్ని తెలుగువారికి కలగజేసింది. నిజానికి పత్రికావ్యాపారం లాభసాటి వ్యాపారం కాదు. వ్యక్తిగతంగా డబ్బున్న కాంగ్రెస్‌వారు ఎంతో మంది వున్నా ఈనాడు కాంగ్రెస్ వ్యతిరేక ప్రచారాన్ని తట్టుకోవడానికి ఏ కాంగ్రెస్‌వాదీ పెట్టుబడి పెట్టలేదు. ఇన్నాళ్లకు వైయస్ ఒక్కరే ఆ ధైర్యం చేసి, తనకూ తనతో బాటు కాంగ్రెస్‌కు మేలు చేసుకున్నారు.

వైయస్ మాట నిర్భయంగా, నిర్మొగమాటంగా వుంటుంది. చేస్తే చేస్తానని, లేకపోతే కుదరదని స్పష్టంగా చెప్పేసేవారట. ఆయన ప్రసంగాలు క్లుప్తంగా వుంటాయి. మాట చివరిలో సాగదీయడం తప్ప కృత్రిమత కనబడదు. అధికారులు రాసిన ప్రసంగం చదువుతున్నట్టు వుండదు. నేటివిటీ వుంటుంది. (ఆయన ఇంగ్లీషు కూడా పట్టుబట్టి మాట్లాడినట్లు వుండదు, నేచురల్ ఫ్లో వుంటుంది). ముఖ్యమంత్రి సహాయనిధి బజెట్ ఏడాదికి 100 కోట్ల రూ.లకు పెంచి పెంచి ఎందరినో ఆదుకున్నారు. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో నిధి మంజూరు చేసే ఏర్పాట్లు చేశారు. (అంజయ్యమీద మేధావులు ఎన్నయినా జోకులు వేసుకోవచ్చు. కానీ సిఎం సహాయనిధి ద్వారా ఆయన అనేకమందిని ఆదుకుని పేదల్లో పాప్యులర్ అయ్యారు)

19

వీటన్నిటి వలనా నగరవాసులకు వైయస్ గిట్టకపోయినా, తక్కినవాళ్లకు బాగా నచ్చాడు. నచ్చని వాళ్లు కూడా ఆయనతో యింటరాక్ట్ అయ్యాక తెల్లబోయారు. విరసం సభ్యుడైన జర్నలిస్టు ఎన్.వేణుగోపాల్ ఆంధ్రజ్యోతిలో ఓ వ్యాసం రాశారు. తనను ఢిల్లీలోని ఎ.పి.భవన్‌కు కూడా రానీయకుండా అవమానించిన రాజకీయప్రత్యర్థి చెన్నారెడ్డిని దింపడానికి 1990లో వైయస్ పాతబస్తీలో రేకెత్తించిన అల్లర్ల దృష్ట్యా (వైయస్ చరిత్రలో అది ఒక మాయని మచ్చ. దానిలో రక్తం పారిన సంఘటనల కంటె కేకలతో, అరుపులతో, కత్తి ఝళిపింపులతో భయోత్పాతాన్ని ఎక్కువగా సృష్టించారని విన్నాను) వైయస్‌పై వేణుగోపాల్‌కు ఓ రకమైన దృక్పథం ఏర్పడి వుంది.

అలాటిది ఆయన 1996 ఎన్నికలు కవర్ చేస్తూ వాళ్లింటికి వెళితే ఆప్యాయంగా, ఉల్లాసంగా మాట్లాడుతూ మర్యాద కురిపిస్తూ స్వయంగా అల్పాహారం వడ్డించే పల్లెటూరి పెద్దమనిషిగా చూసి జీర్ణించుకోలేకపోయాట్ట. అదే విధంగా 1999లో ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీలో బజెట్‌పై ఉపన్యసించడానికి నోట్స్ తయారుచేస్తూన్న వైయస్ బజెట్‌గురించి వేణుగోపాల్ అభిప్రాయాలు తెలుసుకోవడానికి యింటికి రప్పించి బుద్ధిమంతుడైన విద్యార్థిలా క్లిప్‌ప్యాడ్‌కు తెల్లకాగితాలు పెట్టుకుని తను చెప్పినదల్లా నోట్స్ రాసుకున్నాట్ట. వర్గశత్రువుగా గుర్తిస్తూనే వైయస్‌లో తనకు కనబడిన సుగుణాలు రాశాడు వేణుగోపాల్. (ఆ మాత్రం రాసినందుకే కోపం వచ్చి విరసం తమ సంస్థనుండి వేణుగోపాల్‌ను బహిష్కరించింది)

వైయస్ ఆవేశంతో స్పాంటేనియస్‌గా రియాక్ట్ అవుతున్నట్టుగా కనబడినా, ఆయన ఎత్తుగడలు ముందే ఆలోచించి పెట్టుకున్నవి. ఎన్టీయార్ అధికారంలోకి వచ్చినపుడు రాయలసీమ గురించి ఉద్యమం చేయడం, ముఖ్యమంత్రిని సచివాలయంలో అడ్డుకోవడం, ఏబిడ్స్‌లో ఎన్టీయార్ యింటికి వెళ్లి ఆయనకు వచ్చేవరకు తిరిగి వెళ్లనని భీష్మించడం, యిలాటివి చేసి ప్రజల దృష్టిని ఆకర్షించారు.

తను అధికారంలోకి వచ్చాక యిలాటివి చేయడం అనవసరం అన్నట్టు ప్రవర్తించారు.

1989 లో రంగా హత్య తర్వాత చేపట్టిన పోరాటం ద్వారా కొన్ని జిల్లాలలో తనకంటూ ఓ వర్గాన్ని తయారుచేసుకున్నారు. ఆయన ఓ టర్మ్ పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైనా జాతీయ రాజకీయాలపై దృష్టిపెట్టలేదు. పార్లమెంటు ప్రతిభావంతంగా వుపన్యసించనూ లేదు. ఆయన చూపంతా అసెంబ్లీ పైననే. అఫెన్స్ యీజ్ బెస్ట్ ఫామ్ ఆఫ్ డిఫెన్స్ అన్న తీరులో ప్రత్యర్థులను వుక్కిరిబిక్కిరి చేసి మెంటల్‌గా ఆక్యుపై చేసేట్టుగా దూకుడుగా వెళ్లేవారు. హేళన చేసేవారు. ఆయన తప్పిపోయిన రోజునే ఆంధ్రజ్యోతి వైయస్ మెంటల్‌గేమ్ అని ఓ కథనం వేసింది. ఈ గేమ్‌లో యినీషియేటివ్ వైయస్ చేతిలోనే వుంటుంది. దానికి స్పందించడమే ప్రత్యర్థులు చేయవలసినది.

రెండోసారి ఎన్నికైనపుడు 'పాస్‌మార్కులే వచ్చాయి, డిస్టింక్షన్ యివ్వలేదు ప్రజలు' అంటూ గ్రే ఏరియాస్‌ను సరిదిద్దే కార్యక్రమం వెంటనే మొదలుపెట్టారు. 30 యేళ్ల కఠోరశ్రమతో వచ్చిన అలవాటు అది. ఎప్పటికీ అసమ్మతినేతగా వుండిపోవలసిన వైయస్‌కు పివి నరసింహారావు హయాంలో ఓ అవకాశం వచ్చిపడింది. పివి తనను పక్కకు నెట్టేశారు కాబట్టి, గత్యంతరం లేక పివి పట్టించుకోని సోనియా చెంత చేరారు. ఆమె సెక్రటరీ పి.సి.జార్జితో ఫ్రెండ్‌షిప్ చేశారు. మతం కూడా ఆయనకు ఉపకరించిందంటారు. ఏది ఏమైతేనేం కొన్నాళ్లకు పివి శకం అంతరించింది. సోనియా శకం అవతరించింది. దాంతో వైయస్ గ్రహాలు అనుగ్రహించాయి. అందుకే ఏ పథకం పెట్టినా సరే 'రాజీవ్' పేరు చేర్చారు వైయస్. తప్పితే ఇందిరా గాంధీ పేరు.

సెజ్‌ల కారణంగా సమాజంలో చాలా విధ్వంసం జరిగింది కదా. సరిగ్గా నిర్వహించిన సెజ్ ఒక్కటీ కానరాదు. మరి 103 సెజ్‌లు పెట్టిన రాష్ట్రంలో వైయస్ గురించి వందలాది మంది మరణించారంటే అర్థం చేసుకోవడం చాలా కష్టం. అందుకే వైయస్ ఫినామినా అర్థం చేసుకోవాలంటే యింత విపులంగా చర్చించాలి. కనబడినదంతా జేబులో పెట్టేసుకుని ఢిల్లీకి సూట్‌కేసులు మోసినందుకే అతను సిఎం అయిపోయి, నిలదొక్కుకున్నాడు అని సింప్లిఫై చేసేస్తే దెబ్బ తినేస్తాం. అమెరికా అధ్యక్షుణ్ని బాబు హైటెక్ సిటీకి తీసుకెళితే వైయస్ అగ్రికల్చరల్ యూనివర్శిటీకి తీసుకెళ్లారు.

అదీ ప్రాధాన్యతలలో వున్న వ్యత్యాసం. మెజారిటీ ప్రజలు మెచ్చినది రైతులంటే అక్కర బాహాటంగా కనబరచిన ప్రభుత్వానికే. 'వైయస్ గ్యోబాక్. వి వాంట్ బాబు బాక్' అని తానా సభలో కేకలు వేసిన మేధావులకు అర్థం కానిది యిదే! నిజానికి వైయస్ ఎన్టీయార్‌ను చాలావాటిల్లో అనుకరించారు. ఆయనకు వెన్నుదన్నుగా నిలబడి తదనంతరం వారసుడైన బాబే ఎన్టీయార్ పద్ధతులను నిర్లక్ష్యం చేసి వేరేమార్గం పట్టారు.

జలయజ్ఞం ఏమేరకు సఫలం అన్నదానిపై ఎంతో తర్జనభర్జన. ఒక్క ఎకరా కూడా తడవలేదని కొందరి ఆరోపణ. వేలాది ఎకరాలు సుభిక్షమై పోయాయని ప్రభుత్వ ప్రకటనలు. ఎవరిది నమ్మాలి? ప్రభుత్వేతర సంస్థ ఏదైనా శ్వేతపత్రం యిస్తే తప్ప మనకు నిజానిజాలు తేలవు. ఐదేళ్లలో జలయజ్ఞంపై ఖర్చు పెట్టినది 43 వేల కోట్లు. దానిలో సగానికి సగం వృథా అయిపోయిందనుకున్నా, కనీసం 20 వేల కోట్లయినా యిలాటి దీర్ఘకాలిక ప్రయోజనాలు సాధించే వ్యవస్థపై ఖర్చు అయినట్లే కదా. 81 ప్రాజెక్టులలో 13 పూర్తయాయట. దీనివలన, ఇందిరమ్మ యిళ్ల పథకం వలన సిమెంటు యిండస్ట్రీ బాగుపడింది.

జలయజ్ఞం అంటూ మొదలుపెట్టాక దానికి నిధులు కావలసి వచ్చాయి. హైదరాబాదులో భూములు తేరగా కనబడ్డాయి. అమ్మి పారేశారు. వేలంద్వారా అమ్మారు కాబట్టి పారదర్శకత వుంది, కానీ అమ్మడం అన్న ఆలోచనే అభ్యంతరకరం. అమ్మినా కొంత కొంత అమ్ముకుంటూ రావాలి కానీ, యిలా ఐదేళ్లలో అన్నీ అమ్మి పారేస్తే తర్వాతివాళ్లు అవసరమైతే అమ్ముకోవడానికి ఏం మిగులుతుంది? అసలు వైయస్ రెండో టెర్మ్ నెగ్గితే ఏం అమ్ముతాడా? అని చూస్తున్నాను. రెండో టెర్మ్‌లో కుదురుకోకుండానే వెళ్లిపోయాడు.

## 20

ఇప్పుడు వైయస్ వీరాభిమానులు 2 రూ.ల కిలో బియ్యం, ఉచిత విద్యుత్ పథకాలను విస్తరిస్తానన్న వైయస్ హామీని అమలుచేయాలని రోశయ్యపై ఒత్తిడి తెస్తున్నారు. వైయస్ బతికివున్నా యీ పరిస్థితుల్లో అమలు చేసివుండేవారు కాదన్న సంగతి అందరికీ తెలుసు. దీర్ఘకాలిక ప్రణాళికలు, స్వల్పకాలిక ప్రజాకర్షక పథకాలు రెండూ ఒకేసారి అమలు చేయడానికి చూడడంతో యీ సంకటం ఏర్పడింది. దీన్ని పరిష్కరించకుండానే వైయస్ పోయాడు. వైయస్ వారసుడికి పరిష్కారం చేసే భారం నెత్తినపడడంతో బాటు, ఎంత చేసినా 'వైయస్‌లా చేయడం లేదెహె' అనిపించుకోక తప్పదు. చచ్చినవాళ్ల కళ్లు చారెడు అంటాం. ఈ కారణంగా వైయస్ విషయంలో బారెడు అనిపించినా ఆశ్చర్యం లేదు.

ఎంజీయార్ విషయంలో యిలాగే జరిగింది. ఆయన స్వతహాగానే దాత. ప్రభుత్వంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వంతో మంచిగా వుంటూ మధ్యాహ్న భోజన పథకం, పళ్లపొడి పథకం, చెప్పుల పథకం అంటూ యిలా అనేక సంక్షేమ పథకాలు పెట్టి సామాన్య ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్నాడు. ప్రాజెక్టుల జోలికిపోలేదు. మద్రాసు నగర తాగునీటి సమస్యతో సహా దేన్నీ పరిష్కరించలేదు. ఆయన పోయిన తర్వాత యివన్నీ తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపాయి. ప్రభుత్వ నిధులు వాటికి ఖర్చయి సంక్షేమపథకాలు ఆపారు. అప్పుడు అందరూ 'ఎంజీయార్ వుండగా యిచ్చారు. ఇప్పుడు ఆపేశారు. ఆయన మహానుభావుడు. వీళ్లంతా దండగమారి మనుషులు' అన్నారు. ఇప్పుడు జగన్ సమర్థకులైన మంత్రులే ఆ మాట అనేసి రోశయ్య పనికి రాడని తేల్చేద్దామని తొందరపడుతున్నారు.

ఏ మాట కా మాట చెప్పుకోవాలంటే వైయస్ ఆర్థికపరమైన విజయాలకు వెనుక వున్నది రోశయ్యే. ఓవర్‌డ్రాఫ్ట్‌కి పోకుండా, కేంద్రం వద్ద పరపతి నిలుపుకుంటూ ఆర్థికవ్యవహారాలు చక్కబెట్టినది రోశయ్యే. ఆ విషయం హై కమాండ్‌కూ తెలుసు కాబట్టే రోశయ్యను కూచోబెట్టారు. వేరే ఆవేశపరులను ఎవరినైనా కూచోబెడితే 'వైయస్ కన్న కలలు నిజం చేయడానికి..' అంటూ యింకో రెండు స్కీములు ఎనౌన్సు చేసేవారు, ఓ పక్క 85% మండలాలు కరువులో విలవిలలాడుతున్నా....

అదే విధంగా మావోయిస్టుల విషయంలో వైయస్ విజయంలో భాగం యివ్వవలసినది జానారెడ్డికి. బాబుపై కోపంతో మావోయిస్టులు కాంగ్రెస్‌ను సమర్థించారు. దానికి ప్రతిగా వైయస్ అధికారంలోకి వస్తూనే మావోయిస్టులను చర్చలకు పిలిచి పోలీసుల చేత కాఫీ కప్పులిప్పించడం ఘోరం అనిపించింది. కానీ క్రమంగా అది ఒక ఎత్తుగడ మాత్రమే అని అర్థం అయింది. స్వరణ్‌జిత్ సేన్ పుణ్యమాని రాష్ట్రంలో మావోయిస్టు బెడద వదిలిపోయింది. గ్రామాల్లో సమాంతర ప్రభుత్వం అంతరించి, అధికారులు, పోలీసులు, సామాన్యప్రజలు అటువైపు వెళ్లగలుగుతున్నారు. మావోయిస్టుల భయం వున్నంతకాలం పల్లెసీమల్లో ప్రతీ యువకుడూ అనుమానితుడే, అటు పోలీసుల చేతా, యిటు మావోయిస్టుల చేతా హింసించబడేవాడే!

ఆంధ్రలో జరిగిన ప్రయోగం దేశం మొత్తానికి అనుకరణీయం అంటున్నారు. గతంలో మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలకి ఎన్నో నిధులు ఖర్చయేవి. అవి నిర్మాణాత్మకమైన పనులకు మళ్లించబడ్డాయి. నిజానికి ప్రాజెక్టులు పూర్తయి, గ్రామాలు సుభిక్షమైనపుడు, సంపద భూస్వాములు చేతిలో యిరుక్కుపోకుండా ప్రగతి ఫలాలు పదిమందికి అందినపుడు మావోయిస్టు సమస్య దానంతట అదే పరిష్కృతమౌతుంది. మావోయిస్టు సమస్య పరిష్కరించిన క్రెడిట్ తీసుకోవడానికి జానారెడ్డి సంకోచించారు. ఆయన లెక్కలేమిటో తెలియదు కానీ హోం శాఖలో ఏం జరిగినా తనకు తెలియకుండానే జరుగుతున్నట్టు ప్రదర్శించుకున్నారు. చివరకు ఏం జరిగిందంటే, 2009లో ఆయనకు కాబినెట్‌లో పదవి దక్కకపోతే యిదేమిటని అడుగుతూ ఒక్క వ్యాసం కూడా రాలేదు. మితిమీరిన లౌక్యం కూడదని చెప్తోంది యీ వుదంతం.

ఏది ఏమైనా వైయస్ అతితక్కువ కాలంలో ఓ రఫ్ అండ్ టఫ్ పొలిటీషియన్‌నుండి సీజన్‌డ్ స్టేట్స్‌మన్‌గా మారబోయారు. అందరికీ కావలసినవాడిగా మారేక్రమంలో ఓసి స్టూడెంట్స్‌కు కూడా ఫీజ్ రీఎంబర్స్‌మెంట్ పెట్టారు. జాతీయ ఉపాధి పథకం బాగా అమలు చేశారు. తెలంగాణా, రాయలసీమలపై ప్రత్యేకదృష్టి పెట్టారు. తొలిరోజుల్లో వోక్స్‌వ్యాగన్ వంటి పొరబాట్లనుండి నేర్చుకుని మౌలికరంగంలో రాష్ట్రంలో ఓ భారీ కర్మాగారం – ఎన్‌టిపిసి – భెల్ ప్రాజెక్టు తెచ్చారు. త్వరలోనే శంకుస్థాపన జరుగుతుంది.

సమైక్యవాదంతో ఎన్నికలు గెలిచి ప్రత్యేకతెలంగాణా వాదానికి ప్రజాబలం లేదని స్పష్టంగా చాటి మరీ వెళ్లిపోయారు. వైయస్ హయాంలోనే రాష్ట్రంలో నాలుగుమూలలా అభివృద్ధి జరగనారంభించింది. గతంలోలా ప్రతీదీ హైదరాబాదుకి కట్టబెట్ట లేదు. అసలు వైయస్ స్పీడ్ మనిషి. ఎప్పుడూ వాచీ చూసుకుంటూ వుండేవారు. సమస్యలపై నాన్చడం యిష్టం లేదు. చేసేయడమే, తర్వాత ఏమైనా వస్తే చూసుకోవచ్చు అని ఆయన ఫిలాసఫీ. అభయహస్తం వంటి స్కీముల ద్వారా మహిళలు, పెన్షన్ స్కీముల ద్వారా వృద్ధులు ఆయన్ను చాలాకాలం గుర్తు పెట్టుకుంటారు.

వైయస్‌ను మీరు మెచ్చుకోవచ్చు, లేదా తిట్టుకోవచ్చు కానీ పట్టించుకోకుండా వుండలేరు. ఆయనది ఓ పవర్‌ఫుల్ ప్రెజెన్స్. ఆయన స్థానం భర్తీ చేయడం అంత సులభమైన పనేమీ కాదు. అందుకే యింత పెద్ద నివాళి. ఈ మాటలతో ఈ వ్యాసపరంపరకు స్వస్తి పలుకుతున్నాను. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2009)**

**ఎమ్బీయస్ కబుర్లు 22-09-09 అరాచకాంధ్ర – 1**

వైయస్ బతికుండగా రాష్ట్రంలో 'మా వంశం, మాటతప్పడం మా యింటావంటా లేదు..' అంటూ రాచరికపు పోకడలు వర్ధిల్లాయనుకున్నాం. దానికి యాంటీడోట్‌గా కాబోలు యిప్పుడు ఎల్లెడలా అరాచకం తాండవిస్తోంది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి గారున్నారు. వారు గద్దెనెక్కరు. స్టూల్ మీద కూచున్నట్టు కూచున్నారు. కాబినెట్ మీటింగు పెడితే వారి మంత్రులే రారు. వచ్చిన మంత్రులు నిలదీస్తారు, కోపిగించుకుంటారు. మరి కొందరు నిన్ను సిఎంగా గుర్తించమంటారు. నువ్వు తాత్కాలికమే, శాశ్వత సిఎం కోసం ఎదురుచూపులు చూస్తున్నామంటారు. నువ్వే పర్మనెంటు అంటే పదవి వదులుకుపోతామంటారు.

అధికారంలో వున్న పార్టీకి లెజిస్లేచర్స్ మీటింగ్ పెట్టడానికి దమ్ము లేదు. సంతాపసభ తీర్మానం ఒక్కటీ చేసి ముగిద్దామంటే రసాభాస చేసేస్తారేమోనని భయం. పిసిసి ప్రెసిడెంటుకి పార్టీ ఆఫీసు గాంధీభవన్‌లో మీటింగు పెట్టాలంటే భయం. మాట్లాడనివ్వకుండా తరిమేస్తారని. వీడియో కాన్ఫరెన్సు పెట్టి పార్టీ సభ్యత్వం ఎంతమందికి యిచ్చావయ్యా అని అడగాలంటే భయం – గోలచేసి ఆపేస్తారని. ఆ కాన్ఫరెన్సుకి హాజరవ్వాలంటే జిల్లా నాయకులకు భయం– పార్టీ ఆఫీసుకి తాళం వేసి నిప్పు పెట్టేస్తారని.

జీవితమంతా పార్టీసేవలో గడిపేసిన నాయకులకు కూడా 'హై కమాండ్ ఏం చెబితే అదే వింటాం' అని అనడానికి భయం – బెదిరింపు ఫోన్‌కాల్స్ వస్తాయని, దిష్టిబొమ్మలు తగలేస్తారని, వాళ్ల బొమ్మలున్న ఫ్లెక్సీలు చింపేస్తారని. వైయస్ పెద్దన్నగారిలా గౌరవించిన రోశయ్య గురించి యిప్పుడు ఒక్క మంచిమాట అన్నా, శివాలెత్తిపోయే సేనలు తయారయ్యాయి. తాత్కాలిక ముఖ్యమంత్రి అనే పదం రాజ్యాంగంలో లేదు, రోశయ్య కొనసాగుతారు అని అంటే చాలు, 'నీ స్టేటుమెంటు విని నా గుండె ఆగిపోయింది, నువ్వే బాధ్యుడివి'

అని కేసులు పెట్టేసే రోజులు వచ్చాయి.

ఎవరు సిఎం అవుతారో, ఎవరు పిఎం అవుతారో తెలియదు కానీ మనం వెళ్లే బస్సు అడంగు చేరుతుందా, అగ్నికి ఆహుతవుతుందా, రైలు ఆగుతుందా, సాగుతుందా, దారి ధర్నాల బారిపడుతుందా, మనం వెళ్లే ఆఫీసుకు గేటు వేసేస్తారా? లోపల మనల్ని పెట్టేసి మూసేస్తారా? తెలియక మామూలు జనం బిక్కుబిక్కుమంటున్నారు. వైయస్ పోయినందుకు ఏడవని వాళ్లుంటే యిప్పుడు ఏడుస్తున్నారు – ఆయన చచ్చి మనని చంపుతున్నాడు, ఆయనే బతికుంటే యీ పరిస్థితి వచ్చేది కాదు కదా, ఏదో ఒకటి ఐదేళ్లపాటు బండి నడిచేది కదాని.

నిజంగా వైయస్ ఆత్మ యివన్నీ చూసి వుంటే ఘోషిస్తూ వుంటుంది. రాజీవ్ పేరు రాష్ట్రంలో సందుసందుకీ పెట్టి, సోనియా సేవలో తరించిన వైయస్, తన తనయుడి పేరుతో హై కమాండ్‌నే ధిక్కరించే తన అనుయాయులను చూసి రోదించేవారు. నిజానికి వైయస్ తన తనయుణ్ని యింత త్వరగా రాష్ట్రరాజకీయాలను తీసుకురావాలని తపించారా?

తను వున్న వృత్తిలోకి తన పిల్లలు రాకూడదని చాలామంది అనుకుంటారు. డాక్టర్లు, లాయర్లు, ఆడిటర్లు, వ్యాపారస్తులు అయితే తమ ప్రాక్టీసు/వ్యాపారం వేరేవారికి పోకుండా పిల్లలకు యిద్దామని చూస్తారు. కానీ ఒడిదుడుకుల జీవితం గడిపే సినిమావాళ్లు, రాజకీయ నాయకులు తమ పిల్లలు వేరేవృత్తిలోకి వెళ్లాలని కోరుకుంటారు. పిల్లలు చిన్నవాళ్లుగా వుండగా ఆ మేరకు స్టేటుమెంట్లు కూడా యిస్తారు. కానీ పిల్లలు ఎదిగాక తక్కినవాటిల్లో అనుకున్నంత పైకి రాకపోతే 'సరేలే ఏం చేస్తాం, యిక్కడికే రా' అని ఆహ్వానిస్తారు. వైయస్ తన కుమారుణ్ని బికాం తో ఆపనీయకుండా పెద్ద చదువులు చదివిద్దామని అమెరికా పంపారు. కానీ అతను చదువులో శ్రద్ధ చూపలేదు. ఇంటిమీద బెంగ అంటూ తిరిగి వచ్చేశాడు (వైయస్ అసెంబ్లీలో చెప్పినదే) సరే, వ్యాపారం పెట్టేయ్ అన్నాడీయన.

'వ్యాపారవేత్తగా జగన్ రాణిస్తున్నాడు. తండ్రి పదవిలోకి రావడం వలన గత ఐదేళ్లగా మరింతగా వృద్ధి చెంది వుండవచ్చు కానీ అంతకుముందు నుండీ కూడా వ్యాపారం బాగానే నడుస్తోంది కదా. అంటే వ్యాపారంలో నిలదొక్కుకున్నట్టే! ఇంకా ఎంతో భవిష్యత్తు వుంది. పాలిటిక్స్ అంటారా, ఎంతకాలం వుంటుందో తెలియదు. ఇప్పుడు సోనియా రాజ్యం కాబట్టి మన హవా నడుస్తోంది. రేపు బిజెపి వచ్చినా లేక కాంగ్రెస్‌లో సోనియాకు బదులు వేరెవరు వచ్చినా ఏమౌతుందో తెలియదు. పోనీ కేంద్రంలో పట్టున్నా రాష్ట్రంలో వుండాలనేముంది? ఓ 2% ఓట్లు అటుదిటు అయివుంటే మొన్న 2009లోనే బాబు వచ్చేసేవాడు. తన చిట్టాలన్నీ బయటకు లాగవచ్చు. పోనీ ఏదో ఒప్పందానికి వచ్చి లాగకపోయినా ముందు ముందు సంపాదనలన్నీ కట్‌యే కదా!

'ఇటువంటి ఎగుడుదిగుడు ప్రపంచంలోకి లాగడం దేనికి? హాయిగా వ్యాపారం చేసుకోనీ. అది బోరు కొట్టాక మన రాజకీయ వారసత్వం కాపాడడానికి మెల్లగా రాజకీయాల్లోకి రానీ. మొదట పార్లమెంటులోకి వెళ్లి, ఢిల్లీలో మన తరఫున పనులు చూసిపెడుతూ, పురంధరేశ్వరిలాగ అక్కడ మంచిపేరు తెచ్చుకుంటే మన తర్వాత యిక్కడ సిఎం కావడానికి అందరూ తలలూపుతారు. మనం ఆరోగ్యం కాపాడుకుంటున్నాం కాబట్టి ఎలాగూ యింకో పది, పదిహేనేళ్లు చులాగ్గా లాగించేస్తాం. ఆ పాటికి అతనికి ఓ 50 ఏళ్లు వస్తాయి. సంపాదించాల్సినదంతా సంపాదించేస్తాడు. కొడుక్కి వ్యాపారబాధ్యత అప్పగించి అప్పుడు మన వారసుడిగా యిక్కడకు పూర్తిగా వస్తాడు. ఆ పాటికి ధక్కామొక్కీలు తిని వుంటాడు కాబట్టి రాటు తేలతాడు. పాలిటిక్స్‌లో రాణిస్తాడు.' యిలా సాగి వుంటాయి వైయస్ ఆలోచనలు.

2

కానీ పైవాడు కథ మార్చేశాడు. అనూహ్యమైన నల్లమల మలుపు పెట్టాడు. వైయస్ కనుమరుగు అయిపోయాడు. గాయాలతో ఆసుపత్రికి తీసుకురాబడి ఒకటి రెండు రోజులపాటు మాట్లాడే అవకాశమున్నా జగన్‌కు మంచీ చెడ్డా బోధించివుండేవాడు. ఆ అవకాశం లేకుండా పోయింది. ఇక యిప్పుడు జగన్ చుట్టూ వూదరగొట్టేవాళ్లే మిగిలారు. ఈ ఊదరగొట్టేవాళ్లే పెద్ద చిక్కు. ఇప్పుడో సినిమా డైరక్టరున్నాడనుకోండి. పాతికేళ్లపాటు ఫీల్డులో వుండడం చేత ఎవడిలో స్టార్ మెటీరియల్ వుందో, ఎవరిలో లేదో ఖచ్చితంగా తెలుస్తుంది. అతని కొడుక్కి యుక్తవయసు వచ్చాక సినిమాల్లో చేరదామనే దురద పుట్టిందనుకోండి. ఆయన చెప్తాడు – 'అబ్బాయి, నీది స్టార్ ఫేస్ కాదురా. ఈ పని బదులు వేరే పని చూసుకో' అని.

కానీ అతను వింటాడా? అతని చుట్టూ ఫ్రెండ్స్ విననిస్తారా? 'అదేమిటి బాస్, మీ నాన్న తలచుకుంటే నిన్ను స్టార్ చేయలేడా? ఫలానావాడిలో ఏం స్టఫ్ వుందని, మొహం ఏం బావుందని? అయినా మీ నాన్న వాణ్ని పెద్ద హీరోని చేశాడు. నీ మీద ఏదో కసి వుంది ఆయన చెప్పినట్టుగా బాగా చదువుమీద శ్రద్ధపెట్టి డాక్టరో, యింజనీరో కాలేదని. అందుకే యిలా చెప్తున్నాడు' అని వూదరగొడతారు. డైరక్టర్‌గారికి వాళ్ల ఆవిడ కూడా కోటింగ్ యిచ్చేస్తుంది 'మీరెప్పుడూ యింతే, వాణ్ని ఏనాడూ పట్టించుకోలేదు. సరిగ్గా కూచోబెట్టి చెప్తే వాడంత బంగారుతండ్రి లేడు. కానీ మీరు బిజీబిజీ అంటూ నిర్లక్ష్యం చేయడం చేతనే చదువులో పైకి రాలేదు. ఇప్పుడైనా మీరు సినిమాఫీల్డులో దగ్గరుండి తర్ఫీదు యివ్వండి. ఎందుకు పైకి రాడో చూద్దాం' అని.

ఈ నస భరించలేక డైరక్టరుగారు వాణ్ని హీరో చేసి ఒకటి రెండు సినిమాలు తీస్తాడు. తుస్సుమంటాయి. డైరక్టరు అనే కాదు, పెద్ద హీరోలకు కూడా యీ బాధ తప్పదు. చాలాకాలం ఫీల్డులో వున్నారు కాబట్టి ఎవరు నటులుగా రాణిస్తారో, ఎవరు రాణించరో

తెలుస్తుంది, అయినా ఒత్తిళ్లకు తట్టుకోలేక 'సరే రా, హీరోగా వుద్ధరించు' అంటారు. ప్రజలకు మొహమాటాలు లేవు. 'మీ నాన్నను ఆదరించినంత మాత్రాన నిన్ను ఆదరించాలని లేదురా అబ్బాయ్' అంటారు.

ఇలా తొలి సినిమాలు ఫెయిలయినా మరోటి, మరోటి వేస్తూనే వుంటారు కొందరు వారసులు. ఆ తర్వాత తెలుస్తుంది – తనదంటూ ఓ బాణీ ఏర్పరుచుకోవాలి, తండ్రి మాటను, అంగికాన్ని అనుకరిస్తూ పోయినంత మాత్రాన ప్రజలు ఆమోదించేయరు అని. ఇలా నాలుగుసార్లు పడి లేచాక – లేచే ఓపికా, వుత్సాహం వుంటే – తనకంటూ ఓ దారి ఏర్పరచుకుని అప్పుడు ఆ దారిలో రాణిస్తారు.

నెహ్రూగారి బాట వేరు. ఆయన తర్వాత ఇందిరా గాంధీని ప్రధానమంత్రిని చేయలేదు. లాల్ బహదూర్ హయాం నడిచింది. ఆయన హఠాన్మరణం తర్వాత ఇందిరా గాంధీకి అనుకోకుండా ఛాన్సు వచ్చింది. పార్టీపై గాని, ప్రభుత్వపాలనపై గాని నెహ్రూగారి కున్న పట్టు ఆమెకు లేదు. ఆవిణ్ని కొంతకాలం బొమ్మలా ఆడించారు వాళ్ల నాన్నగారి అనుయాయులు. తర్వాత ఆవిడ తనకంటూ కొందరు సన్నిహితులను ఏర్పరచుకుంది. తనకంటూ ఓ పంథా ఏర్పరచుకుంది. క్రమక్రమంగా పట్టు బిగించుకుంటూ పాతవాళ్లకు ఉద్వాసన చెబుతూ బలపడింది.

ఇందిరా గాంధీ పోయాక రాజీవ్ గాంధీ వచ్చాడు. ఇందిరా విధానాలకు పూర్తి వ్యతిరేకమైన విధానాలు రాజీవ్‌వి. ఇందిర ఆదరించిన పబ్లిక్ సెక్టార్‌ను పూర్తిగా మట్టుపెట్టేశాడు. గ్లోబలైజేషన్ బాట పట్టాడు. ఇక్కడ ఏది మంచిది, ఏది కాదు అన్న చర్చ చేయడం లేదు. విధానాలలో, పద్ధతులలో మార్పు గురించి చెబుతున్నాను. రాజీవ్ సలహాదార్లు ఇందిర సలహాదార్ల వంటి వారు కారు. వాళ్ల ఆలోచనలు వాళ్లవి. వారసత్వం భౌతిక వారసత్వమే తప్ప, సిద్ధాంతవారసత్వం కాదు.

ఇప్పుడు జగన్‌కు వైయస్ ఆలోచనలే వస్తాయనుకోవడం శుద్ధ పొరబాటు. ఒక మనిషి అచ్చు మరొక మనిషిలాగానే ఆలోచిస్తాడనుకోవడం స్ృష్టిని, స్ృష్టికర్తను అవమానించినట్టే. అలా అయితే మరో అతన్ని స్ృజించడం ఎందుకు దండగ! వైయస్‌కు సన్నిహితంగా మెలిగిన వారే యిప్పుడు జగన్‌ను వూదరగొట్టి పదవిలోకి రప్పిస్తున్నా రనుకుంటే వారంతా వుసూరుమనే రోజు వస్తుంది. జగన్‌కు ఫ్రెండ్స్ సర్కిల్ వేరే వుంటుంది. అతని వయసుబట్టి, అతను పెరిగిన పరిసరాలను బట్టి, అతని ఆలోచనలు, ప్రాధాన్యతలు వుంటాయి. అతను పదవిలోకి రాగానే యీ పాత సర్కిల్ వాళ్లంతా దూరమౌతారు. కొత్తవాళ్లందరూ దగ్గరవుతారు.

రాజీవ్ గాంధీ పదవిలోకి వస్తూనే డూన్ స్కూల్ క్లాస్‌మేట్ అరుణ్ నెహ్రూని, అరుణ్ సింగ్‌ను తెచ్చుకున్నాడు. ఫారిన్ గూడ్స్ వేసుకోవడం ఫ్యాషన్ చేశాడు. విదేశీవస్తువులకు తలుపులు బార్లా తెరిచాడు. ఇందిరా గాంధీ బతికుంటే నెత్తీ నోరూ కొట్టుకునేది. బీదలపాటి దైవంగా తను తెచ్చుకున్న యిమేజ్‌ను తగలేస్తున్నందుకు.

రేపు జగన్ కూడా వైయస్‌లాగ రైతు బాంధవుడు అయి తీరాలని ఏమీ లేదు. చంద్రబాబులాగ హైటెక్, హైటెక్ అనవచ్చు.అతను చదువుకున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఫ్రెండ్స్‌ని తోడుగా పెట్టుకోవచ్చు. సాక్షి పేపర్‌లాగ రంగులు, హంగుల వెంట పడవచ్చు. అందువలన మనం గ్రహించవలసినది జగన్ సిఎం కావడం యిష్టం లేనివారందరూ వైయస్ వ్యతిరేకులని స్టాంప్ వేయడం తప్పు. ప్రజలకు కానీ, నాయకులకు కానీ కావలసినది ఓ లీడర్. తమ కష్టాలు గ్రహించి, కష్టకాలంలో తమను గట్టున పడవేయగలిగిన నాయకుడు. జగన్‌కు ఆ శక్తి, ఆసక్తి వున్నాయా లేదా అన్న విషయం తేలేదాకా ఎటూ చెప్పలేని పరిస్థితి.

3

బిజినెస్‌మన్‌గా జగన్ ఎటువంటి వారు? సాక్షి పేపరును బాగా తెచ్చి విజయవంతం చేశారు. ఈనాడుకి దీటుగా నిలబెట్టి పత్రికా రంగంలో పెనుమార్పులు తెచ్చారు. హాకర్స్, ఏజంట్స్, పాత్రికేయులు, పాఠకులకు అందరికీ న్యాయం చేసి తనకంటూ ప్రత్యేకస్థానం తెచ్చుకున్నారు. ఆయన వచ్చాకనే జర్నలిస్టుల జీవితాల్లో పెనుమార్పు వచ్చింది. ఇటువంటి ఔదార్యం ఆయన నడిపే యితర సంస్థల్లో చూపించారో లేదో నాకు తెలియదు. ఈనాడుపై పైచేయి సాధించడానికే యిలా చేశారా, లేక విద్యుత్ ప్రాజెక్టు, మైనింగ్ రంగాల్లో కూడా యిలాగే చేశారా? అన్నది ఆయన వుద్యోగులే చెప్పాలి.

సాక్షి పత్రిక విషయంలో సాధించిన విజయం సాక్షి టీవీ విషయంలో కనబడలేదు. దాన్ని ప్రారంభించడానికే ఏళ్లూ, పూళ్లూ పట్టింది. సరిగ్గా ఎలక్షన్ ముందు ప్రారంభించడంతో తక్కిన టీవీల వ్యతిరేక ప్రచారాన్ని తట్టుకోవడానికి మరీ కాంగ్రెస్ బాకాలా తయారైంది. దాంతో టెక్నికల్‌గా బాగున్నా, కాంటెంట్‌వైజ్ ఆకట్టుకోలేకపోయింది. ఇప్పుడిప్పుడే ఎంటర్‌టైన్‌మెంట్‌పై దృష్టి సారిస్తోంది అనుకుంటే వైయస్ చావు వచ్చిపడింది. సాక్షి పేపరు, సాక్షి టీవీ ముట్టడానికీ, పెట్టడానికీ భయం వేస్తోంది. ఎంతసేపూ ఒకే గోల. స్వంత తండ్రి పోతేనే తద్దినం నాడు తప్ప ఫోటోఫ్రేమ్ అద్దంపై దుమ్ము దులిపి దండ వేయం. అలాటిది దినాలు దాటినా టీవీ ఫ్రేమ్‌పై వైయస్‌పై పుష్పవృష్టి బొమ్మ తీయకపోతే ఎలా? రేటింగ్స్ తప్పకుండా తగ్గేవుంటాయి.

ఇక వ్యక్తిగా ఆయన ఎటువంటివాడు? నాకు తెలియదు. కష్టించే స్వభావం వున్నవాడైతే రాహుల్ గాంధీ తరహాలో కాంగ్రెస్ పార్టీని వుద్ధరించే ప్రయత్నం చేయాలి. పిసిసి అధ్యక్షుడై రాష్ట్ర రాజకీయాలను శాసించవచ్చు. కేంద్రంలో సోనియా-మన్‌మోహన్ సమీకరణమే యిక్కడ జగన్-రోశయ్య విషయంలోనూ పనిచేయవచ్చు.

ఇప్పటికిప్పుడు గద్దెపై కూచుంటే జగన్‌కు కలిసివచ్చేది ఏముంది? ముళ్లకిరీటం ధరించి సీనారేకు సింహాసనం మీద కూచున్నట్టే. ఖజానా ఖాళీ. పెన్షన్లకే తడుముకుంటున్నారు. వైయస్ తనయుడిగా జగన్‌పై ప్రజల ఆశలు ఎక్కువగా వుంటాయి. అవి తీర్చడం ఆయన తరం కాదు కదా, బతికున్నా వైయస్ తరం కూడా కాదు. దేశంలో చూస్తే 37 ఏళ్లలో ఎన్నడూ చూడనంత కరువు. రాష్ట్రంలో చూస్తే 85% జిల్లాల్లో కరువు. పంపిణీ వ్యవస్థ చూడబోతే ఎక్కడికక్కడ బోగస్ రేషన్ కార్డులు. ఇటువంటి పరిస్థితుల్లో రాజ్యం చేస్తే మంచిపేరు రావడం సాధ్యమా? జగన్‌కి పాలించడం రాదు అని స్టాంపు కొట్టేస్తారు.

తెలివైనవాడు యిలాటి పరిస్థితుల్లో యింకోణ్ని కూచోబెట్టి, తాను కర్రపెత్తనం చలాయిస్తాడు. సోనియాను చూసైనా కాస్త నేర్చుకోవాలి. కేంద్రంలో ఏం జరిగింది? చంద్రశేఖర్ వున్న బంగారాన్ని కుదువబెట్టి చేతులెత్తేసి దిగిపోయిన తర్వాత పి వి నరసింహారావు వచ్చారు. నానా తంటాలు పడి ఆర్థికవ్యవస్థను కుదుటబరచారు. ఆ తర్వాత వచ్చినవాళ్లు రైతులకు రుణమాఫీలని, మరోటని డబ్బులు పంచేసి క్రెడిట్ కొట్టేశారు. ఇప్పుడు రోశయ్యని అలాగే మేనేజ్ చేయనీయండి.

రోశయ్య ఆ పదవిలో స్థిరపడిపోతాడన్న భయమా? అదేం అక్కరలేదు. అక్కడ పివిని ఏం చేశారు? అవసరం తీరగానే లాగిపారేశారు. ఆయనమీద అన్ని అవినీతి ఆరోపణలు వస్తే పార్టీ వెంట నిలిచిందా? చచ్చీ చెడీ ఆయనే అన్నీ స్వయంగా ఫైట్ చేసుకుని తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుని పోయాడు. బాబ్రీ గొడవ ఆయన నెత్తికి చుట్టేసి సోనియా ఆయన్ని చరిత్రహీనుణ్ని చేసి పారేసింది. ఢిల్లీలో ఓ స్మారకచిహ్నం కూడా లేకుండా చేసింది. ఇంత చేసినా ఆయన కులంవాళ్లెవరూ కాంగ్రెస్‌పై దండెత్తలేదు. తన భవిష్యత్తూ అంతే నని కులబలం లేని రోశయ్యకూ తెలుసు. అయినా తన ఒడిలో వచ్చిపడిన యీ అవకాశాన్ని బాధ్యతగా భావించి ఆయన తలకెత్తుకున్నాడు.

ఆయన సంగతి తెలుసు కాబట్టే హై కమాండ్ ఆ పని అప్పగించింది. ఈలోగా జగన్ పాటవం ఏ పాటిదో తెలుసుకునేందుకు కొన్ని బాధ్యతలు అప్పగించి కొన్ని పరీక్షలు పెడుతుంది. కొడుకైనంత మాత్రాన సర్వలక్షణాలూ అలాగే రావాలని లేదు. గాంధీగారి తండ్రి మహాత్ముడు కాదు, కొడుకూ కాదు. గాంధీగారు ఒక్కడే మహాత్ముడు! రాజశేఖరరెడ్డి మరో రాజారెడ్డిలా లేనప్పుడు, రాజశేఖరరెడ్డిలా జగన్ వుండాలనేముంది? ఒకవేళ జగన్‌కి ఓ సోదరుడు వుండి వుంటే, ఆ యిద్దరిలో ఎవరికి వైయస్ లక్షణాలు ఎక్కువున్నాయో తేల్చుకుని అప్పుడు యిచ్చేవారు కదా! ఇక్కడ కరుణానిధి కథ గుర్తు చేసుకోవాలి.

అరాచకాంధ్ర అని హెడింగ్ పెట్టి తక్కిన రాష్ట్రాల కథలు చెప్తే ఎలా అనకండి. హెడింగ్ ఏం పెట్టినా విజ్ఞానం పంచుకోవడమే యీ కబుర్ల (ఇవి సంపాదకీయాలు కావు, వ్యాసాలు కావు) లక్ష్యం. వీటన్నిటికి అంతస్సూత్రంగా ఒక సామాన్య అంశం వుంటుంది. అది గమనించండి. తర్కశాస్త్రంలో కూడా సాపేక్షతతోనే వాదాన్ని ముందుకు తెస్తారు. పోలికలు చెప్తేనే అంశం బాగా వంటపడుతుంది. నా పాఠకులలో అధికశాతం మంది ఏదైనా తెలుసుకోవాలన్న వుత్సాహం వున్నవాళ్లు, తెలియచెప్పే మనుష్యులు కానీ, గ్రంథాలు కానీ, పత్రికలు కానీ దొరక్క అల్లాడుతున్నవాళ్లు. నేను చెప్పిన సమాచారం దీనికి కాకపోతే మరోదానికైనా వుపయోగపడుతుందనే నమ్మకంతో 'ఇంకా చెప్పండి, యింకా చెప్పండి' అని నన్ను వుత్తేజపరిచేవారు. వారి కోసమే యీ 'అధికప్రసంగం'! (సశేషం)

4

కరుణానిధి రాజకీయ చతురుడు. కళాభిజ్ఞుడు. రచయిత. వక్త ఎట్సెట్రా. ముగ్గురు భార్యలు. వారికి పుట్టిన ముగ్గురు కొడుకుల గురించి చెప్పుకుందాం. మొదటివాడు ము.క.ముత్తు అని ఓ అభాగ్యుడు. తను ముఖ్యమంత్రి అయిన కొత్తరోజుల్లో అతన్ని ఎంజీయార్‌కు పోటీగా నిలబెట్టి ఎంజీయార్ ప్రాధాన్యత తగ్గించాలని (అప్పట్లో ఎంజీయార్ డిఎంకెలోనే వుండేవాడు) ప్రయత్నించాడు కరుణానిధి. "పిళ్లయో పిళ్లయ్" అనే సినిమా తనే రాసి, తీయించి, సినిమా వెలువడిన మర్నాడే ఆ ముత్తుకి రాష్ట్రమంతా అభిమాన సంఘాలు వెలిసేట్లా చూశాడు. వాళ్లంతా డిఎంకెలో కరుణానిధి సపోర్టర్లే. ఎంజీయార్ అభిమానసంఘం వాళ్లు, వీళ్లు కొట్టేసుకున్నారు. పోస్టర్లు చించేసుకున్నారు.

దాంతో 'రాష్ట్రంలో అభిమాన సంఘాలతో పెద్ద గొడవగా వుంది, అన్నీ రద్దు చేసేద్దాం' అని కరుణానిధి ప్రతిపాదించాడు. ఈ విధంగా ఎంజీయార్‌కు అభిమాన సంఘాల దన్ను లేకుండా చేసి పార్టీలోంచి తరిమేద్దామనుకున్నాడు. ఇంతా చేసి ఆ సినిమా తుస్సుమంది. ఎంజీయార్ సినిమాలు చెక్కు చెదరలేదు. అభిమాన సంఘాలు యింకా వర్ధిల్లాయి. చివరకి అతన్ని పార్టీలోంచి తీసేసినపుడు అవే అతన్ని ఆదుకున్నాయి. ఇక ముత్తు సంగతికి వస్తే అతను హీరోగా ఫ్లాపయ్యాడు. ఒకటో, అరో సినిమాలు వేసి మానుకున్నాడు. ఆ తర్వాత తండ్రి మీద కోపంతో వెళ్లి ఎంజీయార్ పార్టీలో చేరాడు. మళ్లీ కొన్నేళ్లకు ఆరోగ్యం చెడి తండ్రి పంచన చేరాడు. ఇప్పుడు వున్నాడో లేడో తెలియని జీవచ్ఛవంలా వున్నాడు.

కరుణానిధి యింకో కొడుకు అళగిరి. గూండాగిరీలో ఆరితేరినవాడు. జనాల్ని పోగుచేసి అల్లర్లు చేయించడంలో సిద్ధహస్తుడు. చదువుకున్నవాళ్లను అస్సలు మెప్పించలేడు. తనతో పోటీ పడే సవతిసోదరుడు స్టాలిన్ అంటే మండిపడతాడు. స్టాలిన్, అళగిరి మధ్య తగాదాలు తీర్చలేక చివరకు కరుణానిధి అళగిరిని దక్షిణ తమిళనాడులో డిఎంకెను విస్తరింపజేయి అంటూ మధురై పంపేశాడు. ఢిల్లీ చక్రవర్తులు అదే చేసేవారు. సింహాసనం ఆశించే యువరాజులు గొడవలు పడుతూ వుంటే ఒకణ్ని దక్కన్‌కి, మరోణ్ని బెంగాల్‌కు,

యింకోణ్ని పంజాబ్‌కు తరిమేసేవారు. చక్రవర్తి చచ్చాడని తెలియగానే వీళ్లు వురుకులుపరుగుల మీద ఢిల్లీ చేరేవారు. ఎవరు ముందు చేరి కోటపట్టుకుంటే వారిదే సింహాసనం.

ఇక స్టాలిన్ మద్రాసులోనే తండ్రికి దగ్గరగా వున్నాడు. వక్త. మద్రాసు మేయర్‌గా ఎడ్మినిస్ట్రేషన్ నేర్చుకున్నాడు. కరుణానిధి పోయిన తర్వాత వారసత్వం స్టాలిన్‌దా, అళగిరిదా అన్న వివాదం తమిళనాడు ప్రజలందరికీ మెదడుకి మేత. ఈ పరిస్థితుల్లో కరుణానిధి మేనల్లుడి కుమారులైన మారన్ వాళ్ల పత్రిక 'మేం సర్వే చేశాం. అళగిరిని ప్రజలందరూ తిరస్కరించారు' అని వార్త వేసింది. అంతే అళగిరి మనుష్యులు ఆ పత్రిక ప్రతులతో బాటు స్టాఫ్ మెంబర్లను కూడా నిప్పుపెట్టి తగలేశారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి కొడుకు అలా చేయించాడంటే చూడండి – అతను ఎలాటి రకమో! ఆ సర్వే ఫలితాలకే యింత రియాక్షనైతే, తను పోయిన తర్వాత అళగిరి మనుష్యులు స్టాలిన్‌కే నిప్పుముట్టిస్తారేమోనని భయం పట్టుకుంది కరుణానిధికి.

2009 ఎలక్షన్లయ్యాక యిద్దర్నీ కూచోబెట్టి పంచాయితీ పెట్టాడు. 'రాష్ట్రం స్టాలిన్‌కి అప్పగించేయ్, నువ్వు కేంద్రానికి తగలడు' అని అళగిరికి చెప్పాడు. 'నాకు తమిళం తప్ప వేరే భాష రాదు కదా, అక్కడ నేనేం వెలగబెడతాను' అన్నాడు అళగిరి. 'మన మద్దతుతో సర్కారు నడిపే కాంగ్రెస్‌కి మనను కాదనే ధైర్యం ఎక్కడ? నువ్వెళ్లు చెప్తా, అవతల చూసుకుందాం' అన్నాడు పిత ృపాదులు. పార్లమెంటులో ప్రశ్నలడిగితే కేంద్రమంత్రి అళగిరి తమిళంలోనే సమాధానం చెపుతున్నాడు. అర్థమైనవాళ్లకు అవుతోంది, కానివాళ్ల సంగతా!? వాళ్ల పాపాన వాళ్లే పోతారు. అసలు ప్రశ్నలెవడడగమన్నాడు?

వీళ్లందరూ చాలనట్టు కనిమొళి అనే కూతురుంది. ఆవిడ పోస్ట్ గ్రాజువేట్. తండ్రిలాగ కవిత్వం రాస్తుంది. రాజ్యసభ మెంబరు చేస్తే చాలదట. మంత్రిని చేయమంటోంది. ప్రస్తుతానికి వూరుకోబెట్టారు. కరుణానిధికి భూమితో రుణం తీరగానే తలైవర్ (నాయకుడు) పదవికి వీళ్లంతా తలపడడం ఖాయం. తలలు తెగిపడాక మిగిలినవాళ్లు జనాల్ని ఏలతారు. ఇదంతా ఎందుకు చెప్పానంటే వీళ్లంతా కరుణానిధికి పుట్టినవాళ్లే. అయినా ఒక్కోరిది ఒక్కో స్టయిల్. వీళ్లలో జగన్ ఏ కేటగిరికి చెందుతాడో చెప్పగలమా?

మరీ అంత పెద్ద కుటుంబంతో పోలిక ఎందుకు? సింపుల్‌గా చెప్పరాదా అంటారా? సరే, చరణ్ సింగ్ కొడుకు సంగతి చూద్దాం. చరణ్ సింగ్ యుపిలో పెద్ద లీడర్. నిజాయితీపరుడు. అవినీతిని సహించడు. మంచి పాలకుడు. రైతులకు మేలు చేయాలని అహర్నిశలూ శ్రమించినవాడు. జట్ (వ్యవసాయ కులం) కులస్తులు అతన్ని దేవుడిలా చూస్తారు. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌ను అతని సామ్రాజ్యంగా వర్ణించవచ్చు. అతనిలో ఒకటే లోపం. ఎలాగైనా ముఖ్యమంత్రి కావాలన్న తొందర. (మన ఎన్.జి.రంగా గారిలాగానే) దాని గురించి కొత్త పార్టీ పెట్టడానికి గాని, ఉన్న పార్టీ చీల్చడానికి గానీ, శత ృపక్షంతో చేతులు కలపడానికి గాని ఒక్క క్షణం కూడా ఆలోచించడు.

ఉత్తరప్రదేశ్ చాలా పెద్ద రాష్ట్రం. పశ్చిమభాగంలో ఒకరికి ఎక్కువ బలం వుంటే, తూర్పుభాగం మరో పార్టీకి పెట్టనికోట. అలాగే పర్వతప్రాంతంలో యింకొకరు. మధ్యప్రాంతంలో మరొకరు. వీళ్లందరూ కలిస్తే తప్ప సుస్థిరప్రభుత్వం ఏర్పడదు. కలవరు. ఒకవేళ కలిసినా ఎవళ్ల ఎజెండా, ఎవళ్ల వోట్‌బ్యాంక్ వాళ్లదే కాబట్టి కొట్టుకు ఛస్తారు. 1967లో కాంగ్రెస్ దేశమంతా బలహీనపడ్డాక యిలాటి మిశ్రమ ప్రభుత్వాలు ఉత్తరాది రాష్ట్రాలలో ఏర్పడ్డాయి. ఉత్తరప్రదేశ్‌లో చరణ్ సింగ్ కూర్చినన్ని, కూలదోసినన్ని ప్రభుత్వాలు మరెవరూ చేసి వుండరు. ఈ ప్రయోగాలు జనాలకు మొహం మొత్తించాయి. దాంతోనే కాంగ్రెస్ మళ్లీ పుంజుకుని ఇందిరా గాంధీ దేశం మొత్తానికి తిరుగులేని నేత అయిపోయింది. 1975లో ఎమర్జన్సీ విధించి చరణ్ సింగ్ వంటి ప్రతిపక్ష నాయకులను జైలుకి పంపించింది ఇందిరా. అందువల్ల అప్రతిష్ట మూటగట్టుకుంది. జైల్లో యీ ప్రతిపక్ష నాయకులందరూ కూడబలుక్కుని 1977లో ఎన్నికలు ప్రకటించగానే జనతాపార్టీ ఏర్పాటు చేశారు. ఇందిర పై కోపంతో జనాలు జనతాపార్టీని గెలిపించారు.

5

ఇక అప్పణ్నుంచి ప్రధాని మొరార్జీ దేశాయ్, ఉపప్రధానులు చరణ్ సింగ్, జగ్‌జీవన్‌రామ్‌ల మధ్య నిరంతరం కొట్లాటలే. మధ్యలో పాత జనసంఘం (ఉత్తరోత్రా బిజెపి) నాయకులు వాజపేయి, అడ్వానీ కాస్సేపు వీళ్లను ఇంకాస్సేపు వాళ్లను సమర్థిస్తూ ఆటలాడారు. అంతర్గత కలహాల వలన జనతా ప్రభుత్వం బలహీనపడింది. ఎలాగైనా ప్రధాని కావాలనుకుని కలలు కన్న చరణ్ సింగ్ బద్ధశత్రువైన సంజయ్ గాంధీతో చేతులు కలిపి మొరార్జీ ప్రభుత్వాన్ని కూలదోశాడు. ఆ పని అతని చేత చేయనిచ్చి ఆ తర్వాత అతని చాపకింద నీళ్లు తెచ్చేశాడు సంజయ్ గాంధీ. అంతే చరణ్‌సింగ్ కుర్చీలోంచి కిందపడ్డాడు. ప్రతం చెడినా ఫలం దక్కలేదు.

అతని అవసానదశలో అతని రాజకీయ వారసత్వం వూరికే పోతోందన్న దుగ్ధ పట్టుకుంది అతని అనుచరులకు. చరణ్ సింగ్‌కు ఒకడే కొడుకు అజిత్ అని. రాజకీయాల్లోకి రావద్దని చెప్పి అతన్ని బాగా చదివించి, ఇంజనీర్‌ని చేసి విదేశాలకు పంపేశాడు తండ్రి. ఇప్పుడు మధ్యవయసులో అతన్ని లాక్కుని వచ్చారు. నా తర్వాత పార్టీని నువ్వే నిర్వహించి యీ వోట్‌బ్యాంక్‌ను కాపాడి, నేను చేసిన తప్పులు చేయకుండా పైకి రా అని ఆశీర్వదించి ఆయన పరలోకానికి వెళ్లిపోయాడు. ఆయనే ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్‌లో రాజకీయాలు సాగిస్తున్న అజిత్ సింగ్.

ఆయన తండ్రి పొరబాట్ల నుండి ఏమీ నేర్చుకోలేదు. తండ్రినుండి వారసత్వంగా వచ్చిన లోక్‌దళ్ అనే పార్టీ పేరు చివర్న వుంచి

ముందు ఏవేవో ప్రిఫిక్స్‌లు చేర్చి కొత్త కొత్త పేర్లతో పార్టీ పెడుతూంటాడు. నాలుగో, ఐదో ఎంపీ సీట్లు తప్ప అంతకంటె ఆయనకు ఎక్కువ రావు. ఓ సారి బిజెపికి మద్దతంటాడు, మరోసారి కాంగ్రెస్‌కు అంటాడు. అటూ యిటూ చూసి మూడో ఫ్రంట్ అంటాడు. ఎలాగోలా తనకు ఓ మంత్రిపదవి సంపాదిస్తాడు. పార్టీకి ఎదుగుదల లేదు, ఉన్నది కరిగిపోతోంది. మళ్లీ వెళ్లి వుద్యోగంలో చేరలేడు. పార్టీ పట్టుకుని వేళ్లాడుతూంటాడు. యువతరమైనా ఆయన పార్టీలో చేరలేదు. ఆయన కులంవాళ్లు వేరేవేరే పార్టీలకు ఓట్లేసేస్తున్నారు. చరణ్ సింగ్ వారసత్వం యిలా నిరుపయోగం అయిపోయింది.

దీనికి విపర్యంగా ఒడిస్సా ప్రస్తుత ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను చూపించవచ్చు. అతని తండ్రి బిజూ పట్నాయక్ ఒడిస్సాలో పెద్ద లీడర్. ఒడిస్సాను గుత్తాధిపత్యంతో పాలించిన మహానేత. తొలుత కాంగ్రెస్‌లో, తర్వాత విపక్షాలలో వున్నాడు. పాలనలో మంచీ, చెడూ రెండూ వున్నాయి. అనేకసార్లు అధికారం పోగొట్టుకున్నాడు. మొత్తం మీద ఒడిస్సా వెనకబడ్డ రాష్ట్రంగానే మిగిలింది. ఆయనా తన కొడుకుని రాజకీయాలకు దూరంగానే వుంచాడు. అతను ఢిల్లీలో, ఫారిన్‌లోనూ చదువుకున్నాడు. ఒడియాభాష సరిగ్గా మాట్లాడలేడు కూడా. ఇంగ్లీషులో గొప్పగొప్ప గ్రంథాలు రాశాడు.

అలాటివాణ్ని బిజూ పోయాక అతని అనుచరులు పట్టుకుని వచ్చి రాజకీయాల్లో ప్రవేశపెట్టారు. బిజూ జనతాదళ్ పేర పార్టీ పెట్టి ప్రజాజీవితంలోకి వచ్చాడు. కట్టూబొట్టూ మార్చేశాడు. ఒడియా నేర్చుకున్నాడు. పాలనపై పట్టు సంపాదించాడు. ఒడిస్సాలో పనులు చకచకా సాగుతాయన్న పేరు వచ్చింది. అతని హయాంలో ఒడిస్సా ప్రగతి సాధిస్తోంది. సాధారణ ప్రజలే కాదు, మీడియా కూడా అతన్ని మన్నిస్తుంది.

2009 ఎన్నికల్లో అతనితో తెగతెంపులు చేసుకుని బిజెపి నాలిక కరుచుకుంది. ఏంటీ ఎస్టాబ్లిష్‌మెంట్ ఒడిస్సాలో పనిచేయలేదు. 21 ఎంపీ సీట్లున్న ఒడిస్సాలో అతని పార్టీకి 3 సీట్లు పెరిగి 14 తెచ్చుకుంది. ఓట్ల శాతం పార్లమెంటు ఎన్నికలలో అయితే 7%, అసెంబ్లీ ఎన్నికలలో అయితే 11.5% పెరిగింది. దేశంలో ఏ ముఖ్యమంత్రికీ లేనంత పాప్యులారిటీ నవీన్ పట్నాయక్‌కు వుందని తేలింది. అతని క్లీన్ యిమేజికి తోడు మహిళలకై పెట్టిన మిషన్ శక్తి, స్వయం సహాయక సంఘాలు మంచి ఫలితాలు చూపాయి, 2 రూ.లకు కిలో బియ్యం పథకం కూడా. మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాడు.

ఇప్పుడు జగన్ మరో అజిత్ సింగ్ అవుతాడా? లేక నవీన్ పట్నాయక్ అవుతాడా? అన్నదే పరిశీలకులను వేధిస్తున్న ప్రశ్న. మనకైతే యీ సమాచారం వ్యాసాలు రాసుకోవడానికి పనికి వస్తుంది. కానీ కాంగ్రెస్ హై కమాండ్‌కి మచ్ మోర్ యిజ్ ఎట్ స్టేక్. పొరబాట్లు చేసి కామధేనువు లాటి ఆంధ్రప్రదేశ్‌ని జారవిడుచుకుంటే.. ఎలా? అందునా అప్పోజిషన్‌లో చంద్రబాబు వంటి చాణక్యుడు వుండగా! యుపిలో పలు పార్టీలున్నాయి, ఒడిస్సాలో కాంగ్రెస్, బిజెపి ప్రతిపక్షంలో వున్నాయి. ప్రస్తుత పరిస్థితిలో ఆంధ్రలో పోటీ కాంగ్రెస్, టిడిపిల మధ్యే వుంది. తాను అటు మొగ్గితే బాబు మళ్లీ అధికారంలోకి వచ్చేసి మరో పదేళ్లపాటు కాంగ్రెస్‌ను తొక్కేయవచ్చు. అందుకే హై కమాండ్‌కు గుంజాటన. ఆచి తూచి అడుగులేయడం.

జగన్ అనుయాయులు యీ డెలికేట్ సిచ్యువేషన్‌ను అర్థం చేసుకోవడం లేదు. వైయస్ పేరును ఎన్‌క్యాష్ చేసుకోకుండా కూచునేటంత వెర్రిది కాదు సోనియా. వైయస్ కుటుంబాన్ని అర్ధాంతరంగా వదిలేస్తే నష్టపోయేది వాళ్లే. రాష్ట్రంలో కాంగ్రెస్ తరఫున మరో నాయకుడు లేకుండా చేసి పోయాడు మహానుభావుడు. ప్రభుత్వం నడపడమంటే రోశయ్య చూసుకుంటారు. కానీ జనాల్లో తిరిగి, రాజకీయం చేసి, అవతలివాళ్లతో బేరసారాలాడి తమవైపు లాక్కునే పని ఎవరు చేస్తారు? ఎవరో ఒకరు కావాలి.

ఆ పని జగన్‌కో, అతను సూచించిన మరొకరికో అప్పగించడానికి హై కమాండ్ సమ్మతించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. ముఖ్యమంత్రి పోస్టులో కూచోబెడితే ఏముంది? తెల్లారిలేస్తే వర్షాలు, వరదలు, అధికారులతో చర్చలు, ఫైళ్లమీద సంతకాలు., అధికారులు దడి కట్టేసి అంతా అద్భుతంగా వుందని రిపోర్టులు రాసి చూపించేయడాలు.

ఇప్పుడున్నది అడ్మినిస్ట్రేటివ్ వ్యాక్యూమ్ కాదు, కాంగ్రెస్ పాలిటి పొలిటికల్ వాక్యూమ్. అది ఎలా పూరించాలి? అన్నదే హై కమాండ్ ఆలోచన. జగన్‌ను డిప్యూటీ సిఎం చేస్తే కాబినెట్ అంతా ఆయన వద్దనే కూచుంటుంది. ఫైళ్లన్నీ అక్కడికే వెళతాయి. రోశయ్య లాఫింగ్ స్టాక్ అయిపోయి ఎందుకొచ్చిన అప్రతిష్ట అనుకుని తప్పుకోవచ్చు. జగన్‌కి ఏదో పోస్టు యివ్వాలనుకుంటే సెంటర్లో ఇండస్ట్రీస్ మినిస్ట్రీ యిచ్చి ప్రాముఖ్యత తేవచ్చు. మారన్ ఐటీ మినిస్టర్‌గా వుండి తమిళనాడుకి ప్రాజెక్టులు తెప్పించి అక్కడ పేరు తెచ్చుకున్నట్టుగా, జగన్ కూడా కడపకీ, అక్కడ యివ్వగా మిగిలితే తక్కిన జిల్లాలకు పరిశ్రమలు తెచ్చి వాటి శంకుస్థాపనలూ, సమీక్షా సమావేశాలూ అంటూ నెలకు యిరవై రోజులు గడుపుతూ రాష్ట్రంలో తన స్థానం బలపరుచుకోవచ్చు.

6

ఇలాటి ఐడియాలు మీకూ, నాకూ వచ్చినపుడు అధిష్ఠానానికి రావా? వచ్చే వుంటాయి. మరి ఆ విషయం జగన్‌కు చెప్పేసి యీ సందిగ్ధం కొనసాగకుండా చూడవచ్చు కదా. జగన్‌కు అపాయింట్‌మెంట్ యివ్వకుండా నాన్చడం దేనికి? పిలిచి ఇదీ సంగతి, యిష్టం వుంటే తీసుకో, లేకపోతే చెక్కేయ్ అనవచ్చు – అని అనిపిస్తుంది కదూ!

ఇవన్నీ అంత సులభమైన పనులు కాదు. సోనియా, జగన్‌ల మధ్య భేటీ అంటూ జరిగితే యిద్దరికీ ఆమోదయోగ్యమైన దానిపై

ఒప్పందం కుదుర్చుకునే బయటకు రావాలి. పరాయిదేశం వాళ్లతో సరిహద్దు వివాదంలా 'ఈ తడవ చర్చలు విఫలమైనా మళ్లీ యింకోసారి కూచుని చర్చిద్దామని అంగీకరించాయి యిరు పక్షాలూ. ఆ మేరకు చర్చలు సఫలమైనట్లే' అని ప్రెస్ రిలీజ్ యివ్వడానికి వీలులేదు. అలా అయితే సోనియా సర్వంసహా అధికారాన్ని ఓ రాష్ట్ర నాయకుడు ఛాలెంజ్ చేసినట్టే!

అందుచేత హై కమాండ్ మధ్యవర్తులద్వారా తమ ఆలోచనలను తెలియబరుస్తూ వుంది. అవి జగన్‌కు ఆమోదయోగ్యంగా వుండి వుండవు. అందుకే యింత కాలయాపన. ఎప్పటికో అప్పటికి యిద్దరిలో ఒకరు పట్టు వీడేదాకా యిది కొనసాగుతుంది. ఈ లోపున బలాబలాల ప్రదర్శన సాగుతూ వుంటుంది. జగన్ తరపునుండి యాక్షన్, హై కమాండ్ తరపునుండి రియాక్షన్. అయితే యాక్షన్ వేగంగా జరుగుతున్నా రియాక్షన్ అంత త్వరగా రాకపోవడానికి కారణం – హై కమాండ్‌కి వున్న యితర పనులు.

మూడు రాష్ట్రాలలో ఎన్నికలు వచ్చిపడ్డాయి. స్నేహపక్షాలతో పొత్తులు, ఎన్నికల ప్రచారాలు, ఖర్చులు.. ఎంత తతంగం వుంది! అందునా మహారాష్ట్ర అంటే దేశానికి ఆర్థికపరంగా గుండెకాయ. హర్యాణా చిన్న రాష్ట్రమే అయినా ఢిల్లీకి దగ్గరలో వున్నది, సంపద సృష్టించే రాష్ట్రం. బిజెపి యిప్పుడు చాలా యిబ్బందుల్లో వుంది. ఇప్పుడే మహారాష్ట్రలో గట్టి దెబ్బ కొట్టేస్తే కిందపడి, లేవడానికి చాలా సమయం తీసుకుంటుంది. బొంబాయిలోని పారిశ్రామికవేత్తల మద్దతు కోల్పోతుంది. బిజెపి–శివసేనలను ఎలాగైనా కొట్టాలన్న పట్టుదల కాంగ్రెస్‌ది.

అసలు యిలాటి టైములో వైయస్ లాటివాడు జీవించి వుంటే కాంగ్రెస్‌కు కొండంత అండగా వుండేది. ఎలక్షన్ ఖఱ్చు విషయంలో కూడా ఎంతో సాయం అందేది. ఆయన పోయాడు. ఇప్పటి పరిస్థితుల్లో రోశయ్యను ఒత్తిడి పెట్టడం ఎలా? వచ్చేవారం వుంటాడో లేడో తెలియని సిఎంను చూసి ఎవరైనా ఒప్పందాలు కుదుర్చుకుంటారా? ఇలా రావలసిన సాయం రాకుండా పోయి గిజగిజ లాడుతూంటే పైగా యీ తిరుగుబాటు ధోరణి ఒకటా? ఇప్పుడు పోనీ కదాని సరేనంటే రేపు మరో రాష్ట్రంలో యింకోడు తల ఎగరేస్తే..?

ఇప్పటికే ప్రజాజీవితంలో సింపతీ ఫ్యాక్టర్ ఎక్కువై పోయింది. ఎవరైనా నాయకుడు పోతే ఆయన వితంతువును తీసుకుని వచ్చి సీటులో కూచోబెట్టేస్తున్నారు. ఆవిడకు రాజకీయాల్లో తిరిగే ఓపికా, ఆసక్తీ వున్నాయో లేదో పట్టించుకోరు. అప్పటిదాకా ఆ నాయకుడి వెంట అత్యంత విశ్వాసపాత్రంగా తిరిగిన కార్యకర్తల నోట్లో కరక్కాయే! అసెంబ్లీలో యిలాటి వితంతువులు ఎంతమందో! పార్లమెంటులోనూ కనబడతారు. అసలు సాక్షాత్తూ సోనియా కూడా అలాటి కాండిడేటే కదా!

ఉద్యోగకాలంలో వుండగా ఉద్యోగి పోతే అతని వితంతువుకు వుద్యోగం యిస్తారు. అదే వుద్యోగం కాదు కానీ, ఆవిడ చదువు బట్టి యిస్తారు. సాధారణంగా గృహిణిగా వున్నవాళ్లే ఎక్కువ మంది వుంటారు కాబట్టి, ఎస్సెల్సీ కూడా పూర్తి చేయనివారుంటారు కాబట్టి, ఫ్యూన్ వుద్యోగమే యివ్వాలి. అలా అంటే బాగుండదని రికార్డు కీపర్ అని ఓ వుద్యోగం యిస్తారు. వాళ్లకు మొదటినుండీ ఆఫీసు వ్యవహారాలపై శ్రద్ధ వుండదు. మధ్యవయసులో చేరతారు కాబట్టి నేర్చుకునే ఆసక్తీ వుండదు. మాజీ కొలీగ్ భార్య కదాన్న గౌరవంతో ఉద్యోగులు ఆవిడకు పని చెప్పరు.

ఇక ఆఫీసుకు రావడం, ఓ మూల కూచోడం, గంటా రెండు గంటలు పని చేయడం, సాయంత్రం కాగానే బయలుదేరడం, పని వున్నా ఆగమని ఎవరూ చెప్పరు. అయ్యో పాపం అన్న జాలి కదా! ఆఫీసు పని ఆ మేరకు కుంటుపడినట్టే! రానురాను దీని దుష్ఫలితాలు చూసి హ్యూమానిటేరియన్ గ్రౌండ్స్‌పై అపాయింట్ చేసే పద్ధతి మానేస్తున్నారు. యోగ్యత వున్నవాళ్లకే వుద్యోగాలు అన్నారు.. మొగుడు పోవడం, తండ్రి పోవడం అర్హతలు కావన్నారు.

ఆఫీసులో క్లర్క్, ఫ్యూన్ వంటి చిన్న పదవుల విషయాల్లో మేలుకొని దీన్ని తగ్గించారు కానీ రాజకీయాల్లో పెంచుకుంటూ పోతున్నారు. గతంలో యీ పద్ధతి యింతగా లేదు. ఉండివుంటే పాతతరం నాయకుల వారసులే తప్ప వేరెవరూ అసెంబ్లీలోకి అడుగుపెట్టేవారు కారు. వాళ్లు, వాళ్ల పిల్లలు, వాళ్ల మనుమలు, మునిమనుమలు... యిలాగే సాగిపోతూ వుండేది. ప్రతీ ఎమ్మెల్యే పేరు చివర ఓ ట్యాగ్‌లైన్ వుండేది .. 'మొగుడి (కాల)ధర్మం', 'తండ్రి (కాల)ధర్మం' అని. కొత్తగా పుట్టుకు వచ్చే నాయకత్వానికి ఛాన్సే వుండేది కాదు.

పాతకాలం రాజరికపు రోజుల్లా రాజుగారు, యువరాజుగారు, తర్వాత వారి యువరాజుగారు.. వాడికి పరిపాలన అంటే రోత ఐనా – యిదే నడిచి వుండేది. ప్రజాస్వామ్యంలోకి వచ్చాం కాబట్టి కొత్త కులాల నుండి, కొత్త ప్రాంతాల నుండి నాయకులు ఉద్భవించారు. రాజరికపు ధోరణే నడిచివుంటే వైయస్ రాజశేఖర రెడ్డి ఎప్పటికీ సిఎం అయ్యేవారే కాదు. కానీ యిప్పుడు మళ్లీ రాజరికం వైపు మళ్లుదాం అంటున్నారు కొందరు. వైయస్‌కు యిద్దరు కొడుకులుంటే ఏం చేసేవారో వీరంతా? సగం మంది అటూ, సగం మంది యిటూ మోహరించేవారా? తమిళనాడులో అళగిరి, స్టాలిన్ అనుయాయుల్లా నిరంతరం కలహించేవారా? ఇంతకీ జగన్ అళగిరి టైపా? స్టాలిన్ టైపా? అది తేలనిదే అధిష్టానం మాత్రం ఏం తేలుస్తుంది పాపం!

7

అధిష్టానం కష్టాలు అధిష్టానానివి. రాష్ట్రంలో బలమైన నాయకుడు వుండాలి, కానీ అతడు తమకు లోబడి వుండాలి. జగన్‌కు వున్న బలమెంత? ముఖ్యంగా అతను తమకు లోబడతాడా? అన్న విషయం తేలేదాకా వాళ్లు నిర్ణయం తీసుకోరు. జగన్ రాజకీయబలం

యిప్పటిదాకా తెలియదు. ఇప్పటివరకూ అతను సూర్యుడి కాంతిలో మెరిసిన చంద్రుడు. అతనికి స్వయంప్రకాశం వుందా లేదా అన్నది గోదాలోకి దిగితే తప్ప తేలదు. గోదాలోకి దింపకుండా గద్దెపైన కూచోబెట్టేద్దామని తాపత్రయ పడిన అనుయాయుల వల్లనే రాష్ట్రంలో యింత గందరగోళం.

వాళ్లు ఎందుకింత తొందర పడుతున్నారు అని విసుక్కుంటున్నాం కదూ. ఈ నిరసనలేమిటి? ఈ రాజీనామా బెదిరింపులేమిటి? ఇలా మునిసిపల్ కౌన్సిల్ సమావేశాల కెళ్లి తమ పార్టీ వాళ్లనే కొట్టడమేమిటి? పార్టీ సభ్యత్వ నమోదులను అడ్డుకోవడమేమిటి? ఇలా చేస్తే ఏ పార్టీయైనా వూరుకుంటుందా? అన్న ఆలోచన లేకుండా చేస్తున్నారని చికాకు వస్తోంది కదా. వీళ్లవలన జగన్‌కి నష్టం వాటిల్లుతోందని కాంగ్రెస్ అభిమానులు సైతం ఫీలవుతున్నారు కదూ. పాపం జగన్ అనుయాయులకూ కష్టాలున్నాయి.

జగన్‌కు స్వయంప్రకాశం ఏ మేరకు వుంది అన్నది అనుయాయులకు కూడా తెలియదు కదా. రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రుల తనయులు చాలామంది కనబడుతున్నారు. పి.వి. నరసింహారావుగారి అబ్బాయి పి.వి.రంగారావు, జలగం వెంగళరావు గారబ్బాయి ప్రసాదరావు, మర్రి చెన్నారెడ్డిగారి అబ్బాయి శశిధర్ రెడ్డి, కోట్ల విజయభాస్కర రెడ్డిగారబ్బాయి సూర్యప్రకాశరెడ్డి, కాసు బ్రహ్మానంద రెడ్డి గారి పెంపుడు కొడుకు వెంగళరెడ్డి... వీళ్లందరూ తమ తమ తండ్రుల ప్రతిభాపాటవాలను, రాజకీయ చతురతను పుణికి పుచ్చుకున్నారా? పుచ్చుకుని వుంటే యిలా ఎందుకు వుంటారు? తమ తమ నియోజకవర్గాలకే ఎందుకు పరిమితమవుతారు?

జగన్ కూడా వీళ్ల కేటగిరీలో చేరితే...? అన్న భయం వీళ్లను పీడిస్తోంది. వేడిలో వుండగానే మోదాలన్న సిద్ధాంతం ప్రకారం వైయస్ మృతితో వువ్వెత్తున లేచిపడిన గుడ్‌విల్ ఆధారంగా యిదే వూపులో ముఖ్యమంత్రి చేసేయాలని వాళ్ల ఆరాటం. ఆ ఆరాటంలో చాలా తప్పులే చేశారు. ఇప్పుడు ఎమ్మెల్యే శంకరరావు వెల్లడించారు – వైయస్ మృతదేహం వుండగానే పక్కగదిలో జగన్‌కై సంతకాల సేకరణ మొదలెట్టారని.

వినగానే వెగటు పుట్టించే సమాచారం, వైయస్‌తో ప్రత్యక్ష పరిచయం లేని ఎందరో సామాన్యులు గుండె పగిలి ఓ పక్క ఛస్తూ వుంటే ఆయనతో సన్నిహితంగా మెలగిన అనుయాయులు హృదయం లేకుండా దర్బారు కుట్రలు, కూహకాలూ యింత అర్జంటుగా జరపడమా? అని. (వైయస్ మరణానంతరం ప్రజలు పోయారనడం బోగస్ అని హనుమంతరావు అంటే అనవచ్చు కాక, నేను ఒప్పను. అలా అని 600 సంఖ్యా నమ్మను. ఆయన పోయిన మొదటి రెండు రోజుల్లో పోయినవారినే లెక్కలోకి తీసుకుని, దానిలో 60-70% మందిని తీసుకుంటే ఏ వందకో తేలుతుందనుకుంటా. అది నమ్మవచ్చు. వైయస్ పట్ల వెల్లువెత్తిన ప్రజాభిమానం ఫోర్స్ చూశాం కదా).

జగన్‌ను సిఎం చేయకపోతే రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తాం లాటి స్టేటుమెంట్లు యిచ్చేవారు సామాన్యప్రజలను ఎంత మండించారో వాళ్లకు తెలుసా? కాంగ్రెస్‌కు వచ్చిన వోట్లే 36%, దానిలో ఎన్ని మన్‌మోహన్‌ను చూసి వేశారో, ఎన్ని సోనియాను చూసి వేశారో, ఎన్ని స్థానిక అభ్యర్థిని చూసి వేశారో! అచ్చగా వైయస్ పథకాలే చూసి వేసినవారు ఎందరుంటారు? ఓ 25% అనుకుందామా? వైయస్‌కు వేసిన 25% మంది అతని సంతానానికి వేసేస్తారా? ఎందుకు వేయాలి?

నేను రాసిన ఆర్టికల్స్ చదువుతున్నారు కదాని రేపు మా పిల్లలు ఆర్టికల్స్ రాస్తే అవీ యింతమందీ చదువుతారా? వైయస్‌కున్న యిద్దరు పిల్లల్లో ఆయన రాజకీయ వారసత్వం ఆయన కొడుక్కే వచ్చిందని ఎందుకనుకోవాలి? కూతురికి రాకూడదా? అల్లుడికి రాకూడదా? ఎన్టీయార్‌కు ఫుట్‌బాల్ టీమంత కొడుకులూ, కూతుళ్లూ. కానీ రాజకీయవారసత్వం అల్లుడికి దఖలు పడింది. అదీ పూర్తిగా దఖలు పడలేదు.

ఇలాటి పరిస్థితిలో వైయస్‌కు 25% మద్దతుంటే జగన్‌కు ప్రజల్లో ఏ 20% మద్దతో వుందనుకుందాం – మాట వరసకి. ఈ మద్దతుతో సిఎం చేయకపోతే రాష్ట్రం అగ్నిగుండం చేసేస్తారా? వీలైతే యిప్పుడు వరదలు వచ్చిన సమయంలో చేసేయమనండి. అంత శక్తే వుంటే వరదలు ఆపేయకూడదూ, బతికిపోతాం. జగన్ కూడా ఎందుకు, అలా కావాలనుకున్నప్పుడల్లా అగ్ని పుట్టించేవారిని, వర్షాలు కురిపించేవారినీ డైరక్టుగానే సిఎం చేసేద్దాం.

ఎందుకీ అధికప్రసంగం? 'టిడిపిని, బాబును ఫినిష్ ఐపోతారన్న వైయస్ మర్నాడు తనే 'ఫినిష్' అయిపోయారు. జిందాబాద్‌కు వ్యతిరేకంగా 'ముర్దాబాద్' అని స్లోగన్స్ యిస్తే మొరార్జీ దేశాయ్ వారించేవారు, 'ఎవరి చావూ కోరకండి, మంచిది కాదు' అని. ఆయన ఆల్మోస్టు నూరేళ్లు బతికాడు, అదీ చివరివరకూ పరిపూర్ణ జ్ఞాపకశక్తితో. రాజకీయాల్లో యిదివరకు యింత బహిరంగ పరదూషణ వుండేది కాదు, ఇప్పుడు మోతాదు ఎక్కువైంది. పరిణామాలు చూస్తున్నాం.

జగన్ యువనేత. ఆయన శక్తియుక్తులు తండ్రిని మించి కూడా వుండవచ్చు. అవి బయటపడేందుకు సమయం యివ్వాలి, సందర్భం కల్పించాలి. రాజీవ్ గాంధీ రాజకీయాల్లో వచ్చిన కొత్తల్లో ఆయనకు ఆసియాడ్ ఆటల పోటీల నిర్వహణ అప్పగించారు. ఆయన నాయకత్వసామర్థ్యం బయటపడింది. ఇప్పటివరకు జగన్ కథ పరిశ్రమలకే పరిమితమైంది.

8

ఆ పరిశ్రమలు కూడా జగన్ స్వహస్తాలతో కష్టపడి యిటిక యిటిక పేర్చి కట్టినవి కావు. ఆయన పుట్టడమే నోట్ల వెండి చెంచాతో పుట్టాడు. తండ్రి ఆస్తి వుంది, పలుకుబడి వుంది. దాన్ని జాగ్రత్తగా అందిపుచ్చుకుని అవకాశాలు వినియోగించుకుంటూ పైకి వచ్చాడు.

అంతవరకూ శభాష్. కానీ వ్యాపారవేత్తలందరూ రాజకీయనాయకులు కాలేరు. అలా అయితే రాజకీయాల్లోకి వచ్చిన వ్యాపారవేత్త టి.టి.కృష్ణమాచారి ప్రధానమంత్రి కావలసినవాడు. వ్యాపారంలో అందె వేసిన చేయి ఐన చంద్రబాబు 2004లోనూ, 2009లోనూ గెలిచి వుండేవారు.

రాజకీయాలనేది వేరే తరహా క్రీడ. ఎంత కష్టపడినా ప్రయోజనం వుండకపోవచ్చు. ప్రజలకు ఎంత మంచి చేసినా వారు ఆమోదించకపోవచ్చు. దానికి చాలా ఓపిక కావాలి. ఓర్పు వుండాలి. అటు పై వారికి ఒదగాలి, యిటు కిందవారిని అదమాయించాలి. యువరాజులందరూ మహరాజులు కాలేరు. అయినా రాణించలేరు. అందుకే పాతరోజుల్లో యువరాజుల మధ్య రకరకాల పోటీలు పెట్టేవారు. ఇంత చేసి ఎవర్నో ఎంపిక చేసినా సింహాసనం దక్కనివారిలో గట్టివాడుంటే వాడు యీ రాజుగారి తల యెగరేసి వాడే రాజై పోయేవాడు.

ఈ రాజకీయపాటవం అనేది నిదానం మీద తేలవలసిన విషయం. దీన్ని అధిష్టానాన్ని బ్లాక్‌మెయిల్ చేసో, ప్రజల్ని అడలగొట్టో సాధించాలనుకునే వ్యూహం పొరబాటు. రేపు సిఎం చేశాక, 'మా నాయకుడు చెప్పిన కాండిడేట్‌కు ఓటేయక పోయారో మీ నియోజకవర్గం అగ్నిగుండమే' అంటే..? ఈ జాడ్యం జిల్లాల వరకూ పాకి 'మేం చెప్పిన నాయకుణ్ని జిల్లా ప్రతినిధిగా చేయకపోతే జిల్లా అగ్నిగుండమే' అని జిల్లా నాయకులు జగన్‌ను బెదిరిస్తే...? దీనికి అంతం ఎక్కడ?

మంత్రుల దగ్గర్నుంచీ పాల్పడుతున్న యీ బ్లాక్‌మెయిలింగ్‌కు ఏ మేరకు లొంగాలి అన్నది అధిష్టానం ముందున్న సమస్య. సిఎం చేయకపోతే జగన్ పార్టీ చీలుస్తారా? ఎంతమంది అటు? ఎంతమంది యిటు? ఏ 60 మందినో జగన్ పట్టుకుపోతే ఆ గ్యాప్ పూరించడం ఎలా? మజ్లిస్ ఎటూ వుంది, ఇండిపెండెంట్లను ఏర్పాటు చేసుకోవచ్చు. పీఆర్పీ మద్దతు కోరవచ్చు. తెలంగాణా పేరు చెప్పి తెరాసను ఆకట్టుకోవచ్చు. టిడిపిలో చీలిక తెచ్చి బయటనుండి మద్దతు యిమ్మనమని కోరవచ్చు.

క్రమేపీ జగన్ వర్గం బలహీనపడితే వారిలోంచే లాక్కోవచ్చు. ఇవేమీ నడవకపోతే టిడిపియే తన్నుకుపోవచ్చు. అలాటి పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన విధించి అసెంబ్లీని సుషుప్తస్థితి (సస్పెండెడ్ యానిమేషన్)లో వుంచి యీ బేరసారాలు ముగిసాక అప్పుడే అసెంబ్లీని సమావేశ పరచవచ్చు. ఇంత తతంగం లేకుండా జగన్ బలవంతుడిగానూ, విధేయుడిగానూ తేలితే అతనికే అప్పగించవచ్చు. దేనికైనా టైము కావాలి, తీరిక కావాలి.

అలా టైమిస్తే అధిష్టానం తన మాట నెగ్గించుకుంటుందేమోనని జగన్ క్యాంప్ భయం. అందుకనే వూదరగొట్టడానికి పూనుకున్నారు. రోశయ్య ఎందుకూ పనికిరానివాడని ప్రకటనలు యిప్పించారు. నిధులు లేక వైయస్ బియ్యం కోటా పెంపు హామీని అమలు చేయలేమంటే సాక్షి పేపరు హెడ్‌లైన్స్‌లో రోశయ్య ప్రభుత్వాన్ని కడిగిపారేసింది. బోగస్ కార్డుల ఏరివేతకూ, దీనికి లింకేముందని ప్రశ్నించింది.

రోశయ్య చేతకానివాడని నిరూపిస్తే ప్రజలంతా బాబువైపు దృష్టి సారిస్తారు తప్ప యిప్పటిదాకా నిగ్గు తేలని జగన్ వైపు సారించరని తట్టలేదు 'సాక్షి'కి. జగన్ క్యాంపు ధర్మమాని కాకా, కేకే, కిచకిచ.. అందరూ మహానాయకులై పోయారిప్పుడు. వైయస్ వీళ్లందరికీ పళ్లూడదీసి మూల కూచోబెడితే జగన్ క్యాంపుని ఎదుర్కోవడానికి అధిష్టానం వూళ్లని వుసికొల్పింది. వీళ్లు కుచ్చిళ్లు సవరిస్తున్నారు. ఈ వానపాములకు బుసకొట్టే ఛాన్సు కలిగించిన ఘనత మాత్రం జగన్ క్యాంపుదే.

ఎందుకిలా జరిగింది? ఎవరు దీనికి కారకులు? జగన్ చుట్టూ చేరిన మనుష్యులు! కెవిపికి తెలియదా? రాజకీయాల్లో ఓర్పు ఎంత ముఖ్యమో! పార్లమెంటు సభ్యులు కావడానికి ఆయన ఎన్నేళ్లు నిరీక్షించారు? ఢిల్లీతో నిరంతరం వ్యవహారాలు నడిపే ఆయనకు వారి మనస్తత్వం ఎలాటిదో తెలియదా? ఇలా సామంతరాజులు తిరుగుబాటు చేస్తే ఎలా అణిచివేస్తారో తెలియదా? సంతకాల సేకరణ, రాజీనామా బెదిరింపులు యివన్నీ జగన్ పట్ల ప్రజలకు సహజంగా పుట్టే సానుభూతిని హరించివేస్తాయని తెలియదా?

వైయస్ రాజకీయ ఉత్థానపత్థనాలు జగన్ కంటె కెవిపికే బాగా తెలుసు – ముప్పయేళ్లగా అంటిపెట్టుకుని వున్నారు కాబట్టి. కడప జిల్లా వాసులు వైయస్ వద్దకు వచ్చి 'ఇంత మహానాయకుడివి, నువ్వింకా సిఎం కాకపోవడమేమిటి?' అని వూదరగొట్టడం వలననే వైయస్ పోరాటం చేసి అసమ్మతి నాయకుడిగా ముద్రవేయించుకున్నారని తెలుసు. ఆ ముద్రే ఆయన్ను అన్నేళ్లు అధికారానికి దూరంగా వుంచిందని తెలుసు. తీరా అధికారం చేతికి అందేసరికి విధి వక్రించిందని తెలుసు. ఈ రోజు జగన్ చుట్టూ అటువంటి శక్తులే చేరి వూదరగొడుతూంటే ఆయన వారించలేడా? గతం చెప్పి శాంతింపజేయలేడా? రాజీనామాలు చేస్తామని రోశయ్యను బెదిరించకండి అని జగన్ యివాళ యిచ్చిన స్టేటుమెంట్ లాటిది వైయస్ సంతాపసభలో మాట్లాడనీయకుండా డియస్‌ను అల్లరిపెట్టినపుడు యిప్పించలేదేం? హైకమాండ్ దృష్టిలో జగన్‌ను బద్‌నామ్ చేయించడానికా?

కెవిపి మనోగతం ఏమిటో ఎవరికి తెలుసు? 'రాజమకుటం' సినిమాలో సేనాపతి యువరాజును మిస్‌లీడ్ చేసి తన తండ్రిని చంపినవారిని వురి తీయించమని ఆర్డర్ తీసుకుంటాడు. ఆ ఆదేశం పట్టుకుని పాతరాజు భక్తులందరినీ వురి తీయించి ప్రజలందరికీ యువరాజుపై ఏహ్యత కలిగేట్లు చేస్తాడు. దాంతో యువరాజుకి యింటా, బయటా అంతటా శత్రువులే! రాజకీయం అంటే యిలా వుంటుంది. దాన్ని అర్థం చేసుకోవడం మహా కష్టం. (ఎన్టీయార్ తర్వాత టిడిపి వుంటుందని, కొడుకులకు కాకుండా అల్లుడికి వారసత్వం దక్కుతుందని ఎవరైనా వూహించారా?) రానున్న కథను తెరపై చూసినతర్వాత మళ్లీ మాట్లాడుకుందాం. ప్రస్తుతానికి యీ సీరీస్ సమాప్తం. **– ఎమ్బీయస్ ప్రసాద్**